ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. ఈ కోర్కె తీరేదికాదు—వసుంధర
21. సంగీత సామ్రాట్—మల్లిక్
32. వాడిని వురితీయండి—వాణిశ్రీ
51. ఛాతీలో కత్తి—బొమ్మిడి అచ్చారావు
71. దొంగలను పట్టే గజదొంగ—జొన్నలగడ్డ రామలక్ష్మి
89. అర్ధరాత్రి అబలలు—సుజనశ్రీ
118. కత్తిరించిన గోళ్ళు—వాణిశ్రీ
138. రక్తపు మరకలు—క్రిష్ణవేణి
148. టుమ్రీ వేషగాడు—టుస్సా బాలచందర్
163. హంతకుడొస్తాడు జాగ్రత్త—ఎమ్.వి.వి. సత్యనారాయణ
178. కాంచన గ్రహం (సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. ఎనిమిది కుర్చీలు—వసుంధర
50. నాలుగో చక్రం—సికిందర్
116. విగ్రహం ఇచ్చిన క్లూ—ఎమ్.వి.వి. సత్యనారాయణ
147. సీతా కళ్యాణం—టెంపోరావ్
160. రక్తం త్రాగే పిశాచం(సీరియల్)—వసుంధర

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, జోక్స్, మరెన్నో ఆకర్షణలు!!

ఈ కోర్కె తీరేదికాదు!

వసుంధర

171



చంద్రానికి ఎవ్వరూ లేరు. అతడు ఊరివారి దయాధర్మం మీద ఎలాగో మెట్రిక్ అయిందనిపించాడు. ఆ తర్వాత నుంచి ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఎక్కడా దొరకలేదు.

చంద్రం వీలున్నపుడల్లా సినిమాలు చూస్తూండేవాడు. వాటిలో హీరోలు తనలాగే బ్రతుకు ప్రారంభించి చివరికి ఎంతో గొప్పవారై పోతూంటారు. అది చూసి చంద్రం ఏదో ఒక రోజున తనూ అలాగే అయిపోతాననుకున్నాడు. ఏళ్ళు గడిచినా అలాంటి అవకాశమేదీ వెతుక్కుంటూ రాలేదు.

చంద్రానికి భవంతుల్లో నివసించాలనీ, కార్లలో తిరగాలనీ, అంతా తన్ను ఆరాధించాలనీ కోరిక. అయితే అతి కష్టంమీద అతడికి కోమటి గుమస్తా ఉద్యోగం దొరికింది. పని ఎక్కువ—జీతం తక్కువ. తన కోరికలు ఎప్పటికీ తీరే ఉపాయం కనబడలేదు.

చివరికి చంద్రం విసిగిపోయాడు. ఇలా బ్రతకడం కంటె చావడం మెరుగనిపించిందతడికి. చావాలన్న కోరిక క్రమంగా పెరిగి పెద్దదై ఓ రోజు అతను ఆత్మహత్య చేసుకుందామని ఊరి చివరనున్న ఓ పెద్ద కొండ ఎక్కాడు.

చంద్రం అనుకున్న దొక్కటి—జరిగిన దొక్కటి: తను చావాలనుకుని అక్కడికి వెళ్ళిన చంద్రం అక్కడ చావబోతున్న మరో వ్యక్తిని రక్షించాడు.

చంద్రం రక్షించిన మనిషి పేరు బలరాం. అతడి వయస్సు నలభై అయిదుంటుంది. అతడు తనను చంద్రం రక్షించినందుకు ఏమాత్రమూ సంతోషించక — "నన్నెందుకు చావనివ్వలేదు!" అని నిలదీశాడు.

"నేనూ చావాలనే ఇక్కడికి వచ్చాను. కానీ భగవంతుడు నా కింకో పని అప్పజెప్పాడు. అదే చేశాను. అయినా చావాలనుకునేటంత కష్టం మీకేం వచ్చింది?" అనడిగాడు చంద్రం.

"నా సంగతి తరువాత చెబుతాను. ముందు నీ సంగతి చెప్పు. నువ్వు చావాలని ఎందు కనుకున్నావు? చూడబోతే కుర్రాడిలాగున్నావు" అన్నాడు బలరాం.

"నేను కుర్రాడినే. నాకు పాతికేళ్ళు. పదేళ్ళనుంచి ఎదుగూ బొదుగూ లేని జీవితం. నాకు నా అన్నవాళ్ళెవ్వరూ లేరు. ఆప్యాయంగా పిలిచి పలకరించే వారు లేరు. దర్జాగా బ్రతుకుదామంటే డబ్బులేదు. భూమిమీద వున్న కోట్లాది క్రిమికీటకాలలాగే నేనూ జీవిస్తున్నాను. ఇలా జీవించడం నా కిష్టం లేదు" అన్నాడు చంద్రం.

బలరాం వెంటనే—"నీ అంతటి అదృష్టవంతుడెక్కడా వుండడు. నీకేం లోటు వచ్చిందని చావాలనుకుంటున్నావు? నా సంగతి విను. నాకు తలిదండ్రులే కాదు—తాత, బామ్మ కూడా బ్రతికున్నారు. పెళ్ళాముంది. ముగ్గురు చెళ్ళెళ్లున్నారు. ఇద్దరు తమ్ముళ్లున్నారు. నాకు నలుగురు పిల్లలున్నారు. ఇంకా పుట్టేవాళ్ళే కానీ ఆపరేషన్ చేయించేసుకున్నాను. పిల్లలెక్కువైతే పోషించడం గురించి బెంగ పెట్టుకుని ఆ పని చేయలేదు. ఆపరేషన్ చేయించుకుంటే పాతిక రూపాయలిస్తారు గదా అని—నేనూ మా ఆవిడా కూడా విడివిడిగా ఆపరేషన్లు చేయించుకున్నాం.

దర్జాగా బ్రతకాలని నాకుంది. ఈ లోకంలో దర్జాగా బ్రతకాలంటే నాకు తెలిసి రెండే రెండు మార్గాలున్నాయి. పెద్దమనిషిలా కనిపిస్తూ పదిమందినీ మంచి మాటలతో మోసం చెయ్యాలి. లేదా దొంగతనాలు చెయ్యాలి. మొదటిది నాకు చేతకాదు. రెండోది చేద్దామంటే—ఒక చిన్న పొరపాటు జరిగినా నామీద ఆధారపడ్డవాళ్ళ బ్రతుకులు అధ్వాన్నమవుతాయి. నేను జైలుపాలయ్యానంటే మా యింట్లో ఇంకెవ్వరికీ తిండివుండదు. నా తమ్ముళ్ళ కుద్యో

గాలు దొరకవు. నా చెల్లెళ్ళకు పెళ్ళిళ్లు కావు. నా పిల్లల జీవితం అంధకారమవుతూంది. ఇన్ని ఆలోచించుకుని ఏ తప్పూ చెయ్యలేకపోతున్నాను.

అయితే ఒక్కణ్నీ ఎన్నాళ్ళని నా నెత్తిమీదున్న ఈ బాధ్యతలన్నీ భరించగలను? సంపాదించేది ఏ మూలకీ చాలడం లేదు. వాళ్ళందర్నీ పైకి తీసుకురావడం నావల్ల కాదని తెలిసిపోయింది. నా కళ్ళముందే నా పిల్లలు అర్ధాకలితో మాడుతున్నారు. నా కళ్ళముందే నా పెద్దలు జబ్బుకు మందులు లేక అవస్థపడుతున్నారు. ఇవన్నీ చూస్తూ ఎలా బ్రతకను?

చూస్తూ చూస్తూ నా ఇంటి ఆడవాళ్ళని పనిమనుషులుగానూ, నా తమ్ముళ్ళను కూలీలుగానూ మార్చలేను. నేను లేకపోతే వాళ్ళకీ బాధలుండవు. ఏ పనైనా చేసుకుని ఎలాగో అలాగ కడుపునిండా తింటారు. అందుకే నేను చావాలనుకున్నాను. కానీ నువ్వు నన్ను చావనివ్వలేదు. ఇప్పుడేం చేయాలో నాకు పాలుపోవడం లేదు"— అన్నాడు.

చంద్రం దిగులుగా — "మీ దురదృష్టం అర్థమవుతున్నది. కానీ నా అదృష్టమే నాకు తెలియకుండా పోతున్నది" అన్నాడు.

"నా అన్నవాళ్లు లేకపోవడమే నీ అదృష్టం. డబ్బు సంపాదించాలంటే నువ్వు దొంగతనానికూడా పోవచ్చు. నీ నేరాల ప్రభావం నీ కుటుంబంపై పడదు. వెడితే జైలుకెడతావు. లేదా హాయిగా జీవిస్తావు?" అన్నాడు బలరాం.

చంద్రాని కది నిజమే ననిపించింది. ఇంతకాలం తనకిది తట్టలేదేం? ఎన్నాళ్ళని అర్థంలేని బ్రతుకు బ్రతుకుతాడు?

ఆ క్షణంలోనే చంద్రం దొంగతనం చేయాలని నిర్ణ

యించుకున్నాడు. అయితే అది అమల్లో పెట్టడానికి రెండు రోజులు పట్టింది. దొంగతనం చేయాలనుకొనడం వరకూ బాగానే వుంది. కానీ ఎక్కడ ప్రారంభించాలి? ఎలా ప్రారంభించాలి?

చాలా ఆలోచించాక చంద్రం ఓ నిర్ణయానికి వచ్చాడు. ముందుగా దొంగతనం చిన్నచిన్న యిళ్ళలో ప్రారంభించాలి. ఆ తర్వాతనే నెమ్మదిగా పెద్దిళ్ళలో దొంగతనానికి వెళ్ళాలి.

2

దొంగతనానికి చంద్రం ఓ యింటినెన్నుకున్నాడు. ఆ యిల్లు ఓ వీధిలో చివరన వున్నది. దానికి చిన్న ప్రహరీ గోడ వున్నది. గోడనానుకుని వీధి పక్కకు ఓ తలుపు వున్నది. తలుపు కాస్త బలహీనంగా వున్నది. ఇంట్లో జనం ఆట్టే మసుల్తున్నట్లు కనబడరు.

ఓ రాత్రి పదిగంటల వేళ చంద్రం దొడ్డిగుమ్మం దగ్గర తలుపు తోసుకుని ఆ యింట్లో ప్రవేశించాడు. ఆ యింటికి దొడ్డి చిన్నది. అతను నెమ్మదిగా యింటిని సమీపించాడు. దొడ్డివైపుకు వున్న తలుపు నెమ్మదిగా తోశాడు. ఆశ్చర్యం ఆ తలుపులు వెంటనే తెరుచుకున్నాయి.

చంద్రం ఓ సారి బొడ్లో తడుముకున్నాడు. ఇందుకని ప్రత్యేకంగా కొనుక్కున్న చాకు తగిలింది. తృప్తిగా నిట్టూర్చి జేబులోంచి బ్యాటరీ లైటు తీసి వేసి చూశాడు.

అక్కడ అతడికి ఆకర్షణీయమైన వస్తువులేవీ కనబడ లేదు. అది వంటిల్లు కాబోలు—ఓ కుంపటి వుంది. మూలగా ఓ బొగ్గుల బస్తావుంది. అందులో బొగ్గులు చివరకు వచ్చేశాయి. ఓ స్టీలు కంచం రెండు గ్లాసులు కొద్దిగా పాత్ర సామాను, డబ్బాలు కనబడుతున్నాయి. చంద్రం అక్క-

ణించి కదిలాడు. ఇంటికి కరెంటులేదు. అందువల్ల తనకి బ్యాటరీలైటే శరణ్యం.

తను వాకబు చేశాడు. స్టీలుసామాను పాతదైనా సరే కొనేవాళ్ళున్నారు. అలాగే బట్టలు కొనేవారూ వున్నారు. తన మొదటి దొంగతనంలో ఆ మాత్రం దొరికినా చాలు. చంద్రం మొత్తం ఇల్లంతా తిరిగాడు.

వంటిల్లు కాక ఓ హాలు, రెండు గదులు వున్నాయి. వాటిలో ఓ గదిలో ఓ యువతి నిద్రపోతోంది. ఆ గదిలో మూలగా వత్తి తగ్గించిన హరికెన్ లాంతరు వుంది. చంద్రం మూలకు వెళ్ళి వత్తి పెద్దదిచేసి చేతిలోకి బాకును తీసుకుని ఆ యువతిని సమీపించాడు.

ఆ యువతి ఎవరో కానీ చాలా అందంగా వుంది. గాఢనిద్రలో వున్నట్లుంది—పంటిమీద ఆచ్ఛాదనలు సరిగ్గా లేవు.

ఒక్క క్షణం చంద్రం యువక హృదయం చలించింది. అప్పుడు చంద్రం గుర్తుచేసుకున్నాడు. అతను అద్దెకు తెచ్చే డిటెక్టివ్ నవలల్లో రాసివుంటుంది—దొంగకు ఏకాగ్రత అవసరం. తను వచ్చినపని చేసుకుపోవాలి తప్పితే ఇతరత్రా దృష్టి మరలనివ్వరాదు. అదే తనను పట్టిస్తుంది. ఏకాగ్రత గుర్తురాగానే చంద్రం యువతి కాళ్ళవంకా, చేతులవంకా, మెడవంకా చూశాడు. ఎక్కడా ఆభరణాలు లేవు. ఆ మంచానికి ఆమె మాత్రం ఓ ఆభరణంలా వుంది.

గదిలో మరోమూల ఓ పాత ట్రంకుపెట్టి వుంది. చంద్రం ఆశగా అటు నడిచాడు. నెమ్మదిగా పెట్టెమూత తెరిచాడు. కిర్రుమంటూ పెద్ద చప్పుడయింది.

"ఎవరూ?" అంటూ ఆమె లేచి కూర్చుంది.

చంద్రానికి ముందు భయంవేసింది. చేతిలోని బాకున్ను

చూసి ధైర్యం తెచ్చుకుని "హమ్మయ్య చేతిలో బాకు వుంది. గదిలో వున్నది ఆడపిల్లే. అందువల్ల ఫరవాలేదు" అనుకున్నాడు.

"ఎవరూ?" అంది మళ్ళీ యువతి.

చంద్రం ఆమెను సమీపించి బాకును చూపించి బెదిరించి "ఇష్ అరవకు" అన్నాడు.

"అరవకు అని చెబితే చాలదూ-మళ్ళీ ఆ బాకెందుకూ చూపిస్తావు. అది చూస్తే భయంవేసి అరవాలనిపిస్తుంది" అందా యువతి.

చంద్రం ఆమె గుండెనిబ్బరానికి ఆశ్చర్యపోయాడు. అయినా గంభీరంగా "నేను వేళాకోళమాడ్డంలేదు. అరిస్తే చంపేస్తాను" అన్నాడు.

"తీరికూర్చుని నేనెందుకు అరుస్తాను? నేనేమైనా చంటి పిల్లననుకున్నావా? నువ్వెందుకొచ్చావో చెప్పు. చేతనైన సాయం చేస్తాను" అందా యువతి.

"నేను దొంగతనాని కొచ్చాను" అన్నాడు చంద్రం.

యువతి నవ్వి "అనుకున్నాను కానీ నమ్మలేక పోయాను" అంది.

"నన్ను చూస్తే నీకు భయం వేయడంలేదా?" అన్నాడు చంద్రం.

"భయమెందుకు? నేను నిన్నేమీ అల్లరి పెట్టనుగా. నీక్కావలసింది నువ్వు తీసుకుని వెళ్ళిపో"—అందా యువతి.

చంద్రం మళ్ళీ మూలకు వెళ్ళి పెట్టె తీశాడు. అందులో రెండు మంచి చీరలున్నాయి. అతుకులు వేసిన లంగాలు రెండు. గుడ్డబాడీలు రెండు. నాలుగు నల్లరంగు జాకెట్లు వున్నాయి.

చంద్రం రెండు మంచిచీరలూ తీసుకుని మళ్ళీ ఆ యువతి దగ్గరకు వచ్చి "ఇవీ వంటింట్లోని సామానూ తీసుకువెడుతున్నాను" అన్నాడు.

"అయ్యబాబోయ్ నువ్వు నిజంగానే దొంగవే!" అందా యువతి.

Fel 82(6) 171

"ముందే చెప్పానుగా" అన్నాడు చంద్రం.

"ఆ రెండుచీరలూ పట్టుకుపోయావంటే నాకు కట్టుకుందుకు మంచిచీరలుండవు. ప్లీజ్ అవి తీసుకువెళ్ళొద్దు" అందా యువతి.

"దొంగలు ఎదుటివాళ్ళ అవసరాలు చూడరు. ఇవి అమ్ముకుంటే నాకు డబ్బొస్తుంది" అన్నాడు చంద్రం.

యువతి ఓ క్షణం ఆలోచించి "ఆ రెండు చీరలూ కలిపి నేను ఎనభై రూపాయలకి కొన్నాను. నువ్వు అమ్మితే వాటికి ఎవరూ పట్టుమని పాతిక రూపాయలు కూడా యివ్వరు. ఆ డబ్బు నీకు నేనే యిస్తాను. ఆ చీరలుంచేయి" అంది.

"నీ దగ్గర డబ్బు కూడా వుందా? అది కూడా యిలా గియ్యి" అన్నాడు చంద్రం.

"ఒక్కసారి పాతిక రూపాయలు నేనెక్కణ్ణించి తెచ్చివ్వగలను? నేనెలా బ్రతుకుతున్నానో నీకు తెలుసుంటే యిలాగనవు" అందా యువతి.

చంద్రం ఆమెవంక చిరాగ్గా చూశాడు.

"నేను మా అన్నా వదినెల దగ్గరుండేదాన్ని. వదిన నన్ను అష్టకష్టాలు పెడుతుంటే భరించలేక పారిపోయాను. ఈ ఊళ్ళో నాలుగిళ్ళలో ప్రయివేట్లు చెప్పుకుంటున్నాను. ఓ అరవై రూపాయలొస్తాయి. ఓ ధర్మాత్ముడు ఈ ఇల్లు నాకు ఊరికే అద్దెకిచ్చాడు. ఇది అమ్మేయాలని ఆయన అనుకుం

టున్నాడు. అమ్మమ్మడయే దాకా నన్నిక్కడ ఉండవచ్చు నన్నాడు. నాకొచ్చే అరవై రూపాయలలోనూ భోజనం దగ్గర్నుంచి అన్నీ గడపాలి. తిన్న పూట తింటాను. లేనప్పుడు లేదు. నువ్వు నన్ను ఒక్కసారి పాతిక రూపాయలడిగావు—"

"నేనడగలేదు. నువ్వే యిస్తానన్నావు—" అన్నాడు. చంద్రం.

"వాయిదాలమీద తీర్చుకుంటాను. నెలకు అయిదు రూపాయలు. నువ్వీ చీరలు పట్టుకుపోతే మళ్ళీ చీరలు కొనుక్కో లేను—ప్లీజ్—దయ తల్చు—" అందా యువతి.

"నెలకు అరవై రూపాయలతో బ్రతుకుతున్నావా" ఆశ్చర్యంగా అన్నాడు చంద్రం—"నా కొచ్చే రెండొందలే నాకు చాలడం లేదు—"

"నువ్వుద్యోగం కూడా చేస్తున్నావా!" ఆశ్చర్యంగా అందా యువతి.

"ఉద్యోగం డబ్బులు చాలక దొంగతనం మొదలెట్టాను—" అన్నాడు చంద్రం.

"నీకు దొరక్క దొరక్క నా యిల్లే దొరికిందా?" అందా యువతి.

"నాకూ ఇదే కొత్త—మొదటి దొంగతనం—" అన్నాడు చంద్రం.

"సాధారణంగా ఆటల్లో మొదటిపందెం దేవుడిదంటారు. నువ్వు కూడా ఇది అలాగే భావించి నా యిల్లు వదిలి పెట్టేయ్—" అందా యువతి.

"బాగుంది. బోణీ బేరం వదులుకుంటే రోజంతా అలాగే ఉంటుందంటారు. బోణీలో దెబ్బ తినదల్చుకో

లేదు—" అన్నాడు చంద్రం.

"ఆడదాన్ని—అర్థిస్తున్నాను—" అందా యువతి.

"దొంగలకు ఆడా, మగా తేడా లేదు—" అన్నాడు చంద్రం.

"ఈ చీరలతో కాకపోతే చిరుగుల బట్టలతో ప్రయివేటుకు వెళ్ళాలి. అలా వెడితే వాళ్ళు పొమ్మంటారు. వాళ్ళు పొమ్మంటే నా జీవనాధారం పోతుంది—" అందా యువతి.

చంద్రం సాలోచనగా ఆగాడు.

"కావాలంటే స్టీలు సామాను పట్టుకుపో. కంచం లేకపోతే నేలమీద భోంచేస్తాను. అయినా నెలలో నాకు కంచం అవసరపడేది కూడా చాలా తక్కువ—" అందా యువతి.

"నీ జీవితం నా జీవితం కంటే నికృష్టంగా వుంది" అన్నాడు చంద్రం.

"అందుకే జాలి తలపమంటున్నాను—" అందా యువతి.

చంద్రం ఆలోచిస్తున్నాడు. అతడి కామెపై జాలి కలుగుతోంది. తన కారణంగా ఆ నిర్భాగ్యురాలికి వున్న కాస్త జీవనాధారం లేకుండా పోకూడదు. కానీ తను ప్రతి ఇంటా ఇలా ఆలోచిస్తూ పోతూంటే అసలు దొంగతనం చేయగలడా?

చంద్రం మళ్ళీ మనసు రాయి చేసుకుని—"లాభం లేదు. నేను వచ్చిన పని పూర్తిచేసుకునే వెడతాను" అన్నాడు.

అప్పుడే ఎవరో వీధి తలుపు తట్టారు.

"ఎవరు?" అన్నాడు చంద్రం.

"ఇంటాయనయుంటాడు—" అంది యువతి.

"ఇప్పు డెందుకు వచ్చాడు?"

"ఆశ!"

"ఏమిటా ఆశ!"

"ముందు మంచంకింద దాక్కో. నేను వెళ్ళి తలుపు తీయాలి—"

"నే నెందుకు దాక్కోవాలి!" అన్నాడు చంద్రం.

"నీ బోణీ బేరం పాడవకుండా వుండడంకోసం—" అందా యువతి.

"నువ్వు నన్నాయనకు పట్టిస్తావు—" అన్నాడు చంద్రం.

మళ్ళీ వీధి తలుపు చప్పుడయింది.

"ప్లీజ్—నా మాట విని దాక్కో—లేదా పారిపో—" అందా యువతి.

చంద్రం మంచం అడుక్కు పోతూ—"నువ్వు నన్ను పట్టివ్వడానికి ప్రయత్నించావో ఈ బాకుతో నీ చీరలు రెండూ చింపి పోగులు పెడతాను—" అన్నాడు.

"నిన్ను పట్టియిచ్చే ప్రసక్తి లేదు. చీరల జోలికి మాత్రం వెళ్ళకు—"

చంద్రం మంచం కిందకు దూరాడు. యువతి వెళ్ళి తలుపు తీసింది.

3

"ఏం ప్రసూనా—తలుపు తీయడాని కింత సేపు పట్టింది!" అంటూ ఇంటాయన లోపలకు వచ్చాడు.

"నిద్రపోతున్నాను—" అంది ప్రసూన.

"అదృష్టవంతురాలివి. నీకు హాయిగా నిద్రపడుతుంది. నాకు నిద్రపట్టకే యిలా వచ్చాను—" అన్నాడు ఇంటాయన.

"మీ యింట్లో పరుపులు కూడా వున్నాయి. ఇక్కడ కుక్కి మంచం తప్ప ఏమీ లేదు—" అంది ప్రసూన.

"గంగిగోవు పాలు గరిటెడైనను చాలు—అన్నారు. దేనికైనా నాణ్యత ముఖ్యం. నువ్వు పక్కనుంటే ఈ యిల్లే ఇంద్రలోకం—" అన్నాడు ఇంటాయన.

"ఈ యిల్లు ఇంద్రలోకం కాదు గానీ అక్కడికి దారి చూపిస్తుందని నా అనుమానం—" అంది ప్రసూన.

"నువ్వు కబుర్లు బాగా చెబుతావు. నీతో కబుర్లాడాలని నాకు చాలా సరదా—" అన్నాడు ఇంటాయన.

"మీతో కబుర్లాడాలంటే నాకు అసహ్యం—" అంది ప్రసూన.

"ఏమిటో—నువ్వు తిట్టినా నాకు కోపం రాదు. అలా తిడుతూంటే అదిరే నీ పెదవులు చూస్తూంటే నాకేదోలా గుంటుంది—" అన్నాడు ఇంటాన.

"నా ఈడు కూతురుంది మీకు. నాతో ఇలా మాట్లాడ్డానికి సిగ్గుగా లేదూ!" అంది ప్రసూన.

"నా పెళ్ళాం ఈడు చెల్లెలుండేది నాకు. అంత మాత్రాన పెళ్ళాన్ని చెల్లెలనుకున్నానా? ఇప్పుడు నాకు నీ యీడు కూతురుండొచ్చు. అంత మాత్రాన నువ్వు నా కూతురివి కాదుగదా - ఇలాంటి సిద్ధాంతాలు నాకు చెప్పకు" అన్నాడు ఇంటాయన.

"సోమసుందరంగారూ—మీరు రోజూ ఇలా వచ్చి వెడుతూండడం నా కేమీ నచ్చలేదు. పొమ్మంటే ఇంకో యిల్లు చూసుకుంటాను. కానీ ఈ నరకయాతన అనుభవించలేను—" అంది ప్రసూన తీవ్రంగా.

"ఇది చాలా బాగుంది. అడుగుతున్నది నేను. అదీ ఇంటి అద్దెకు బదులుగా అడుగుతున్నాను. నా యింట్లో

ఊరికే వుంటూ నే నడిగింది కాదంటూంటే నరకయాతన నాకా నీకా?" అన్నాడు సోమసుందరం.

"ఇంటి అద్దెకు బదులుగా మీ రడిగే విధంగా ప్రతిఫలం ఇవ్వాలనుకుంటే నేనీ పాడుపడ్డ యింట్లో ఎందుకుంటాను? పెద్దపెద్ద భవనాల్లోనే వుంటి వుండేదాన్ని. నానుంచి ఏమీ ఆశించకండి!" అంది ప్రసూన.

"నీ మనసు కరుగదా—"

"నా మనసు వెన్నలాంటిదే—అయినాకూడా అది మీ లాంటి వారిని చూసి కరుగదు. నాకు జీవితంమీద ఎన్నో ఆశలున్నాయి" అంది ప్రసూన.

"పోనీ నీ చేత్తో కాసిని మంచినీళ్ళియ్యి. ఈ జన్మకింతే ప్రాప్తి అనుకుని అవి తాగి వెళ్ళిపోతాను" అన్నాడు సోమ సుందరం.

ప్రసూన లోపలకు వెళ్ళి ఓ గ్లాసుడు నీళ్లు తెచ్చి ఆయన కిచ్చింది. నీళ్ళందుకుంటూ ఆయన ఆమె చేయితాకాడు. నీళ్ళు తాగుతూ మధ్యమధ్య ఆమెపైన అసభ్యకరమైన మాటలు వదిలాడు. ఆమె అంతా మౌనంగా సహించింది.

"ఇంకొక్క పది నిముషాలుంటాను. నన్ను కరుణించా లని నీ మనసు మారుతుందేమో ఎదురుచూస్తాను...." అన్నాడు సోమసుందరం.

"పది నిముషాలు కాదు. రోజంతా కూర్చున్నా ఇంతే" అంది ప్రసూన.

కాసేపుండి సోమసుందరం వెళ్ళిపోయాడు.

4

ప్రసూన తలుపులు వేసివచ్చేసరికి చంద్రం మంచం కింద నుంచి లేచి వచ్చాడు. అతను ప్రసూనవంక అదోలా చూసి—"నీకు ఓర్పు ఎక్కువ!" అన్నాడు.

"ఆడదానికి—అందులోనూ నాలాంటి దానికి అవసరం అది" అంది ప్రసూన.

"ఆ ముసలాడు రోజూ వస్తాడా యిక్కడికి!"

"వస్తాడు వాడు ప్రమాదకరమైన మనిషి కాడు. నేను అరుస్తానేమోనని భయం. అల్లరి చేస్తానేమోనని భయం. కానీ మనసులో ఆశ. వచ్చి నోటి దురద తీర్చుకుని వెడుతూంటాడు. నాకు ఇల్లిచ్చాడు గదా అని ఆ మాత్రం సహిస్తున్నాను."

"వాడి మాటలు నన్ను రెచ్చగొట్టాయి. నాకూ అలాగే మాట్లాడాలని వుంది" అన్నాడు చంద్రం.

ప్రసూన కళ్ళు ఎర్రబడ్డాయి.

"అలా చూడకు. నా దగ్గర బాకు వుంది" అన్నాడు చంద్రం.

"నీ బాకు నన్ను భయపెట్టదు. నువ్వు నా జోలికి వచ్చావో నేను ప్రాణాలకు తెగిస్తాను. ఇప్పటికే చావలేక బ్రతుకుతున్నాను. ఇలా మానంకోసం ప్రాణా లొడ్డానంటే ఆత్మహత్య కంటే తృప్తిగా వుంటుంది" అంది ప్రసూన.

చంద్రం ఆశ్చర్యంగా ఆమె వంక చూశాడు—"సరే. అయితే నన్నెదిరించి ప్రాణాలు కోల్పోడానికి ప్రయత్నించు. నువ్వు చాలా అందంగా వున్నావు. నిన్ను లొంగదీసుకోవడం కోసం నేను హంతకుడి నైనా నాకు బాధ వుండదు. ఏదో విధంగా జీవితం అంతం చేసుకోవాలని నాకూ ఉంది. ఈ క్షణంలో నాకు నువ్వు తప్ప ఇంకేమీ అక్కర్లేదని పిస్తోంది. ఆ తర్వాత నేనేమైపోయినా ఫరవాలేదు" అన్నాడు.

ప్రసూన ఆశ్చర్యంగా అతడి వంక చూసింది.

చంద్రం ఓసారి బాకు గాలిలోకి విదిలించి ఆమెకు దగ్గరగా వచ్చి ఆగాడు. ఆమెవైపే అదోలా చూడసాగాడు.

ఆమె వెనుకడుగు వేయలేదు. ధైర్యంగా అతడివంకే చూస్తోంది.

చంద్రం మరో అడుగు ముందుకువేసి ఓ చేయి ఆమె నడుము చుట్టూ పోనిచ్చాడు. ప్రసూన ఏమీ అడ్డగించలేదు. అతడామెను దగ్గరగా లాక్కున్నాడు.

ఉన్నట్లుండి ఆమె అతణ్ని గట్టిగా గిల్లింది. చంద్రం ఆమెను వదిలేశాడు. ఆమె వెనక్కి వెళ్ళి—"అడుగు ముందుకు వేయకు" అంది.

"వేస్తాను!" అన్నాడు చంద్రం.

"వద్దని చెప్పాను" అంది ప్రసూన.

"నీ మాటతో నాకు నిమిత్తం లేదు" అంటూ ముందడుగు వేశాడు చంద్రం.

"ఆగు!" అరిచింది ప్రసూన—"నీవు కోరేది నన్నే కదా—నేను చెప్పే మాటలు పూర్తిగా విను. ఏ ప్రతిబంధకమూ లేకుండా నేనే నీకు లొంగిపోతాను."

చంద్రం ఆశ్చర్యంగా "నీ మాటలు నమ్మవచ్చా" అన్నాడు.

"మగాడివి నువ్వు అబలను నేను. నీ చేతిలో బాకు ఉంది. నేను నిరాయుధురాల్ని. నీతో అబద్ధం చెప్పి ఏం సాధించగలను?" అంది ప్రసూన.

"అయితే ఏం చెబుతావో చెప్పు...." అన్నాడు చంద్రం.

"నీ వివరాలు పూర్తిగా చెప్పు. నువ్వెందుకు దొంగగా మారావు? నీ వాళ్ళంతా ఏమయ్యారు?" అంది ప్రసూన.

"నాకెవ్వరూ లేదు. మామూలు జీవితం విసుగనిపించి దొంగగా మారాలనుకున్నాను" అన్నాడు చంద్రం.

"దొంగతనానికి వచ్చినవాడివి—దొరికిందానితో తృప్తి చెందక నా జోలి కెందుకు వస్తున్నావు?"

"ఆ ముసలాడి మాటలు వినేదాకా నీ సౌందర్యం గురించి పట్టించుకోలేదు. ముసలాళ్ళనే రెచ్చగొట్టే నీ అందం నాకో అపూర్వ అవకాశం. ఇలాంటి అవకాశం నాకు మళ్ళీ జన్మలో రాదు...." అన్నాడు చంద్రం.

"నా అందం అంత అపూర్వమైనదని నీ కనిపిస్తున్నప్పుడు — ఈ ఒక్క రాత్రికే యేం? శాశ్వతంగా నీ స్వంతం చేసుకోవచ్చుగదా" అంది ప్రసూన.

చంద్రం ఉలిక్కిపడి—"ఏమన్నావూ?" అన్నాడు.

"మనం పెళ్ళి చేసుకుందా మంటున్నాను" అంది ప్రసూన.

"పెళ్ళా, నాకా?" అన్నాడు చంద్రం.

"ఒకే జాతి పక్షులం మనం. ఒకే గూటికి చేరుదాం" అంది ప్రసూన.

చంద్రం చేతిలోని బాకు జారి క్రింద పడింది—"నీ యింటికి దొంగతనానికి వచ్చిన వాణ్ని, నీకు మానభంగం చేయాలనుకున్నవాణ్ని - భర్తగా పొందాలనుకుంటున్నావా? ఏం ధౌర్భాగ్య స్థితి నీది!" అన్నాడతను.

"నాది దౌర్భాగ్య స్థితి అయితే ఇంచుమించు ఇదే దౌర్భాగ్య స్థితి మన దేశంలోని ప్రతి ఆడదానికీ ఉంది. కట్నం పేరిట దొంగతనం జరుగుతోంది. పెళ్ళికి ఆడదాని యిష్టంతో నిమిత్తం లేనప్పుడు—అది మానభంగంతో సమానమే గదా!" అంది ప్రసూన.

"నువ్వు చాలా తెలివైనదానివి" అన్నాడు చంద్రం.

"నన్ను పెళ్ళిచేసుకో—నా తెలివితేటలు నీకూ ఉపయోగిస్తాయి."

"రేపు చెబుతాను" అని అక్కణ్నించి వెళ్ళిపోయాడు చంద్రం.

5

మర్నాడు చంద్రం, బలరాం యింటికి వెళ్ళాడు.

అతను వెళ్ళేసరికి బలరాం తన పిల్లలతో ఆడుకుంటున్నాడు. అతను చంద్రాన్ని చూసి — "ఈ రాగ బంధాలు అన్నింటికీ అతీతమైనవి. వీళ్ళకోసం ఎలాగో అలాగ నేను బ్రతకాలి. అవసరమైతే వీళ్ళను కూలిపనికైనా పంపిస్తా. కానీ మరొక్కసారి నా ప్రాణాలు తీసుకోవాలనుకోను" అన్నాడు.

చంద్రం ఇంకేమీ మాట్లాడలేదు. అతనక్కణ్నించి తిన్నగా ప్రసూన యింటికి వెళ్ళాడు. ప్రసూన అతణ్ని చూసి—"నువ్వు వస్తావని నాకు తెలుసు" అంది.

మనిషి నేరం చేయకుండా సమాజం ఆంక్షలు విధిస్తుంది. ఒంటరి మనిషిని సమాజపు ఆంక్షలు బాధించవు. ఆ మనిషి జంటగా మారినపుడు అతడు తనూ సమాజంలో ఒక భాగం అవుతాడు. సమాజం ఎన్ని కష్టాలు పెట్టినా భరిస్తాడు తప్పితే ఎదురు తిరగడు. ఎదురు తిరిగితే తప్ప సమాజంలో అతడి స్థానం పెరగదు.

భవంతుల్లో మసలాలనీ, కార్లలో తిరగాలనీ ఆశపడి దొంగతనా లారంభించిన చంద్రం తొలి ప్రయత్నంలోనే ప్రసూనకు దొరికాడు. అతను తను కోరినది ఎప్పటికీ సాధించలేడు. బలరాంలాగే తనూ సామాన్య జీవితం గడుపుతాడు.

కానీ ఆ జీవితంలో ఆకర్షణ లేదా?

ఉన్నదో-లేదో.... మెజారిటీ ప్రజల జీవితమే అది! □

సంగీత సామ్రాట్

మల్లిక్

చీకటి....

రాత్రి పదకుండు గంటలు దాటింది. ఎక్కడో ఒకటీ అరా తప్ప అన్ని ఇళ్ళలోనూ లైట్లారిపోయి ఉన్నాయి.

నగరం నిద్రపోతూంది.

వీరయ్య ఆ చీకట్లో నడుస్తున్నాడు. అలా చీకటిలో తడుముకోకుండా నడవడం వీరయ్యకి అలవాటే. అది అతనికి వృత్తి నేర్పిన విద్య.

యాభై గజాల దూరంలో నిప్పు!....అవును - సిగరెట్టు కాలుస్తున్న గుర్తు అది. బీటు కానిస్టేబులు అయి వుంటాడు అనుకున్నాడు వీరయ్య.

ప్రక్క సందులోకి మళ్ళి, తన నడక సాగించాడు. ఇంకా స్త దూరం నడిచి కుడి ప్రక్కకి తిరిగితే వాటర్ ట్యాంక్ వస్తుంది. దానికి ఎదురుగా పచ్చరంగు మేడ....

తను రెండు రోజులుగా ఆ వీధిలో తిరిగి గుర్తుపెట్టుకున్న మేడ. అంత పెద్ద మేడలో ఇద్దరే....భార్యా-భర్త!....అంతే. వాళ్ళకు పిల్లలు లేరేమో. కుక్కలు కూడా వున్నట్లు లేవు. కాపలావాడు అసలే లేడు. కాలనీ మధ్య వున్నాం కదా మనకేం భయంలే అని వాళ్ళ ధీమా అయ్యుండొచ్చు. ఈ వేళ తను వాళ్ళింట్లో దొంగతనం చేస్తే రేపటినుండి కుక్కని పెంచుకుంటారేమో!....

వీరయ్య ముసి ముసిగా నవ్వుకున్నాడు.

అంతలోనే అతనికి ఉదయం భార్య లక్ష్మి అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఈ వేళ రాత్రికి ఓ మాంచి ఇల్లు చూసుకున్నాను.... విజయం లభిస్తే నీకు మాంచి సిల్కుచీరలు కొంటాను.." అన్నాడు వీరయ్య చేపల పులుసు అన్నం కలుపుతూ.

"ఇళ్ళకేం మంచివే చూస్తావు - వాటి సంగతి చూడ్డమే చేతకాదు....అసలు మీకు ఏ పని చేతనవును గనక?...." అంది లక్ష్మి మూతి తిప్పుతూ.

"ఏం....ఇప్పుడు నీకేం తక్కువ చేశానని?...." వీరయ్య అభిమానం దెబ్బతింది.

"సర్లె....ఎంత చేతనవునో తెలుస్తూనే వుంది. ఇన్నాళ్ళ నుండీ దొంగతనాలు చేస్తున్నావ్....ఏం లాభం?....అసలు మనం ఏమైనా వెనకెయ్యగలిగామా? ...అయినా ఎప్పుడూ చెంబులూ, తప్పేలాలూ దొంగతనంచేసి తీసుకురాపోతే నోట్లకట్టలూ బంగారునగలూ తేలేవూ?....అదీ కాకుండా నువ్వు మూడుసార్లు దొంగతనం చేస్తే రెండుసార్లు పట్టుబడిపోతావ్....అంతలా ఉన్నాయ్ మన తెలివితేటలు. ప్రక్కింటి రంగడిని చూసి బుద్ధి తెచ్చుకో....అతను ఇప్పటి వరకూ ఎన్ని దొంగతనాలు చేసినా ఎప్పుడైనా పట్టుబడ్డాడా? వాళ్ళావిడకి ఎన్ని చీరలూ, నగలూ వున్నాయో!! ఎంతైనా రంగడి పెళ్ళాం అదృష్టవంతురాలు...."

పులుసన్నం ముద్దగొంతులో అడ్డుకుని పొరబడింది వీరయ్యకి. అతనికి యెక్కడలేని ఉక్రోషం వచ్చింది. తనని తిట్టినా పరవాలేదుగానీ తనని రంగడితో పోలుస్తుందా?....

"ఈ రాత్రి చూస్తావ్‌గా నా తడాఖా...."

"ఆ చూశానుగా ఇన్నేళ్ళూ?....దొంగిలించింది ఏమీ లేకపోయినా పట్టుబడకుండావుంటే చాలు .... ఏంటలా చూస్తావ్ ఇంకా స్త పులుసేసుకుని అన్నం మింగి పడుకో" అంది లక్ష్మి ముఖం చిట్లిస్తూ.

వీరయ్య ఆలోచనల్లోంచి బయటపడ్డాడు.

"ఈవేళ తను పెద్దమొత్తం దోచుకోవాలి....పట్టుబడకూడదు. ఊహూ....చస్తే పట్టుబడకూడదు...."

వాటర్ ట్యాంక్ వచ్చేసింది. దానికి ఎదురుగా పచ్చరంగుమేడ!....చీకట్లో ఏ రంగో తెలీని విధంగా వుంది.

వీరయ్య నడక వేగం తగ్గించాడు. చుట్టూ పరిసరాలు గమనిస్తూ అడుగులు వేస్తున్నాడు. అక్కడ ఉన్న ఏ ఇంటి

లోనూ దీపాలు వెలగడంలేదు.

నెమ్మదిగా పచ్చరంగు మేడ సమీపించి ఒకసారి ఇటూ అటూ చూసి కాంపౌండ్ వాల్ ఎక్కి లోపలికి దూకాడు వీరయ్య.

నెమ్మదిగా క్రోటన్స్ గుబుర్ల వెనక్కి నక్కి కాస్సేపు మేడవంక పరిశీలనగా చూశాడు.

మేడపైనంతా అంధకారంగా వుంది. క్రింది పోర్షన్‌లో మాత్రం ఒక గదిలో బెడ్‌లైట్ వెలుగుతుంది.

అంటే పైన పోర్షనులో ఎవరూ వుండి వుండరు. మొగుడూ పెళ్ళాలిద్దరూ క్రింద పోర్షనులో బెడ్‌లైట్ వెలుగుతున్న గదిలో నిద్రపోతూ ఉండివుంటారు బహుశా. తను పైకి చేరుకోవాలి!!

వీరయ్య అడుగులో అడుగు వేసుకుంటూ మేడ వెనక భాగానికి వెళ్ళి అక్కడున్న వాటర్‌పైపుల ఆధారంతో పైకి ప్రాకి మేడ పైపోర్షనుకు చేరుకున్నాడు.

తన కూడా తెచ్చుకున్న పెన్‌టార్చి జేబులోంచి తీసి వెలిగించి చూశాడు. అది డైనింగు హాలు. టేబులుమీద రాత్రి వాళ్ళు తిన్న కంచాలు ఇంకా అలాగే వున్నాయి. అటుప్రక్కన కిచెన్.

ముందుకు శబ్దం కాకుండా అడుగులు వేశాడు. వరుసగా మూడు గదులు అటుతరువాత హాలు వున్నాయి. గదులు గడియమాత్రం పెట్టివున్నాయి.

వీరయ్య ఒక గది తలుపు తీసుకుని లోపలికి వెళ్ళాడు. ఆ గదిని పెన్‌టార్చితో జాగ్రత్తగా పరిశీలించాడు. గోడలకు పెయింటింగ్స్, పుస్తకాల అల్మారాలు, ఒక టేబులు దానిముందు కుర్చీ, గది మధ్యలో టీపాయ్ వుంది. ఆ గది లోని సామాను అంతే—

ఆ గది బయటికి వస్తూ కంగారులో టీపాయ్‌ని తన్నేశాడు వీరయ్య.

"ఖంగ్...."

టీపాయ్‌మీది నగిషీ చెక్కిన ఇత్తడి ఫ్లవర్ వేజ్ క్రింద పడి పెద్దగా చప్పుడు చేసింది.

వీరయ్యా గుండె ఆగినంత పనైంది. కొద్దిక్షణాలు కదలకుండా నిలబడ్డాడు. చెవులు బాగా రిక్కించి విన్నాడు. క్రింద అలికిడి అయినట్టు శబ్దం ఏమీ వినబడలేదు. ఫరవా లేదు వాళ్ళు నిద్రలేపలేదు....

వీరయ్యా పెన్‌టార్చి వెలిగించి ప్రక్కగదిలోకి వెళ్ళాడు.

ఫ్లవర్ వేజ్ పడిన గదికి సరిగ్గా క్రింద, వాళ్ళ బెడ్ రూము వుంది.

2

"ఏమండీ...."

భర్తని చేతుల్తోపట్టి కుదిపింది పార్వతి.

"మెలకువగానే వున్నాను....మరీ అంతగా కుదిపెయ్యకు" అన్నాడు జగన్నాధం విసుక్కుంటూ.

"పైనేదో చప్పుడయింది...."

"అవును....నేనూ విన్నాను....నిన్ను లేపి నీతో చెప్దామనుకున్నాగానీ నువ్వూ మెలుకువగానే వున్నావ్."

"మరి—అలా దేభ్యం ముఖంపెట్టి నేనూ విన్నానని చెప్పకపోతే—అదేమిటో వెళ్ళి చూడరాదూ?...."

"అబ్బ....ఏం వుండదు లెద్దూ....ఏ పిల్లో పందికొక్కో అయివుంటుంది" ఆవలిస్తూ అన్నాడు జగన్నాధం.

"వంటరిగా వెళ్ళడానికి భయం....అందుకే ఎలకో పిల్లో అయి వుంటుందని అంటున్నారు...."

"మగవాడిని?....నాకేం భయం...."

"హు....చూస్తూనే వున్నాగా మీ మగతనం....పెళ్ళయి ఓ అయిదేళ్ళయినా ఓ పిల్లా పీచా?...." మూతి అష్టవంకర్లు తిప్పింది పార్వతి.

"సర్లె... సర్లె....ఇంక ఆపు నీ సోది. ఏం మాట్లాడినా చివరికి ఆ విషయం దగ్గరకే తీసుకెళ్తావ్."

దుప్పటిని విసురుగా తన్ని మెట్లవైపు అడుగులు వేశాడు జగన్నాథం.

3

వీరయ్య తన దగ్గరున్న మారుతాళం చెవుల గుత్తితో అలమార తెరవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. అది ఒకపట్టాన వచ్చిచావడంలేదు. గదిలో విలువైన వస్తువులేమీ బయటపెట్టలేదు.

ఒక్కొక్కప్పుడు కొందరు టేబులు సొరుగుల్లో ఉంగరాలూ వాచీలూ లాంటివి పెడ్తుంటారు. దొరికితే కాస్త డబ్బుకూడా దొరకవచ్చు.

ఈ ఆలోచన రాగానే వీరయ్య గదిమూలగా వున్న టేబులువైపు అడుగులు వేశాడు. చిన్నదో చితకదో ఏదో ఒకటి ముందు దక్కించుకుంటే ఆ తరువాత పెద్దవాటి జోలికి వెళ్ళవచ్చు.

టేబులు సొరుగు లాగాడు వీరయ్య. అతని మనసు ఆనందంతో గంతులు వేసింది.

తను ఊహించిన విధంగానే ఆ టేబులు సొరుగులో ఒక వాచీ, ఒక ఉంగరం వుంది. ఉంగరం చాలా పెద్దది. తులం వుంటుంది. టేబులు సొరుగులోనే చిన్న పర్సు వుంది. తెరిచి చూశాడు. పది రూపాయల నోట్లూ కాస్త చిల్లర ఉన్నాయి.

వాటిని సంతోషంతో జేబులో వేసుకుందామని అనుకుంటుండగా జరిగింది ఆ సంఘటన.... వీరయ్య గుండెల్లో బాంబులు ప్రేలిన సంఘటన.

గదిలోని వంద కాండిల్సు బల్బు జిగేలుమని వెలిగింది.

వీరయ్య చేతిలోంచి ఉంగరం, వాచి, పర్సు జారి నేలమీద పడ్డాయి. కంగారుగా గది గుమ్మంవైపు చూశాడు.

గుమ్మానికి అడ్డుగా జగన్నాథం నిలబడి వున్నాడు. ఆరడుగుల పొడవు. నలభై అయిదు అంగుళాల ఛాతీ. కండలు తిరిగిన శరీరంతో పర్వతంలా నిలబడి తీక్షణంగా తనవంకే చూస్తున్న జగన్నాథాన్ని చూడగానే వీరయ్య శరీరం చల్లబడిపోయింది. పాదాలనుండి చెమట స్రవించసాగింది.

వీరయ్య సన్నగా పుల్లలా వుంటాడు. జగన్నాథం తలుచుకుంటే వీరయ్యని ఎడమచేత్తో విసిరేయగలడు. వీరయ్యచేతిలో ఆయుధం వున్నా జగన్నాథానికి ఎదురు నిలిచి తలపడలేడు.

వీరయ్య రెండు చేతులూ వణుకుతూ అప్రయత్నంగా పైకిలేచాయి నమస్కరిస్తూ.

"బాబుగారూ.... నన్నేం చేయకండి.... నన్నేం చేయకండి...."

నిలువెల్లా వణికిపోసాగాడు వీరయ్య. జగన్నాథాన్ని చూస్తే తన ఎముకలు విరగ్గొట్టేలా వున్నాడు.

జగన్నాథం ఒక్కొక్క అడుగే వేస్తూ వీరయ్య దగ్గరికి వస్తున్నాడు. వీరయ్యకి తన గుండెకాయ చల్లగా క్రిందికి జారి కడుపులోనికి వచ్చినట్టు అనిపించింది.

జగన్నాథం దగ్గరకు రాగానే అతని కాళ్ళమీద పడిపోయాడు వీరయ్య.

"బుద్ధి గడ్డితిని వచ్చాను బాబూ.... నన్ను పోలీసులకు

పట్టించకండి....నన్ను క్షమించండి బాబూ...."

"లే....నిన్ను పోలీసులకు పట్టించనులే."

ఎంతో మెత్తగా వినిపించింది జగన్నాధం గొంతు వీరయ్యకి. ఆశ్చర్యంగా తలెత్తి అతని వంక చూశాడు. జగన్నాధం ముఖంలో ఇందాకటి తీవ్రతలేదు. ఎంతో సౌమ్యంగా వుంది.

"ఏమిటలా చూస్తావ్....లేచి నిలబడు."

వీరయ్య గబగబ కిందపడిన ఉంగరం, వాచీ, పర్సు లను తీసి జగన్నాధం చేతిలో పెట్టి చేతులు కట్టుకుని వినమ్రంగా నిలబడ్డాడు.

"ఇవికాక యింకేం తియ్యలేదు కదూ?"

వీరయ్య చటుక్కున చేతులు రెండూ, రెండు ప్యాంటు జేబుల్లోకీ పోనిచ్చి బయటికి లాగి చూపించి "ఏమీ తియ్య లేదు సార్" అన్నాడు.

జగన్నాధం ఏదో ఆలోచిస్తూ నిలబడ్డాడు.

పోలీసులకు పట్టించడం ఎందుకులే తనే దేహశుద్ధి చేసి పంపించేస్తే సరిపోతుంది అనిగానీ ఆలోచించడం లేదు కదా కొంపతీసి అని అనుమానం వేసింది వీరయ్యకి.

ఈ ఆలోచనలతో అతనిలో మళ్ళీ సన్నగా వణుకు ప్రారంభం అయింది.

"అసలు నువ్వు దొంగతనం వృత్తిగా యెందుకు చేపట్టావ్" రెండు నిముషాల అనంతరం నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ అన్నాడు జగన్నాధం.

వీరయ్య దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు.

"అది చాల పెద్దకధ సార్....ఆ విషాద గాధంతా చెప్పి మీకిప్పుడు విసుగు కలిగించను ...టూకీగా చెప్తాను. మా నాన్న ఒట్టి త్రాగుబోతు. మేము ఆరుమంది పిల్లలం.

అందరిలోకీ నేనే పెద్దవాడిని. నా చిన్నప్పటి నుండీ మా నాన్న సంసారబాధ్యతని చేపట్టగా చూడలేదు. త్రాగివచ్చి మా అమ్మని తంతుంటాడు.

మా అమ్మే ఆ యింట్లో ఈ యింట్లో పనిచేసి మమ్మల్ని పెంచింది. ఆమెకి ఇప్పుడు ఆరోగ్యం సరిగాలేదు. పనిచేసే ఓపికకూడా లేదు. కుటుంబభారం మొత్తం నామీద పడింది. ఎక్కడైనా పనిచేసి అందర్నీ పోషిద్దాం అంటే ఎక్కడా పని దొరకడంలేదు. రెండు రోజులనుండీ ఇంట్లో అందరం పస్తులు వున్నాం సార్...."

వీరయ్య కళ్ళు తుడుచుకున్నాడు.

"అయ్యో పాపం!...."

జగన్నాధం జాలిపడ్డాడు.

తన కట్టు కధతో జగన్నాధాన్ని నమ్మించగలిగినందుకు వీరయ్య సంబరపడ్డాడు. ఇక జగన్నాధం తనని తంతాడన్న భయంలేదు. తనమీద జాలిపడుతున్నాడు. ఒక అయిదో పదో యిచ్చినా ఆశ్చర్యపడ నవసరంలేదు.

జగన్నాధం ఏదో ఆలోచిస్తున్నాడు.

వీరయ్య గది మొత్తం పరిశీలనగా చూడసాగాడు. గది గోడలకు యెవరెవరివో ఫోటోలు తగిలించబడి వున్నాయి. అలమారులో పుస్తకాలు నీటుగా సర్దబడి వున్నాయి. అలమారలో పై అరలో వరసగా వెండి షీల్డులూ కప్పులూ వున్నాయి.

"ఏమిటి వాటివంక అలా చూస్తున్నావ్?....ఆ వెండి షీల్డులూ కప్పులూ శాస్త్రీయ సంగీతంలో నాకున్న ప్రతిభకి వివిధ సాంస్కృతిక సంఘాలు నన్ను సన్మానించి యిచ్చినవి" అన్నాడు జగన్నాధం వీరయ్య చూపుల్ని గమనించి.

"మీరు పాడతారా బాబూ?...."

"ఊ....కర్నాటక సంగీతం. ఈ షీల్డులూ కప్పులూ వున్నాయి చూశావ్....అవి మహా చెడ్డవి. అవి మనిషి లోని అహంకారానికి గుర్తులు. వాటిని చూసినప్పుడల్లా నేనో గొప్ప గాయకుడినని గర్వంగా గుండె పొంగిస్తాను. అదిగో....ఆ గర్వమే మనిషి పురోగతికి అడ్డుగా నిలబడు తుంది. నేనో గొప్ప గాయకుడిని....ఇంకా నేను సాధన చెయ్యాడ మేమిటని ఆలోచించేలా చేస్తుంది....

"నిజానికి సంగీతం ఒక మహా సముద్రంలాంటిది. సంగీత సాగరంలో ఈదవచ్చు గానీ అవతలి ఒడ్డు చేరడం అసాధ్యం. ఎంత సాధించినా యింకా యెంతో మిగిలి పోతుంది. ఈ కప్పులూ, షీల్డులూ సాధనకి అడ్డంకులు. అందుకే ఇవంటే నాకు యిష్టంలేదు. ఇవి నీకు తిండిపెట్ట గలిగితే వీటి ఉపయోగం కాస్తయినా వున్నట్టు భావిస్తాను. అవన్నీ వెండివి. నువ్వు వాటిని తీసుకెళ్ళి అమ్ముకో...." అన్నాడు జగన్నాధం గంభీరంగా.

వీరయ్య ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు.

"సార్....మీరెంత మంచివారు సార్...." చేతులు రెండూ కట్టుకుని అన్నాడు.

"అంతే కాదు....ఆ మూల వున్న తంబూరా, హార్మో నియం కూడా తీసుకెళ్ళి అమ్ముకో....వాటి అవసరం నాకు లేదు. తంబూరా నాలుగు వందలు ఖరీదుచేస్తుంది. హార్మో నియం మరో నాలుగు వందలులుంటుంది. అవి అమ్మి వచ్చిన డబ్బుతో ఒక కూరగాయల కొట్టు పెట్టుకో. నువ్వు నీ కుటుంబాన్ని ఆ కూరగాయల వ్యాపారంతో పోషించుకో వచ్చు....నావల్ల ఒక కుటుంబానికి జీవన భృతి కలుగుతూం దంటే నాకు చాల ఆనందంగా ఉంది...."

"సార్....అవి కూడా ఇచ్చేస్తే మరి మీ సంగీత

సాధన ఎలా సార్?...."

జగన్నాధం ఉదారత్వం భరించలేకపోతున్నాడు వీరయ్య. యీ కలియుగంలో యిలాంటి మంచి మనుషులు వుంటారా?!....

"నేను పదిహేనువందల రూపాయల తంబూరా కలకత్తా నుండి తెప్పించుకుంటున్నాను. జర్మన్ రీడ్స్ వున్న హార్మనీ చాలా కాలంగా కొనాలని అనుకుంటున్నాను. అది కూడా వెయ్యి రూపాయలదాకా వుంటుంది. నాలాంటి వున్నతస్థాయి గాయకులు అలాంటి ఖరీదైన వాద్యాలే వాడడం ఉచితం. అవి కొంటున్నాను కాబట్టి వీటి అవసరం నాకు లేదు...."

జగన్నాధం వీరయ్యకి తంబూరా, హార్మనీ, వెండి షీల్డులూ కప్పులూ ఇచ్చి పంపించేశాడు.

4

గదిలోకి వచ్చిన భర్తని అడిగింది పార్వతి.

"పైన ఎవరూ లేరు కదా?...."

"నేను చెప్పానుగా ఏ పిల్లో ఎలకో అయివుంటుందని?....చెప్తే వినవు నువ్వు!....ఏ దొంగా లేడు...." విసుక్కున్నాడు జగన్నాధం.

"ఇంతసేపైందేమిటి మీరు రావడానికి?"

"లెట్రిన్‌కి వెళ్ళాను...."

"రేపు ఉదయం తన తంబూరా, హార్మోనియం, కప్పులూ షీల్డులూ కనిపించక ఘొల్లుమంటుంది పార్వతి. లేకపోతే ప్రతిరోజూ ఈ సంగీతం గోల, ఆవిడ దర్పం యెవడు భరిస్తాడు?...." అనుకున్నాడు సంగీతం అంటే ఏ మాత్రం యిష్టంలేని. ఒక సంగీతకారిణి భర్త అయిన జగన్నాధం.



ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి అప్పుడే వచ్చి 'హిందూ' పేపరు చూస్తున్నాడు.

అప్పుడు ఉదయం ఎనిమిది గంటలైంది.

జనరల్ హాస్పటల్ అటెండర్ వచ్చి విష్ చేశాడు.

"ఎవరు నువ్వు?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"హాస్పటల్‌నుంచి వచ్చాను సార్!" అంటూ ఒక సీల్డు

కవరు అందించాడు.

"ఏమిటయ్యా! ప్రొద్దున్నే....?" అంటూ అందుకున్నాడు ఇన్‌స్పెక్టర్. అతని మనసు యేదో అశుభం శంకిస్తోంది.

"బర్నింగ్ కేస్ సార్!" అన్నాడు అటెండర్.

"ఇంకా సరిగా తెల్లవారలేదు. చావడానికి కూడా తొందరే మనుషులకు" విసుగ్గా కవరు చించాడు.

హాస్పటల్ సూపరెన్టెంట్ స్పెషల్ మెసెంజర్ ద్వారా పంపించిన రహస్యలేఖ అది.

'ఈ రోజు వుదయం ఆరుగంటలకు శరీరాన్ని కాల్చుకున్న జ్యోతిని ఇరుగు పొరుగువాళ్ళు తీసుకొచ్చి అడ్మిట్ చేశారు. పరిస్థితి సీరియస్‌గా వుంది. ఇది హత్య కావచ్చు. ఆత్మహత్య కావచ్చు. పేషెంట్ స్పృహ తప్పిన స్థితిలో వుంది. ట్రీట్‌మెంట్ జరుగుతున్నది. ఆమెకు తెలివి రావచ్చు. కాని కొన్ని గంటల కంటే ఎక్కువసేపు జీవించే అవకాశం లేదు. కాబట్టి మరణవాఙ్మూలం తీసుకోవడానికి తగిన యేర్పాట్లు చేసుకోవలసింది.'

ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి దీర్ఘంగా నిట్టూర్చాడు. హాస్పటల్ అటెండర్ వెళ్ళిపోయాడు.

అతను మేజస్ట్రేట్‌కి రిక్విజిషన్ తయారుచేసి స్పెషల్ మెసెంజర్ ద్వారా పంపించాడు.

ఇంతలో సబ్‌ఇన్‌స్పెక్టర్ అర్జునుడు స్టేషన్‌లోకి అడుగుపెట్టి సెల్యూట్ చేశాడు.

"ప్రొద్దున్నే మనకి కేసు తగిలింది" అంటూ కేసు వివరాలు చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"ఇటువంటివి సర్వసాధారణమై పోయాయి సార్! ఇది గూడా కట్నం తీసుకురాలేదనో, స్కూటర్ కొనివ్వలేదనో కక్షతో కోడలిపై హత్యాప్రయత్నమై వుంటుంది" అన్నాడు యస్.ఐ. అర్జునుడు.

"ఆమెకు స్పృహ వస్తే అన్ని సంగతులూ తెలుస్తాయి పద" అన్నాడు కృష్ణమూర్తి.

2

ఇన్‌స్పెక్టర్ హాస్పటల్‌కి చేరుకునేసరికి అక్కడ జనం గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు.

సూపర్నెంట్‌గారు ఆఫీసులో వున్నారని వార్డ్‌బాయ్ చెప్పాడు. "గుడ్ మాణింగ్" అంటూ వెళ్ళాడు కృష్ణమూర్తి.

"వెరీ గుడ్‌మాణింగ్. రండి...." అంటూ నవ్వాడు సూపర్నెంట్.

"మేజిస్ట్రేట్‌గారు రాలేదా?" ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"ఇంకా లేదు."

"ఆయనకోసం మనిషిని పంపేదా?"

"ఎందుకు? మీరు మెసేజ్ పంపారట గదా! నాకు ఫోన్ చేశారు. ఆమెకు స్పృహ ఎప్పుడు వస్తుందని! ఒక గంటలో రావచ్చునని చెప్పాను. అలాగే గంట తర్వాత వస్తానన్నారు" అన్నాడు సూపర్నెంట్.

"ఐ. సీ...." అన్నాడు.

"కేసు అడ్మిట్ చేసింది ఎవరు? ఆమె భర్తయేనా?"

"కాదనుకుంటాను. హజ్బెండ్ వూళ్ళో లేదని విన్నాను" అంటూ కాలింగ్‌బెల్ మ్రోగించాడు.

వార్డ్‌బాయ్ వచ్చి నిల్చున్నాడు.

"ఆ బర్నింగ్ కేసు అడ్మిట్ చేసిన మనిషి యెవరో వుంటే తీసుకురా!" అన్నాడు సూపర్నెంట్.

వార్డుబాయ్ తల వూపి వెళ్ళిపోయాడు.

"డాక్టర్ ఈ కేసు గురించి మీరేమనుకుంటున్నారు? సూసైడ్ కావచ్చంటారా? లేక ఎవరైనా చంపాలని ప్రయత్నమంటారా?" ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

"చూడండి ఇన్స్పెక్టర్! బర్నింగ్ కేసుల్లో ఎటూ చెప్పలేం. ఆత్మహత్య కావచ్చు. లేదా ఆమె నిద్ర పోతున్న సమయంలో యెవరైనా నిప్పు పెట్టి చంపడానికి ప్రయత్నించనూ వచ్చును. సామాన్యంగా ఏ సంగతీ పేషెంటే చెప్పాలి"

"ఇటువంటి కేసులు ఈ రోజుల్లో విపరీతమైపోయాయి డాక్టర్. ఎక్కువగా కొత్తగా పెళ్ళయిన అమ్మాయిల్ని చంపడం. పేపర్లో ప్రతి రోజూ ఇటువంటి కేసొకటి తప్ప కుండా చూస్తున్నాం."

సూపర్నెంట్ తల వూపాడు.

ఇంతలో వార్డ్బోయ్ ఒక వ్యక్తిని వెంటబెట్టుకుని వచ్చాడు.

అతనికి ముప్పై ఏళ్ళు దాటివుంటాయి. నల్లగా బలిష్టంగా వున్నాడు. పూల పూల ఎర్ర రంగు లుంగీ బ్రౌన్ చారల షర్టు వేసుకున్నాడు. చదువుకున్న వ్యక్తి లాగే వున్నాడు.

"మీరేనా జ్యోతిని అడ్మిట్ చేసింది?" అడిగాడు సూపర్నెంట్.

"ఔను సార్!" తల వూపుతూ అన్నాడు ఆ వ్యక్తి.

"మీ పేరు?"

"వెంకట్రావు."

"కూర్చోండి" అన్నాడు సూపర్నెంట్.

వెంకట్రావు కూర్చున్నాడు.

"జ్యోతి మీకు బంధువా?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"లేదు సార్! మా ప్రక్కింటివాళ్ళు. బంధుత్వం ఏమీ లేదు."

"ఆమె కుటుంబం గురించి చెప్పండి."

"భార్యాభర్త యిద్దరే సార్. అతని పేరు మదన మోహన్."

"అతను ఏం చేస్తుంటాడు? వ్యాపారమా? ఏదైనా జాబ్."

"బ్యాంక్‌లో క్లర్కు. కెనరా బ్యాంక్."

"మదనమోహన్ ఇంట్లో లేడా?"

"లేడు సార్. రెండు రోజుల్నుంచి లేడు. ఎవరో స్నేహితుని పెళ్ళికి వెళ్ళాడని జ్యోతి చెప్పినట్లు నా భార్య చెప్పింది" అన్నాడు వెంకట్రావు.

"అయితే ప్రమాదం జరిగినప్పుడు మదనమోహన్ ఇంట్లో లేడంటారు?"

"లేడు సార్!"

"వాళ్ళిద్దరూ ఎలా వుంటారు? బాగుంటారా? లేక అస్తమానూ పోట్లాడుకుంటూ వుంటారా?"

"ఏమో సార్, నే నెప్పుడూ నోటీస్ చెయ్యలేదు. బాగానే వుంటారనుకుంటాను. అప్పుడప్పుడూ కీచులాడు కుంటారని నా భార్య చెప్పింది. అతనికి పేకాట వ్యసనం వుంది. డబ్బు తగలేస్తున్నావని జ్యోతి దెబ్బలాడుతుందట. అటువంటివి అన్ని సంసారాల్లోనూ వుంటాయి గదండీ" అన్నాడు వెంకట్రావు.

"అవును. వుంటుంటాయి" అన్నాడు కృష్ణమూర్తి.

"వాళ్ళకి పెళ్ళయి యెన్ని సంవత్సరాలై వుంటుంది?"

"రెండేళ్ళయింది."

"పిల్లలు లేరా?"

"వుహూం. లేరు. అప్పుడే పిల్లలు ఎందుకు? అంటుం దట జ్యోతి. ఇది గూడా నా భార్యే చెప్పింది."

"ఫ్యామిలీ ప్లానింగ్ అమలుపరుస్తున్నారన్నమాట."

"అవును."

"సార్! ఆమెకు స్పృహ వచ్చింది" అంటూ హడా వుడిగా వచ్చింది నర్స్.

హాస్పటల్ సూపర్నెంట్, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, వెంకట్రావు హడావుడిగా వార్డులోకి బయల్దేరి వెళ్ళారు.

ఆమె ఎంతో బాధ పడుతున్నట్లుగా చూస్తుంటేనే తెలిసి పోతోంది. ముఖం పొగ చూరినట్లు నల్లగా కమిలిపోయి వుంది. నల్లటి ముఖంలో తెల్లటి కళ్ళు చూడ్డానికి భయం కలిగిస్తున్నాయి.

ఆమె కళ్ళు తేలిపోతున్నాయి. కనుగుడ్లు స్థిరంగా నిల పడంలేదు. వూపిరి పీల్చడం గూడా భారంగానే వుంది. ఆఖరి క్షణాలలో వుంది. శరీరంలోనుంచి బైటపడడానికి ఒక జీవి పడుతున్న నరక బాధ కృష్ణమూర్తి కళ్ళారా చూస్తున్నాడు. అతని కడుపులో దేవినట్లయింది.

కొన్ని గంటల ముందు ఆమె ఎంతో అందంగా, ఆరో గ్యంగా వుండివుంటుంది. ఇప్పుడు శరీరమంతా కాలిపోయి వాసనకొడుతూ, భయంకరంగా కనిపిస్తూ ఇప్పుడో కాసే పటికో చావడానికి సిద్ధంగా వుంది. ఆమెకు ఆ స్థితిని కల్పిం చిన దుర్మార్గుడు ఎవరో?

ఆ క్షణంలో కృష్ణమూర్తి హృదయం మంచుగడ్డలా కరిగిపోయింది. మనిషిలో రాక్షసుడు వుంటాడని

ఆతనికి తెలుసును కాని మరీ తోటిమనిషిని యింత పైశాచీకంగా హింసపెట్టే మనిషిని ఏమని పిలవాలో అతనికి అర్థంకావడం లేదు.

"అమ్మా!....నీ పేరు జ్యోతి కదూ!"

"జ్యోతి కదూ!....జ్యోతి కదూ!....జ్యోతి కదూ!" చాలాసార్లు సూపర్నెంట్ అదే పనిగా అన్నాడు.

ఒక్కసారి మాత్రం ఆమె కళ్ళు స్థిరంగా నిలబడ్డాయి. శరీరంలోని శక్తినంతా కూడగట్టుకుంటోంది ఆమె.

అతి కష్టంమీద తల వూపింది. ఆమె పెదవులు కదుల్తున్నాయి. ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తోంది. కాని మాటలు రావడం లేదు పాపం.

"అమ్మా!....నిన్నెవరు కాల్చారు? .... ఎవరు? .... చెప్పమ్మా....! యెవరు కాల్చారు....? యెవరు....? ఎవరు?" సూపర్నెంటు ఆమెకు వినపడేటట్లుగా చెవిలో అంటున్నాడు.

ఆమె పెదవులు విప్పి "డాక్టర్...." అంది. అంతే పెదవులు అలాగే వుండిపోయాయి. కనుగుడ్లు పెద్దవైపోయాయి. కళ్ళలోంచి ప్రాణం పోయినట్లనిపించింది.

"షి ఇస్ డెడ్" అన్నాడు సూపర్నెంట్ ఆమె కను రెప్పలు మూసివేస్తూ.

ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి గుండె స్పందించింది ఆ దృశ్యం చూసి.

జ్యోతి ఎక్కడ పుట్టిందో? ఎక్కడ పెరిగిందో? కన్న తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్ళు, ఆఖరికి కట్టుకున్న భర్తగూడా దగరలేకుండా ప్రాణాలు వదిలింది. ఆమె పోయినందుకు ఏడ్చేవాళ్ళుగూడా లేరు.

3

"చూడు అర్జునా! జ్యోతికేసు మనం జాగ్రత్తగా డీల్ చేయాలి. ఆమె ఆత్మహత్య చేసుకోలేదనీ హత్య చేయబడిందనీ నా మనసు చెప్తోంది."

"యస్సార్!" అన్నాడు ఎస్. ఐ. అర్జునుడు.

"నువ్వు జ్యోతి వుంటున్న వీధిలో తిరిగి వివరాలు సేకరించాలి. ఆ వీధిలో ఎవరయినా గూర్ఖా తిరిగే అలవాటుంటే వాడిని పట్టుకో. ఆమె ఇంటికి ఆరాత్రి ఎవరైనా వచ్చివెళ్ళారా లేదా? అనే విషయంలో యెవర్నయినా ప్రశ్నించి తెలుసుకో."

"ఎస్సార్!" అన్నాడు.

"సివిల్ డ్రెస్‌లో తిరుగు. అవసరం అనుకుంటే ఇద్దరు కానిస్టేబుల్స్‌ని హెల్ప్‌గా తీసికెళ్ళు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఎస్. ఐ. అర్జునుడు సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

జ్యోతి చనిపోయింది.

ఆమె భర్త వూళ్ళోలేడు. స్నేహితుడి పెళ్ళికెళ్ళాడు. ఆమె చనిపోయిన సంగతి ఎవరికీ తెలియదు. ఆ ప్రక్కింటి వాళ్ళకిగాని ఎదురిళ్ళలో వాళ్ళకిగాని ఆమె పుట్టింటి, అత్తవారింటి అడ్రస్సులు తెలియవు.

ఇనస్పెక్టర్‌కి సడన్‌గా జ్ఞాపకం వచ్చింది అతను కెనరా బ్యాంకెలో జాబ్ చేస్తున్న విషయం. అతను లేకపోయినా అతని అడ్రస్ అక్కడివాళ్ళకి తెలియవచ్చు, అని తోచింది.

జీప్‌లో ఎక్కి కూర్చుని కెనరా బ్యాంక్‌కి పోనివ్వమన్నాడు డ్రయివర్‌తో.

కాసేపట్లో పోలీస్ జీప్ కెనరా బ్యాంక్ ముందు ఆగింది.

అప్పుడే పదిగంటలు కొట్టింది గడియారం.

బ్యాంక్‌లో కస్టమర్స్ పల్చగా వున్నారు.

ఇనస్పెక్టర్ బూటు చప్పుడుకి కౌంటర్‌లలోవున్న ఉద్యోగులు తలెత్తిచూశారు. ఇన్‌స్పెక్టర్‌కి ఆ బ్యాంక్‌లో ఖాతా లేదు. మరి ఎందుకు వచ్చాడో? అనుకున్నారు.

కృష్ణమూర్తి మేనేజర్ గదిలోకి అడుగుపెట్టాడు.

మేనేజర్ ఒక్కడే కూర్చుని రిజిస్టర్ చూస్తున్నాడు.

"ఐయామ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి."

"గ్లాడ్ టూ మీట్ యూ! నాపేరు శ్రీరామచంద్ర మూర్తి" అంటూ షేక్‌హాండ్ ఇచ్చాడు మేనేజర్.

తర్వాత బజ్జర్ నొక్కి అటెండర్ని పిలిచి కాఫీ తెమ్మన్నాడు.

"ఇప్పుడెందుకండీ. నేను డ్యూటీమీద వచ్చాను. కొంచెం ఇన్ఫర్మేషన్ కావాలి!" అన్నాడు.

"ఫరవాలేదు. నేను కాఫీ తీసుకునే టైమ్ యిదే. చెప్పండి ఏం కావాలి మీకు?" అన్నాడు మేనేజర్.

"మీ బ్యాంక్‌లో మదన్‌మోహన్ అనే క్లర్కు వున్నాడు. అతని నేటివ్‌ప్లేస్ అడ్రస్ కావాలి."

"ఏం జరిగింది ఇన్‌స్పెక్టర్? ఎందుకు?" వొకింత ఆశ్చర్యపోతూ అన్నాడు మేనేజర్.

"వెరీ బ్యాడ్‌న్యూస్ సార్! అతని భార్య ఒక గంట క్రితమే చనిపోయింది. పాపం ఈ విషయం అతనికి తెలియదు. రెండురోజులయిందట స్నేహితుని పెళ్ళికని వెళ్ళి."

ఇన్‌స్పెక్టర్ మాటలు వింటూనే అదిరిపడ్డాడు మేనేజర్ "ఈజ్ ఇట్" అంటూ.

"యస్ మూర్తిగారూ! నేను అక్కడే వున్నాను ఆ సమయంలో. మిజరబుల్ సిట్యుయేషన్" విచారంగా

అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఇంతలో అటెండర్ కాఫీలు తెచ్చి ముందుపెట్టాడు.

"ఎస్. బి. ఎక్కౌంట్స్ క్లర్క్‌ని రమ్మను" అన్నాడు మేనేజర్ అటెండర్‌తో.

సన్నగా పొడుగ్గావున్న పాతికేళ్ళ కుర్రవాడొచ్చి మేనేజర్‌కి విష్ చేశాడు.

"ఇన్‌స్పెక్టర్ ఇతనే మిస్టర్ మదన్‌మోహన్" అన్నాడు మేనేజర్.

"మదన్‌మోహన్ అంటే మీరేనా?" నమ్మలేనట్లుచూస్తూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అవును సార్! నేనే...." తనని చూసి ఇన్‌స్పెక్టర్ ఎందుకు అంతలా ఆశ్చర్యపోతున్నాడో మదన్‌మోహన్‌కి అర్థం కావడంలేదు.

"మీ భార్యపేరు జ్యోతేనా?" ప్రశ్నించాడు యిన్‌స్పెక్టర్.

"అవును. ఏం జరిగింది?" కంగారుపడ్డాడు అతను.

"అయామ్ సారీ మిస్టర్. యువర్ వైఫ్ ఈజ్ నో మోర్!" నెమ్మదిగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"సార్...." అంటూ అతను భయంతో వణికిపోయాడు.

"యస్. మీరు ఫ్రెండు మారేజికి వెళ్ళారటగా? ఎప్పుడొచ్చారు?"

"ఇప్పుడే.... సరాసరి బ్యాంక్ కొచ్చాను." సన్నటి స్వరంతో అన్నాడతను.

"తెల్లవారుజామున ఆరుగంటలకు కాలిపోతూ కేకలు పెడుతుంటే ప్రక్కింటి వెంకట్రావుగారు హాస్పటల్లో అడ్మిట్ చేశారు. గంట క్రితమే ఆమె పోయింది."

మదన్‌మోహన్‌కి దుఃఖం పొంగివచ్చింది. ఏడుస్తూ

ముఖానికి చేతులు అడ్డం పెట్టుకుని కుర్చీలో కూలబడి పోయాడు. కొంచెంసేపు అతన్ని ఏడవనిచ్చి, "ప్లీజ్! మీరు వెంటనే బంధువులకు తెలియపరచండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

స్టాఫ్‌కి ఈ సంగతి తెలిసి ఒక్కొక్కరే అతన్ని పరామర్శించడానికి వస్తున్నారు.

ఇక ఆ పరిస్థితిలో అతన్ని ప్రశ్నలువేసి బాధించడం బాగుండదని అనిపించి మేనేజర్ దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్.

4

"నమస్తే! ఇన్‌స్పెక్టర్‌గారూ!" అన్నాడు ఆయన.

"నమస్తే! రండి కూర్చోండి" అన్నాడు కృష్ణమూర్తి.

"సార్! వీరే జ్యోతి నాన్నగారు" అంటూ పరిచయం చేశాడు హెడ్‌కానిస్టేబుల్.

"జ్యోతి నాన్నగారు మీరేనా? రండి. కొంచెం మీతో మాట్లాడాలని పిలిపించాను. మీ పేరు."

"వెంకట్రామయ్య!"

"ఏం చేస్తుంటారు?"

"మాది తెనాలి. చిన్న వ్యాపారం. కట్టెల అడితీ వుంది" అన్నాడు వెంకట్రామయ్య.

"చూడండి వెంకట్రామయ్యగారూ! జ్యోతి దారుణంగా చనిపోవడం నేను కళ్ళారా చూశాను."

వెంకట్రామయ్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కళ్ళు తుడుచుకున్నాడు. ముఖం ఎర్రబడిపోయింది దుఃఖంతో.

"జ్యోతి ఎలా చనిపోయిందో అర్థంకావడంలేదు. ప్రమాదవశాత్తు జరిగిందో? లేక కావాలని ఆత్మహత్య చేసుకొందో? లేక ఎవరయినా...." అంటూ ఆగిపోయాడు

ఇన్‌స్పెక్టర్.

వెంకట్రామయ్య ఏమీ మాట్లాడటంలేదు.

"మీ అల్లుడు ఎలాంటివాడు? మంచివాడేనా? జ్యోతిని బాగా చూసుకునేవాడా?"

"మంచివాడనే ఇరయివేలు కట్నం యిచ్చి పెళ్ళి చేశానండీ. కాని అతను తాగుతాడనీ, పేకాట ఆడతాడనీ తర్వాత తెలిసింది."

"హూ(....."

"అమ్మాయి సుఖపడాలని తాహతుకు మించిన సంబంధాన్ని చేశాను. కాని ఏం సుఖపడింది?"

"కట్నం ఇరవై వేలు ఇచ్చారన్నమాట. అంతా ఇచ్చేశారా? లేక ఇంకేమైనా బాకీవున్నారా?"

"అంతా ఇచ్చానండీ"

"అల్లుడు ఇంకా ఏమైనా లాంఛనాలు కావాలని మిమ్మలిని అడగలేదా?"

"అడుగుతున్నాడు బాబూ! మోటారుసైకిల్ ఇవ్వమని పెళ్ళయిన దగ్గర్నుంచి అడుగుతున్నాడు. కాని నేను ఇవ్వగలిగిన స్థితిలో లేను. పెళ్ళికే నా పరిస్థితి దిగజారింది. అప్పుగూడా చేశాను" అన్నాడు వెంకట్రామయ్య.

"మీ మనసులో మాట చెప్పండి వెంకట్రామయ్యగారూ! మీరు మోటారు సైకిల్ కొనివ్వలేదనే కోపంతో అతను జ్యోతిని బలిచేసి వుంటాడంటారా?"

"ఏమో ఇన్‌స్పెక్టర్‌గారూ! నాకేమీ తోచడంలేదు. ఇలా జరుగుతుందని కలలోగూడా అనుకోలేదు. మనిషి బుద్ధి ఎప్పుడెలా మారుతుందో ఎలా చెప్పగలం? పోనివ్వండి. ఇప్పుడేం చేసినా నా తల్లి తిరిగిరాదుకదా!" బొంగురుపోయిన గొంతుతో అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ కాఫీ తెప్పించి ఇచ్చాడు. వెంకట్రామయ్య ఆ తర్వాత కొంచెంసేపు కూర్చుని సెలవు తీసుకొని వెళ్ళి పోయాడు.

పోస్టుమార్టం రిపోర్టు ముందు పెట్టుకుని చూస్తూ ఆలో చనలో పడిపోయాడు కృష్ణమూర్తి.

టెలిఫోన్ రింగయింది.

రిసీవర్ ఎత్తి "హలో! ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి స్పీకింగ్" అన్నాడు.

"నమస్తే ఇన్‌స్పెక్టర్. నేను కెనరాబ్యాంకు మేనేజర్ని మాట్లాడుతున్నాను."

"నమస్తే! ఏమిటి సార్ విశేషాలు?"

"ఏమీలేదు. నిన్న మదనమోహన్ ముందు ఒకవిషయం మీకు చెప్పలేకపోయాను. ఇప్పుడు చెప్పాలనిపించింది."

"చెప్పండి."

"అతను రెండురోజులు సెలవుపెట్టి స్నేహితుడి పెళ్ళి కెళ్ళాడన్నది అబద్ధం!"

"వాట్?"

"యస్. అసలు సంగతి మా మెసెంజర్ ఒకడు బైట పెట్టాడు. మదనమోహన్ ఆ రెండురోజులూ రాత్రంతా పేకాటలో గడిపాడట. భార్య గొడవ పెడుతుందని అబద్ధం చెప్పాడట."

"ఐసీ....అయితే పగలు డ్యూటీకి వచ్చాడా?"

"ఆఁ....పగలు డ్యూటి చేశాడు. సెలవు పెట్టనేలేదు. అతను వూళ్ళో లేడని మీరు అనగానే ఆశ్చర్యపోయాను. కాని అతను ఫీలౌతాడని అతనిముందు చెప్పలేదు."

"థాంక్స్ సార్! చాలా విలువయిన సమాచారం చెప్పారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

5

"సార్! నేను సివిల్ డ్రెస్‌లో ఆ వీధిలో తిరిగాను. అంతా జ్యోతి ఆత్మహత్య చేసుకుందనే అనుకుంటున్నారు. ఆమె భర్తకి పేకాట వ్యసనం అనీ, ఇంట్లో సరిగా డబ్బు లివ్వడనీ, ఆమె అతనితో తరచు ఘర్షణ పడుతూవుంటుందనీ, రాత్రిళ్ళు ఆలస్యంగా వస్తాడనీ ఆమెకు విరక్తిపుట్టి చచ్చిపోయివుంటుందని మెజారిటీ నిర్ణయం" అన్నాడు యస్. ఐ. అర్జునుడు.

"అయితే అతనిమీద ఎవరికీ అనుమానం లేదన్నమాట"

"లేదు సార్! కాని ...."

"ఎస్. చెప్పు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

"ఆ వీధిలో ఒక కాలేజీ కుర్రాడు వున్నాడు సార్! అతని పేరు శ్రీధరరెడ్డి. అతను ఒక విషయం చెప్పాడు. ఎంతవరకూ నిజమో తెలియదు."

"ఏమిటట?"

"ఆమె చనిపోయింది తెల్లవారిన తర్వాతకదా!"

"అవును."

"అంతక్రితం రాత్రి పదకొండుగంటల ప్రాంతంతో రవీంద్ర అనే డాక్టర్ వాళ్ళింట్లోనుంచి వచ్చాడట. అతన్ని శ్రీధర్‌రెడ్డి క్లియర్‌గా చూశానని చెపుతున్నాడు. రవీంద్ర తరచుగా వాళ్ళింటికి వస్తుంటాడనీ, జ్యోతికీ అతనికీ సంబంధం వుందేమోనని తనకి సందేహం అన్నాడు. మదనమోహన్ లేనప్పుడుగూడా వస్తుండబట్టి తను అలా అనుకుంటున్నానని అతను అన్నాడు."

"సరే! అలాగే అనుకుందాం. జ్యోతి భర్త అనాదరణ సహించలేక రవీంద్రతో సంబంధం యేర్పరుచుకొందని అనుకుందాం. కాని ఆమె చావుకి కారణం ఏమిటి? అనే

పాయింట్‌కి జవాబు దొరకాలి మనకి" అన్నాడు యిన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

అర్జునుడు అవునన్నట్లు తలవూపాడు.

"సార్! మదనమోహన్ స్నేహితుడి పెళ్ళికి వెళుతున్నాననీ రెండురోజులవరకూ రానని చెప్పి వెళ్ళడంలో అంతరార్థం ఏమిటి? ఆ విధంగా తాను వూళ్ళోలేనని ఆమెను నమ్మించడం ఎందుకు? డాక్టర్ రవీంద్రతో ఆమెకు సంబంధం వుందా, లేదా అని తెలుసుకోడానికా? లేక ఏదో ఒక సమయంలో వచ్చి ఆమెను హత్య చెయ్యడానికా?" అన్నాడు అర్జునుడు.

"అవే మనం తెలుసుకోవలసిన సంగతులు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

6

"మీరు ఆ రెండు రోజులూ డ్యూటీకివెళ్ళారు. కాని ఇంటికి వెళ్ళలేదు. స్నేహితుడి పెళ్ళికి వెళుతున్నానని ఆమెకు అబద్ధం చెప్పారు. ఎందుకు మీరలా చేశారు?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"సార్! నాకు పేకాడే అలవాటువుంది. నా ఫ్రెండ్ రూములో ఆ రెండురోజులు రాత్రిపూట సిట్టింగ్ వేశాం. అర్ధరాత్రి రెండింటివరకూ ఆడేవాళ్ళం. ఆ సమయంలో ఇంటికి వెళితే జ్యోతి గొడవపెడుతుందని అలాచెప్పాను. అంతేసార్!"

"అది ఒక్కటి, రెండురోజులతో పొయ్యేదికాదుగదా!"

మదన్‌మోహన్ మాట్లాడలేదు.

"మీతోపాటు ఎవరెవరు ఆడేవారు?"

"మొత్తం అయిదుగురం సార్! ఆ నలుగురూ ఆ రూమ్‌లోనే వుంటున్నారు."

"పేర్లు చెప్పండి."

అతను చెప్పాడు.

"సార్. నన్ను అనుమానిస్తున్నారా?" అన్నాడు మదన్‌మోహన్.

"ఎందుకు అనుమానించగూడదు?" యెదురు ప్రశ్న వేశాడు కృష్ణమూర్తి.

"నేను జ్యోతిని బాధపెట్టగూడదని అలా చేశానుగాని నాకు వేరే వుద్దేశ్యంలేదు సార్! నేను జూదగాణ్ణికావచ్చు కాని హంతకుణ్ని కాదు."

"ఎందుకు కాకూడదు?"

"నాకు ఆమెను చంపవలసిన అవసరం యేముంది? నాకేం లాభం?"

"ఎందుకులేదు? పెళ్ళయిన దగ్గర్నుంచి మోటారు సైకిల్ కొనివ్వమని మీ మామగారిని అడుగుతున్నారు! కాని ఆయన కొనివ్వలేదు. ఆ కోపం ఈ విధంగా తీర్చు కున్నారేమో?జ్యోతి పోతేనేం? మరొక పదివేల కట్నంతో మరొక సీత వస్తుంది. ఏం?" గద్దించాడు కృష్ణమూర్తి.

"సార్! అంతమాట అనకండి. నేను మా మామగార్ని అడిగిన మాట నిజమేగాని ఆ విషయంలో నే నెప్పుడూ జ్యోతిని బాధపెట్టలేదు. నన్ను నమ్మండి సార్!" కళ్ళ నీళ్ళుపెట్టుకున్నాడు అతను.

"మిమ్మల్ని నమ్మాలో, అక్కరలేదో మాకు తెలుసు. ఒక్క విషయం గుర్తుంచుకోండి. జ్యోతిని చంపివుంటే మాత్రం శిక్షతప్పదు" కఠినంగా అన్నాడు కృష్ణమూర్తి.

అతనికి నోట మాటలు రాలేదు.

"డాక్టర్ రవీంద్ర ఎవరు? స్నేహితుడా?"

"అవును సార్! నా క్లాస్‌మేట్!"

"అతను తరచుగా వస్తుంటాడా మీ ఇంటికి?"

"వస్తుంటాడు సార్! జ్యోతికి ఆరోగ్యం బాగా లేదని రోజూ సాయంకాలం వచ్చి ఇంజక్షన్స్ చేస్తున్నాడు. నేను వున్నా లేకపోయినా వచ్చిపోతుంటాడు. నాకు బాగా క్లోజ్ ఫ్రెండ్" అన్నాడు మదనమోహన్.

కృష్ణమూర్తి అతని ముఖంలోకి పరీక్షగా చూశాడు.

"పదివేలు ఇచ్చారంటే ఒరిజనల్ లెటర్ ఇచ్చేస్తాను" అన్నాడు వెంకట్రావు.

డాక్టర్ రవీంద్ర చచ్చిపోయిన వాడిలా సోఫాలో కూర్చుండిపోయాడు.

"ఆలోచించుకోండి. మళ్ళీ ఒకసారి ఆ లెటర్ చదువుకోండి. జ్యోతి చావుకి కారణం మీరే అని స్పష్టంగా వుంది అందులో. ఇది పోలీసులకు చిక్కితే....హహ్హ.... డాక్టర్‌గారు జైల్లోకి పోతారు" పక పక నవ్వాడు వెంకట్రావు.

వెంకట్రావు నవ్వు డాక్టర్ చెవులకు మృత్యువు వికటాట్టహాసం చేసినట్లు వినిపించింది.

"అట్లా నవ్వకండి" అసహనంగా అరిచాడు.

"ఏం భయంగా వుందా?"

డాక్టర్ రవీంద్ర చేతిలోని కాగితాన్ని చింపి ముక్కలు ముక్కలు చేశాడు. ఆ ముక్కలు కిటికీలోనుంచి వదిలాడు. అవి కలిసిపోయాయి.

"వెంకట్రావుగారూ! మీరు అడిగిన డబ్బు ఇస్తాను. నాకు రెండు రోజులు టైమ్ ఇవ్వండి. ప్లీజ్." అన్నాడు డాక్టర్.

"అట్లాగే ఇస్తాను. కాని గుర్తుంచుకోండి. వెంకట్రావుని

మోసం చెయ్యడానికి ప్రయత్నించకండి. మోసం చేస్తే జైలు తప్పదు" వెంకట్రావు మళ్ళీ నవ్వాడు పకపకా.

"ప్లీజ్! అట్లా నవ్వకండి. ఇక వెళ్ళిపోండి" అన్నాడు డాక్టర్ రవీంద్ర.

"సరే వెళ్తున్నాను. నేనిక రాను. మీరే డబ్బిచ్చి ఆ లెటర్ తీసుకోండి. ఓ.కే."

"అట్లాగే!" అన్నాడు డాక్టర్.

గది తలుపులు తీసుకుని బైటకు రాబోయిన వెంకట్రావు యముడిలా నిల్చున్న ఇనస్పెక్టర్ని, ఆయన వెనుక సిబ్బందినీ చూసి నోట మాటరాక, కాళ్ళూ చేతులూ ఆడక వణికిపోసాగాడు.

"అర్జునా! ఇద్దరికీ బేడీలు తగిలించు" ఆజ్ఞాపించాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

తర్వాత వెంకట్రావు దగ్గర వున్న జ్యోతి లెటర్‌ను వెతికి తీసుకున్నారు.

అందులో ఇలా వుంది.

"సాయంకాలం రావాల్సిన డాక్టర్ రాలేదు. నేనిక రాడేమో అనుకున్నాను. కాని రాత్రి తొమ్మిదింటికి వచ్చాడు. ఏదో అర్జంట్ కేసు తగిలిందనీ రాలేక పోయాననీ చెప్పాడు. ఇంజక్షన్ రేపు చెయ్యవచ్చుగా అన్నాను. అలా చేస్తే మందు పని చెయ్యదు అన్నాడు.

నేను స్టౌవ్‌మీద సిరెంజ్ స్టెరిలైజ్ చేశాను. రవీంద్ర నాకు ఇంజక్షన్ చేశాడు. నా కళ్ళు మూసుకుపోసాగాయి. సరిగ్గా తెల్లవారు జామున నాకు తెలివి

వచ్చింది. లేచి నన్ను నేను చూసుకున్నాను. జరిగిందంతా జ్ఞాపకం వచ్చింది.

రవీంద్ర నాకు మత్తు ఇంజక్షన్ ఇచ్చాడు. నన్ను అనుభవించాడు. నాకు అదంతా తల్చుకున్నాక బ్రతకాలనిపించడం లేదు. అందుకే చచ్చిపోతున్నాను. నా చావుకి కారకుడు డాక్టర్ రవీంద్ర. వాడిని వురి తీయించండి.

ఇట్లు
జ్యోతి"

జ్యోతి కేకలు విని తనూ, తన భార్య వాళ్ళింటికి వెళ్ళామనీ, తనకు టేబుల్‌మీద ఆ కాగితం కనిపించిందనీ దాన్ని జేబులో దాచానని చెప్పాడు వెంకట్రావు.

"సార్! మీకు డాక్టర్ మీద ఎలా అనుమానం వచ్చింది?" ప్రశ్నించాడు అర్జునుడు.

"దానికి కారణం వుంది. జ్యోతి చనిపోయే ముందు "డాక్టర్" అని ఒకటే మాట అంది. నేను హాస్పటల్ సూపరెన్టెంట్‌ని వుద్దేశించి అలా అన్నదని అనుకున్నాను. డాక్టర్ రవీంద్ర రంగంలోకి వచ్చాక నాకు అనుమానం కలిగింది. ఆమె చెప్పబోయింది డాక్టర్ రవీంద్ర గురించి ఏమో? అనుకున్నాను. అందుకే నిన్ను డాక్టర్ ఇంటి దగ్గర కాపలా పెట్టమన్నాను. వెంకట్రావు అతని ఇంట్లోకి వెళ్ళగానే నాకు ఫోన్‌చేసి చెప్పగానే వచ్చాను" వివరించాడు ఇనస్పెక్టర్ కృష్ణమూర్తి.

"ప్రాణం పొయ్యాల్సిన డాక్టర్ ప్రాణం తీశాడు. దేవత దెయ్యమైంది" అన్నాడు అర్జునుడు కోపంగా. □

బొమ్మిడి అచ్యుతరావు

ఫోటోలాంటి కత్తి

"విరా కోసం మీ మామయ్యగారి గుమాస్తా వచ్చి వెళ్ళాడు. మీ మామయ్య ఎందుకో మిమ్మల్ని అవసరంగా రమ్మన్నారట" లక్ష్మి చెప్పింది భర్త ప్రభాకరం యింటికి రాగానే.

"ఎవరు, మా ముకుందం మామయ్యా? నన్ను రమ్మని కబురు పెట్టాడా? చాలా విచిత్రంగా వుంది. నేనంటే మండిపడిపోయే మా మామయ్య నన్ను రమ్మని పిలవటం- నిజంగా మరో ప్రపంచ వింత!"

"ఇందులో విచిత్రం ఏముంది? మొదట్లో ఏ కలహాలు వచ్చినా ఆయన మేనమామ కాకపోతారా? మీరు మేనల్లుడు కాకపోతారా? ఇంతకీ నేనేగా పరాయిదాన్ని!" నవ్వింది లక్ష్మి.

"ఇప్పుడు నీవే నా సర్వస్వం లక్ష్మీ! తమ్ముడు సుధా కరం, నువ్వూ నాకు రెండు కళ్ళు!"

"ఊ, ఊఁ! ఆ సంగతి నాకు తెలుసుగాని, ఎందుకో వెళ్ళి కనుక్కోండి. పడినగోడలు పడినట్టే వుండవు."

"అలాగే వెళ్తాను. దేవిగారి ఆజ్ఞ."

నవ్వుతూ బయటికి నడిచి, సైకిలెక్కాడు ప్రభాకరం.

2

"రా ప్రభా, కూచో!" అన్నాడు ముకుందం సోఫా చూపిస్తూ.

ప్రభాకరం కూచున్నాడు.

"ఎందుకో నిన్ను చూడాలనిపించింది. చాన్నాళ్ళయింది నిన్ను చూసి. సుధాకర్ వస్తుంటాడనుకో: నీ గురించి వాడ్ని అడిగి తెల్సుకుంటుంటాను."

"సుధా యిక్కడికొస్తున్నాడా మామయ్యా?"

"ఆఁ? తరచు వస్తూంటాడు. మా అల్లుడితో వాడికి బాగా దోస్తీ."

"అలాగా! నాకు తెలీదు."

"ప్రభా! నీ పట్ల నేను చాలా క్రూరంగా ప్రవరించాను."

"అదేమిటి మామయ్యా, అలాగంటావు?"

"స్వంత మేనల్లుడివైనా, రాధని నీకిచ్చి చెయ్యకుండా మీ యిద్దర్నీ విడదీశాను."

"ఆ సంగతులు యిప్పుడెందుకులే, మామయ్యా!"

"అలా అనకు బాబూ! రాధ మనసు తెలిసి తెలిసి దానికి అన్యాయం చేశాను. అది నిన్ను కోరుకుంది. నువ్వు దానిపట్ల యిష్టత కనపరిచావు. సంతోషంగా మిమ్మిల్నిద్దర్నీ కలపాల్సినవాడిని నేనే మిమ్మల్ని విడదీశాను. నువ్వు నా అంతస్థుకు సరితూగవని, లేనివాడివని నిన్ను నా సరసన నిల్చోనియ్యకుండా విసిరికొట్టాను. అందుకు ఫలితం అనుభవిస్తున్నాను" ఆవేదనగా అన్నాడు ముకుందం.

"అదేమిటి మామయ్యా, రాధకేం లోటు? రాజాలాంటి సంబంధం తెచ్చి చేశావు. రంజిత్ ఆస్తిపరుడు, అందగాడు. నీ ఆస్తిపాస్తుల్ని చక్కబెట్టగల స్తోమత వున్నవాడు!"

"అదే నా అహంకారానికి కారణమయింది. ఆస్తిపరుడని, నా కూతుర్ని అందలమెక్కిస్తాడని, అర్రులు చాచి అల్లుడ్ని చేసుకున్నాను. ఈ సంబంధం చేసుకున్నాక నా తల్లి సుఖపడిందిలేదు. వాడికి తాగుడు, వ్యభిచారం జూదం లాంటి వ్యసనాలన్నీ వున్నాయి. రాధ జీవితంలో నిప్పులు పోస్తున్నాడు పాపిష్టివాడు."

ప్రభాకరం ఆశ్చర్యంగా వింటున్నాడు.

"నిజం ప్రభా! రాధని నీకిచ్చి పెళ్ళిచేసి వుంటే నిజంగా నా కూతురు సుఖపడి వుండేది. డబ్బుతో సుఖాల్ని కొనుక్కోవచ్చునేమో గాని మంచి మనసుని కొనలేం. నా అల్లుడికి అసలు మనసే లేదు. ఇంకా మంచితనం ప్రసక్తికూడానా?" ముకుందం గొంతులో పశ్చాత్తాపం.

"ఎందుకో పిలిపించావట, కారణం చెప్పనే లేదు."

"కారణం ఏంలేదు ప్రభా! నిన్ను చూడాలనిపించింది. నేను చేసిన పొరపాటు సరిదిద్దుకోవాలనిపించింది. ఇదిగో, నీ పేర పదెకరాల పొలం, ఓ యిల్లు రాశాను. ఈ స్వల్ప కానుక అందుకో! భగవంతుడు మరోలా దలిచాడు గాని, లేకుంటే నా ఆస్తికంతకూ వారసుడివి కావలసినవాడివి. మీ అమ్మ కోరిక తీర్చలేకపోయాను. మీ అమ్మ చివరి కోరికగా నిన్ను నా అల్లుడిగా చేసుకొమ్మంది. మాటిచ్చి తప్పాను. కనీసం యిలాగయినా మీ అమ్మ ఆత్మకు శాంతి చేకూర్చగలిగితే నా కంతకన్నా కావలసిందేంలేదు" దస్తావేజులు ప్రభాకరాని కందించబోయాడు ముకుందం.

"వద్దు మామయ్యా! నాకు ఆస్తిమీద. అంతస్తుమీద ఆశ, మోజు రెండూ లేవు. నాకున్న ఉద్యోగం, దానిమీద వచ్చే జీతం నాకు, తమ్ముడికి, నా భార్యకి సరిపోతుంది. నాకు పెద్ద ఆశలేం లేవు" అన్నాడు ప్రభాకరం.

"కాదనకు బాబూ! ఇది నా మేనల్లుడికి నేను సంతోషంగా యిస్తున్న చిన్న కానుక! నీ మనసు, స్వాభిమానం నాకు తెలియనివి కాదు. తీసుకో!"

"నీకు నామీదున్న అభిమానం చాలు మామయ్యా! ఎన్నో ఏళ్ళ తర్వాత నన్ను ఆప్యాయంగా పిలిచి నీ మనసు విప్పి మాట్లాడావు. నీ మంచి మనసు ముందు యీ ఆస్తికి విలువ లేదు మామయ్యా! నే వస్తాను. మళ్ళీ కలుస్తాను" లేచాడు ప్రభాకరం.

ముకుందం నిట్టూర్చాడు.

౨

"మీరెలాగైనా నా భర్తని రక్షించాలి. మీమీద కొండంత ఆశపెట్టుకుని వచ్చాను" అన్నది లక్ష్మి. ఆమె కళ్ళు అవి

రళధారగా వర్షిస్తున్నాయి. గాలి కెగిరిపోయే చిగురుటాకులా వణికిపోతోంది.

"అలా కూచోమ్మా! నీకేం ఫరవాలేదు. నీ భర్తచేసిన నేరమేమిటి? అతని కొచ్చిన కష్టమేమిటి? వివరంగా చెప్పు" అన్నాడు డిటెక్టివ్ కిరణ్ సౌమ్యంగా.

లక్ష్మి కూచుంది.

"నా భర్త వాళ్ళ మామయ్య ముకుందాన్ని హత్యచేశాడన్న నేరంతో పోలీసులు అరెస్టు చేశారు" వెక్కుతూ చెప్పింది.

"అవును, పేపర్లో చూశాను, రైసు మిల్లరు ముకుందాన్ని అతని మేనల్లుడు ప్రభాకరం హత్యచేశాడని! ఆ ప్రభాకరమే నీ భర్తా?"

"అవునండి ఆయన ఏ పాపమూ ఎరగరు. ఇది ఎవరో కావాలని చేసిన కుట్ర! వారు అలాంటివారు కాదు."

"అసలేం జరిగిందో చెప్పమ్మా."

"నిన్న సాయంత్రం ముకుందంగారు రమ్మంటున్నారని ఎవరో వచ్చి చెప్పారు మా వారితో. ఆయన యింట్లోకి బియ్యం తేవటానికి సంచీ తీసుకుని వెళ్తున్నారు అప్పుడే! కబురు వినగానే అలాగే వెళ్ళిపోయారు. రైస్‌మిల్లు అవుట్ హౌస్‌లో ముకుందంగారున్నారని ఆ వచ్చిన మనిషి చెప్పాడు. ఈయన రైస్‌మిల్లుకి వెళ్ళారు. ముకుందంగార్ని అప్పటికే ఎవరో చంపేశారు. ఆ నేరం మావారిమీద మోపారు. పోలీసులు ఆయన్ను అరెస్టుచేశారు."

"మీవారికి, ముకుందంగారికి ఏమైనా మనస్పర్థలు వున్నాయా?"

"ఇదివరలో వుండేవండి. ముకుందంగారి అమ్మాయి రాధని మా వారికి చెయ్యాలనుకునేవారు. ముకుందంగార్ధు

ఒప్పుకోక పోవటంతో ఆ సంబంధం తప్పిపోయింది. నన్ను చేసుకున్నారు. ఆ విధంగా మేనమామ అల్లుళ్ళ మధ్య సఖ్యత చాన్నాళ్ళు చెడింది. ఈ మధ్యనే ముకుందంగారు మావార్ని పిలిపించి తను చేసిన తప్పుకు బాధపడ్డారట. పదెకరాల పంటభూమి మావారి పేర రాసి, యివ్వబోయారట. ఆయన ఒద్దని వచ్చేశారు.

"చీమకుకూడా అపకారం తలపెట్టని పసి హృదయం ఆయనది. ఈ ఘోరకృత్యం ఆయన చేశారంటే నేనే కాదు, ఆయన మనస్తత్వం ఎరిగినవాళ్ళెవ్వరూ నమ్మరు."

కిరణ్ జాలిగా చూశాడు ఆమెని.

"సరేనమ్మా! నేను దర్యాప్తు చేస్తాను. నీ భర్త నిజంగా నిర్దోషే అయితే అతన్ని విడిపించటానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. నేరం చేసివుంటే మాత్రం అతన్ని చట్టానికి ఒప్పచెప్పక తప్పదు."

లక్ష్మి నీళ్ళునిండిన కళ్ళతో కిరణ్ వంక కృతజ్ఞతగా చూసింది.

4

"రా బ్రదర్! బొత్తిగా రావటమే మానేశావు" ఆహ్వానించాడు ఇనస్పెక్టర్ శ్రీనివాస్.

"నేను రాకపోతే నువు రాకూడదా? ఈ మధ్య కేసులేం లేవా ఏమిటి?" నవ్వుతూ అన్నాడు కిరణ్.

"లేకపోవటమేమిటి? ప్రజల్లో నేర ప్రవృత్తి నానాటికీ పెరిగిపోతోంది. ఎవడు దొరో, ఎవడు దొంగో, ఎవడు ఖూనీకోరో తెలీని రోజులు వచ్చాయి. మా డిపార్టుమెంటుకి చేతినిండా పని!"

కిరణ్ భావగర్భితంగా నవ్వాడు.

"ఓ కేసు విషయంలో వివరాలు కావలసి వచ్చాను."

"ఏమిటది? అడుగు."

"ముకుందం హత్యకేసు గురించి. ప్రభాకరం అన్న పేరుగల ముకుందం మేనల్లుడు హత్యచేశాడని అరెస్టు చేశారు పోలీసులు. ఆ కేసు వివరాలు కావాలి."

"బై ఆల్ మీన్స్! నిన్న సాయంత్రం ఆరున్నరగంటల ప్రాంతంలో రైస్ మిల్లరు, లక్షాధికారి ముకుందాన్ని అతని మేనల్లుడు ప్రభాకరం రైస్‌మిల్లు ఔటుహౌస్‌లో కత్తితో పొడిచి చంపాడు. హంతకుడు స్పాట్‌లోనే దొరికాడు. అతని చేతిలో రక్తంతో తడిసిన కత్తి వుంది. అతని దుస్తులు రక్తసిక్తమై వున్నాయి" చెప్పాడు శ్రీనివాస్.

"అతని చేతిలో వున్న కత్తి, రక్తం చిందిన దుస్తులు అతనే హత్యచేశాడని ఋజువు చేస్తున్నాయా?"

"అవును. కత్తి పిడిమీద అతని వేలిముద్రలు మాత్రమే వున్నాయి. అదీగాక స్పాట్‌లోనే దొరికాడు. ఈ ఆధారాల కన్న యింకేం కావాలి?"

"ఇంకా ఏ కారణాలు అతన్ని హంతకుడిగా రుజువు చేస్తున్నాయి?"

"ముఖ్యమైన ఆధారం మరొకటుంది. హంతకుడు హతుడ్ని బెదిరించి పదెకరాల పొలం తన పేర రాయించు కున్నాడు. ఆ పొలం తాలూకు దస్తావేజులు స్పాట్‌లో దొరికాయి మాకు. బెదిరించి రాయించుకుని, నిర్దాక్షిణ్యంగా పొడిచి చంపేశాడు" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు.

"నేనోసారి ప్రభాకరంతో మాట్లాడాలి."

"అలాగే! సార్జెంటు తీసుకెళ్తాడు సెల్ దగ్గరికి. వెళ్ళిరా! ఒకమాట! ఈ కేసు నువ్వు టేకప్ చేశావా?"

"అవును."

"కాని ప్రభాకరం హంతకుడని రుజువు చెయ్యగల ఆధారాలు చాలా వున్నాయి. అతను విడుదల కావటం చాలా కష్టసాధ్యం!"

కిరణ్ సమాధానంగా నవ్వాడు.

సార్జంట్ వెంటరాగా ప్రభాకరం సెల్ దగ్గరికి నడిచాడు.

5

"నన్ను డిటెక్టివ్ కిరణ్ అంటారు" పరిచయం చేసుకున్నాడు కిరణ్.

ప్రభాకరం కిరణ్ వంక తలతిప్పి చూశాడు.

"మీగురించి చాలా విన్నాను. ఇప్పుడే చూడటం జరిగింది" అన్నాడు. అతని ముఖం బాగా పీక్కుపోయి వుంది. కళ్ళకింద నల్లటి గీతలు. మనిషి పదిరోజులుగా లంఖణాలు చేసినవాడిలా వున్నాడు.

"నన్ను మీ భార్య లక్ష్మి ఈ కేసు పరిశోధించటానికి నియమించారు" అన్నాడు కిరణ్.

ప్రభాకరం ముఖం ఒక్కసారిగా వెలిగిపోయింది.

"మీరీ కేసులో ఎలా చిక్కుకున్నారో, ఆ సమయానికి హత్యాస్థలంలో ఎందుకున్నారో ఏదీ దాచకుండా నాకు చెప్పాలి. అప్పుడు మాత్రమే మీకేమైనా సహాయం చెయ్యగలుగుతాను" అన్నాడు కిరణ్.

"అన్నీ వివరంగా చెపుతాను. ఈ హత్యతో నాకే విధమైన సంబంధమూ లేదు" అన్నాడు ప్రభాకరం.

కిరణ్ తలూపాడు.

"నిన్న సాయంత్రం బియ్యం తేపటానికి మార్కెట్ కి బయల్దేరాను. సరిగ్గా అదే సమయంలో మా మామయ్య ముకుందం పిలుస్తున్నాడని మనిషి వచ్చి చెప్పాడు. ఈ మధ్య మామయ్య నన్ను తరచు పిలిపించుకుని కష్టసుఖాలు

చెపుతున్నాడు. అలాగే పిలిచాడనుకుని వెళ్ళాను. రైస్ మిల్లులో ఔట్ హౌస్ వుంది. సాయంత్రం కాసేపు మామయ్య అక్కడ కూచుని మిల్లు వ్యవహారాలు చూసుకుని వెళ్ళిపోతుంటాడు యింటికి. ఔట్ హౌస్‌లో వున్నాడని ఆ మనిషి చెప్పాడు. సరాసరి మిల్లుకి పోయాను.

"మామయ్య వుండే గది తలుపులు ఓరవాకిలిగా మూసి వున్నాయి. లోనికి నడిచాను. మామయ్య నేలమీద పడి గిలగిల కొట్టుకుంటున్నాడు. ఛాతీలో కత్తి! అప్పటికే రెండు మూడు పోట్లు గుండెల్లో పొడిచి పోయాడు హంతకుడు. మామయ్య సైగచేసి కత్తి తీసెయ్యమన్నాడు. నేనింకేమీ ఆలోచించకుండా గుండెల్లో నించి కత్తిని లాగేశాను. చివ్వున దుస్తులమీద రక్తం చిందింది. మామయ్య వెంటనే ప్రాణం వదిలేశాడు.

"సరిగ్గా అదే సమయానికి తలుపులు తోసుకుని పోలీసులు లోపలికి ప్రవేశించారు. నేనుండిన పరిస్థితి నేనే హంతకుడ్నిగా రుజువు చేసింది. నేనేం చెప్పినా వాళ్ళు వినలేదు. అరెస్టు చేశారు" అన్నాడు ప్రభాకరం.

కిరణ్ సాలోచనగా తల వూపి, "ఆ సమయంలో ఆ ఔట్ హౌస్ పక్కన ఎవరూ లేరా? ముకుందంగారు కేకలు వెయ్యలేదా? వేసినా వినిపించనంత దూరంలో వున్నదా ఔట్ హౌస్." అడిగాడు కిరణ్.

"రైసుమిల్లు రొదకి దూరంగా వుండాలని అదే కాంపౌండ్‌లో దూరంగా కట్టించాడు మామయ్య ఔట్ హౌస్. మిల్లు పనిచేస్తుంటుంది గాబట్టి, కేకలు పెట్టినా మిల్లు దగ్గిరున్న పనివాళ్ళకు వినిపించకపోవచ్చును. ఔట్ హౌస్ దగ్గరకు అవసరమయితే తప్ప పనివాళ్ళు రారు" చెప్పాడు ప్రభాకరం.

కిరణ్ ప్రభాకరం భుజం తట్టి, "మీరు చెప్పిన విష యాలే నిజమయితే, మిమ్మల్ని విడుదల చేసే బాధ్యత నాది! ఆధారాలు నేను సంపాదిస్తాను" అన్నాడు.

ప్రభాకరం నీళ్ళు నిండిన కళ్ళతో ఆశగా కిరణ్‌నిచూసి చేతులు జోడించాడు. కిరణ్ తిరిగి ఇనస్పెక్టర్ శ్రీనివాస్ గదిలోకి వెళ్ళాడు.

సార్జంట్‌ని పిలిచి రెండు కూల్‌డ్రింక్స్ చెప్పాడు శ్రీనివాస్.

"ఇందాకా నిన్నడగటం మరిచాను. ముకుందం హత్య చేయబడిన విషయం నీ కెవరు తెలియచేశారు?" అడిగాడు కిరణ్.

"హత్య చేయబడిన విషయం కాదు, హత్య చేయబడ బోతున్న విషయం నాకు ఫోన్ వచ్చింది. అతను పేరు చెప్పలేదు. వెంటనే బయలేరి వెళ్తే ఓ హత్య జరక్కుండా కాపాడగలరని నాకు ఫోన్‌చేసి, ముకుందం రైసుమిల్లు అడ్రసు చెప్పాడు. వెంటనే నేను బయల్దేరి వెళ్ళాను బలగంతో!"

"అనుకున్నాను. సరిగ్గా హంతకుడు హత్య చేస్తున్న సమయంలో పోలీసులు ప్రత్యక్షంగా అక్కడ హాజరవటం బహుశా చాలా అరుదైన విషయం."

"ముందుగా ఫోన్‌కాల్ వచ్చిందిగా! అదే ఓ రెండు నిమిషాలు ముందు వచ్చి వుంటే హత్య జరక్కుండా నిరో ధించి వుండగలిగే వాళ్ళం."

"ఫోన్‌కాల్ ముందుగా వచ్చి వుంటేనా, లేక మీరు రెండు నిమిషాలు ముందుగా అక్కడికి చేరుకుని వుంటేనా?"

"రెండూ ఒకటే!" అన్నాడు శ్రీనివాస్.

మందహాసం చేశాడు కిరణ్.

"డాక్టర్ రిపోర్టు వచ్చిందా?" అడిగాడు.

"ఓ గంట క్రితమే వచ్చింది" సొరుగు లాగి ఓ ఫైలు తీసి అందులోనించి పోస్టుమార్టం రిపోర్టు యిచ్చాడు శ్రీనివాస్.

ఛాతీలో మూడు కత్తిపోట్లు తగలటంవల్ల విపరీతమైన రక్తస్రావం జరిగి ప్రాణం పోయినట్టు రిపోర్టులో వుంది. ప్రాణం పోయిన సమయం సాయంత్రం ఆరు - ఆరున్నర మధ్య.

రిపోర్టు శ్రీనివాస్‌కి అందచేస్తూ, "నువ్వు నీ బలగంతో స్పాట్‌లో అడుగుపెట్టేసరికి టైం ఎంత?" అడిగాడు కిరణ్.

"సాయంత్రం ఆరు యిరవై ఎనిమిది."

"ఆ సమయంలో బోట్‌హౌస్ దగ్గిర పనివాళ్ళుగాని, గుమస్తాగాని ఎవరైనా వున్నారా?"

"ఎవరూ లేరు. నిర్మానుష్యంగా వుంది."

"ముకుందం హత్య చేయబడ్డ గదికి ఎన్ని ద్వారాలున్నాయి?"

"రెండు. ఒకటి మిల్లువైపు, మరొకటి వెనకవైపు—అంటే కాంపౌండ్ వాల్‌వైపు వున్నాయి."

"హంతకుడు వెనకద్వారంనించి ఎవరికీ కనిపించకుండా బయటికి పారిపోవటాని కవకాశ ముందా?"

"ఆ విషయం నేను పరిశీలనగా చూడలేదు. హంతకుడు వెంటనే దొరికిపోయాడు కాబట్టి, ఎటు తప్పించుకు పోయాడన్న ప్రశ్న తలెత్తలేదు. లేకుంటే ఆ విషయాలన్నీ పరిశీలనలోని కొచ్చేవి" చెప్పాడు శ్రీనివాస్.

"ఓ.కే. ఓసారి ముకుందం బోట్‌హౌస్ చూడాలి."

"అలాగే యిప్పుడే వెళ్దామా?"

తలూపాడు కిరణ్.

ఇంతలో ఓ యిరవై ఏళ్ళ యువకుడు భోజనం కారియర్ పట్టుకుని లోపలికొచ్చాడు.

"ఇతనెవరు?" కళ్ళతోనే ప్రశ్నించాడు కిరణ్.

"ప్రభాకరం తమ్ముడు. పేరు సుధాకర్. వాళ్ళన్నకి భోజనం తెచ్చినట్టున్నాడు" చెప్పాడు శ్రీనివాస్.

కిరణ్, సుధాకర్ వంక పరీక్షగా చూశాడు. దగ్గరికి రమ్మని పిలిచాడు. సుధాకర్ దగ్గరగా వచ్చాడు.

"నువ్వేం చేస్తుంటావు?" అడిగాడు కిరణ్.

"చదువుకుంటున్నాను సార్!"

"ఏ క్లాసు?"

"ఇంటర్మీడియట్ తప్పాను. మళ్ళీ పరీక్షకు కూచుంటున్నాను."

"ప్రభాకరం నీ కేమవుతాడు?"

"మా అన్న"

"మీరెంతమంది అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు?"

"మేమిద్దరమే సార్! అక్కచెల్లెళ్ళు ఎవరూ లేరు. మా నాన్నగారు నా చిన్నతనంలో పోయారు. అమ్మ రెండేళ్ళ క్రితం పోయింది."

"అయితే నువు మీ అన్నతోనే వుంటున్నావా?"

"అవును సార్! నేను, అన్నయ్య, వదిన ముగ్గురం కలిసి వుంటున్నాం."

"ముకుందం మీ మామయ్యా?"

"అవునండి. మేనమామ."

"ఆయనకి, మీ అన్నకి ఏమైనా శత్రుత్వముందా?"

"మామయ్య కూతుర్ని అన్నయ్యకిచ్చి చెయ్యాలనుకున్నారు. మామయ్య ఒప్పుకోలేదు. మాతో సంబంధం

తెంచుకున్నాడు. అంతకి మించి మా మధ్య గొడవలేం లేవు."

"మీ అన్న మీ మామయ్యని హత్య చేశాడన్న ఆరోపణతో అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏమైనా చెప్పవలసిన దుంటే నిర్భయంగా నాతో చెప్పు."

సుధాకర్ చేతులు జోడించి, "మా అన్న నిర్దోషి. అతన్నెలాగైనా విడిపించి మమ్మల్నందర్నీ రక్షించండి. అన్న జైలు పాలయితే వదినా నేను దిక్కులేని అనాథలమయిపోతాం" అన్నాడు దీనంగా.

కిరణ్ తలూపి, "సరే నువ్వెళ్ళు!" అన్నాడు.

సుధాకర్ కేరియర్‌తో సెల్‌వంక నడిచాడు.

"వెళ్దామా?" అనడిగాడు శ్రీనివాస్.

కిరణ్ లేచాడు.

6

రాజ్‌దూత్ ముకుందం రైసుమిల్లు దగ్గర ఆగింది.

శ్రీనివాస్ వెనకనించి దిగి, ఔట్‌హౌస్ వంక దారి తీశాడు. కిరణ్ అనుసరించాడు.

"ఊరికి కొంచెం దూరంగా వుంది ముకుందం రైసు మిల్లు. అక్కడితో యిళ్ళు అంతమై పొలాలు ప్రారంభమయ్యాయి. పొలాలకి యివతలి పక్కగా గొడవున్ప నిర్మాణంలో వున్నాయి.

కిరణ్ ఒక్క చూపులో యిదంతా గ్రహించాడు.

మిల్లు పని చెయ్యటం లేదు.

ఇద్దరు సెంట్రీలున్నారు మిల్లు దగ్గర. శ్రీనివాస్‌ని చూసి ఎదుటికొచ్చి సెల్యూట్ చేశారు.

ఔట్‌హౌస్ సీలు చెయ్యబడింది. శ్రీనివాస్ ఆదేశం మీద సెంట్రీ సీలువిప్పి తలుపు తెరిచాడు.

కిరణ్ లోని కడుగుపెట్టాడు. పెద్దగది. నేలమీద కార్పెటు పరిచివుంది. ఓ టేబులు, కుర్చీ టాబ్యులిర్ మంచం, దాని మీద పరుపు వున్నాయి గదిలో. ఓ పక్క బల్లమీద మంచి నీళ్ళ కూజా, గ్లాసు వున్నాయి.

నేలమీది నీలిరంగు కార్పెట్ మీద నల్లగా అట్టకట్టిన రక్తం, యింకా తడి ఆరనట్టు కనిపిస్తోంది. వెనకపక్క మరోద్వారం వుంది.

కిరణ్ తలుపులు తెరిచాడు. గది వెనకగా చిన్న వరండా దాన్ని ఆనుకుని సెప్టిక్ లేవేటరీ, బాత్ వున్నాయి. దాన్ని ఆనుకుని కాంపౌండ్‌వాల్ ఓ అడుగుదూరంలో వుంది. ఎత్తు మూడు అడుగులుంది. ఫెన్సింగ్ లేదు.

కాంపౌండ్ వాల్ మీది నుంచి పక్కనున్న పొలాలు కని పిస్తున్నాయి. కిందికి చూశాడు గోడమీదుగా కిరణ్. హంత కుడు గోడదూకి పొలాల్లో కలిసి చాలా తేలిగ్గా తప్పించుకో వచ్చును.

కిందికి పరీక్షగా చూసిన కిరణ్ కళ్ళు తళుక్కున మెరి శాయి. అక్కడ పల్చగా వున్న యిసుకమీద కారు టైరు గుర్తులున్నాయి. అక్కడ గడ్డి నలిగివుంది. కారు రివర్సు చేసిన ఆనవాళ్ళు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ గుర్తులు తారురోడ్ వరకు కనిపిస్తున్నాయి.

హంతకుడు హత్యచేశాక గోడదూకి తనకోసం సిద్ధంగా వున్న కారులో పరారీ అయ్యాడు. అంటే ఈ హత్యలో యింకా ఒకరిద్దరి పాత్ర వుందన్న మాట. లేదా, హంత కుడు ఒక్కడే కారు నడుపుకుని పారిపోయి వుండొచ్చు.

శ్రీనివాస్‌ని చూసి, "ఆ కారుటైరు గుర్తులు ట్రేస్ చేయించు. సిటీలోవున్న టాక్సీల, కార్ల టైర్లను చెక్ చేయించు" అన్నాడు కిరణ్.

తిరిగి బొటొహౌస్‌లోని కొచ్చి పరీక్షగా అంగుళం అంగుళం పరీక్షించాడు కిరణ్. ఆధారాలేం కనిపించలేదు.

"తలుపులు వేసెయ్యవచ్చునా!" అడిగాడు శ్రీనివాస్.

తలూపాడు కిరణ్.

బయటికొచ్చి బొట్‌హౌస్‌కి, రైసుమిల్లుకి వున్న దూరం అంచనా వేశాడు. మిల్లు పని చెయ్యకపోయినా, ముకుందం కేకలువేస్తే వినిపించనంత దూరంలో వుంది బొట్‌హౌస్-మిల్లుకి.

"డియర్ డాక్టర్, ముకుందం హత్య విషయంలో నాకు కొన్ని వివరాలు కావాలి" అన్నాడు కిరణ్.

"రైస్‌మిల్లర్ ముకుందం విషయమేనా?"

"అవును. ఛాతీలో దిగిన కత్తిపోట్లవల్ల అధిక రక్త స్రావం జరిగి చనిపోయినట్టు మీ రిపోర్టులో వుంది. ఛాతీకి కుడివైపున కత్తిపోట్లు తగిలాయి. మనిషి కెదురుగా వచ్చి కత్తితో పొడిస్తే సాధారణంగా హతుడి ఎడమపక్క ఛాతీలో పోట్లుండాలి. కాని యీ కేసులో కుడిపక్కన తగిలాయి. అంటే దీన్నిబట్టి హంతకుడు ఎడమచేతి వాటం వాడని అర్థమవుతోంది. ఏమై రైట్?" అనడిగాడు కిరణ్.

"యస్. మీ అనుమానం కరక్టే! హంతకుడు యెడమచేతి వాటంవాడే. పోట్లు లంబకోణంలో కాక ఛాతికి నలభై అయిదు డిగ్రీల కోణంలో చాలా లోతుగా దిగాయి! హతుడికెదురుగా హతుడు వూహించనంత వేగంగా, అతి సమీపం నుంచి పొడిచాడు."

"అంటే, హతుడితో హంతకుడికి బాగా సన్నిహితత్వముండివుండాలి. అతడితో మాట్లాడుతూ, అకస్మాత్తుగా

కత్తితీసి హతుడ్ని పొడిచివుండాలి. అవునా?"

"యు ఆర్ రైట్."

"థాంక్యూ వెరీమచ్."

డాక్టరు దగ్గర సెలవు తీసుకొని సరాసరి స్టేషన్‌కి వెళ్ళాడు కిరణ్.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కిరణ్‌ని చూస్తూనే, "కమాన్ బ్రదర్! టైరు గుర్తులు ముకుందంగారి కారువి. ఆ కారు ఆయన అల్లుడు రంజిన్ ఉపయోగిస్తున్నాడు. రంజిన్ కోసం కబురు పంపించనా?" అడిగాడు.

కిరణ్ రెండు క్షణాలు ఆలోచించి, "కాదు మనమే రంజిన్‌కోసం వెళ్దాం" అన్నాడు.

శ్రీనివాస్ లేచాడు.

రాజ్‌దూత్ ముకుందం గారింటి దగ్గర ఆగింది.

రంజిన్ ఎక్కడికో బయల్దేరుతున్నవాడల్లా వారిద్దర్నీ చూసి ఆగాడు. ప్రశ్నార్థకంగా చూశాడు.

"మీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. ఓ అయిదు నిమిషాలు" అన్నాడు శ్రీనివాస్.

"ఏ విషయాలు?"

"అదే, మీ మామగారి హత్య విషయంలో."

"ఇంకా మాట్లాడేదేముంది?హంతకుడు దొరికాడుకదా?"

కిరణ్ అసహనంగా చూసి, "కూచోమని చెప్పటం కనీసమర్యాద అనుకుంటాను" అన్నాడు.

రంజిన్ గతుక్కుమని "సారీ, హాల్లో కూచుందాం. రండి" అంటూ లోపలికి దారి తీశాడు.

ముకుందం యిల్లు చాలా పెద్దది. రెండు అంతస్థులు. విశాలమైన గదులు. గోడలు పెయింట్స్‌తో తళతళలాడు తున్నాయి. గోడలకి తైలవర్ణ చిత్రాలు. ఇంటినిండా ఖరీ

దైన ఫర్నిచరు. నేలమీద ప్రతిఅంగుళం ఖరీదైన కాశ్మీరు తివాచీతో కప్పబడివుంది.

"ఇప్పుడు చెప్పండి" అన్నాడు రంజిన్.

"మీమామగారి హత్యజరిగినరోజు మీరెక్కడున్నారు?"

"టౌన్‌హాల్లో. నాతోబాటు మరో అయిదుగురు పేకాడుతున్నాం. వాళ్ళంతా హైసొసైటీ పీపుల్. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి పది గంటల వరకు అక్కడే వున్నాను.మా మామగారు హత్యచెయ్యబడ్డ సంగతి కబురొచ్చాక లేచి వచ్చాను" అన్నాడు రంజిన్!

ఈ లోపల పనిమనిషి మూడు కప్పుల్తో కాఫీ తీసుకొచ్చింది.

రంజిన్ కుడిచేత్తో కప్పులు యిద్దరికీ సర్వ్‌చేసి తనొకటి తీసుకున్నాడు. తర్వాత సిగరెట్టు పాకెట్టుతీసి, వారిద్దరికీ ఆఫర్ చేశాడు.

"సారీ, అలవాటులేదు" అన్నారిద్దరూ ఒకేసారి.

"అరె. వండర్! డిటెక్టివ్స్ సిగరెట్టుమీద సిగరెట్టు తగలేసి మరీ ఆలోచిస్తుంటారని చాలా పుస్తకాల్లో చదివానే!"

"అది అందరికీ అలవాటుండకపోవచ్చు కదా!"

రంజిన్ ఓ సిగరెట్టు పెదిమల కతికించాడు. ఎక్కడా యెడమచెయ్యి పొరపాటనైనా వుపయోగించటంలేదు.

"మీ కారు మీ మామగారు హత్య చెయ్యబడ్డ సాయంత్రం ఎక్కడుంది?"

"నాతోనే. టౌన్‌హాలుకి తోలుకువెళ్ళాను."

"కాని ఆ సాయంత్రం మీ మామగారి రైస్‌మిల్లు వెనక కాంపౌండ్ వాల్ దగ్గర చాలాసేపు ఎదురుచూస్తూ వుంది మీ కారు. ఎవరికైనా అరువిచ్చారా?"

"నోనో. అది చాలా ఖరీదయిన కారు.ఎవరికీ యివ్వను."

"ఓ.కే. మేం వస్తాం."

కిరణ్ లేచాడు. శ్రీనివాస్ అనుసరించాడు.

"రంజిత్ నిజం చెప్పటంలేదు" అన్నాడు కిరణ్.

8

ఉదయం పదిగంటలయింది.

కిరణ్ తన రూపం పూర్తిగా మార్చేసుకున్నాడు. సిక్కు గెడ్డం, తలపాగా, కుడిచేతికి వెండికడియం, పొట్టి చొక్కా, నేరోపేంటు — పూర్తిగా పంజాబీలా తయారయాడు.

ఆటోలో బయల్దేరాడు. మెయిన్‌రోడ్డులో షాపులపేర్లు వెతుక్కుంటూ "రంజిత్ ఫాన్సీ అండ్ జనరల్ స్టోర్సు" దగ్గర ఆటో దిగాడు.

లోపల సుధాకర్ కౌంటర్లో కూచునివున్నాడు.

కిరణ్‌ని చూసి 'క్యా చాహియే సాబ్?' అనడిగాడు సుధాకర్ వ్యాపార సరళిలో.

"హమ్‌కో ఏక్ సింథాల్ సోప్ చాహియే" అన్నాడు కిరణ్.

సుధాకర్ చటుక్కున కేసులోంచి సోప్ తీసిచ్చాడు. ఎడమచెయ్యి ఉపయోగించటం గమనించాడు కిరణ్.

"హమ్‌కో బిల్ చాహియే!" అన్నాడు కిరణ్.

"జరూర్ దేంగే సాబ్! ఆప్‌కా శుభ్‌నామ్ బతాయియే?" అంటూ బిల్‌బుక్ తీశాడు సుధాకర్. కొత్త బిల్‌బుక్.

బిల్‌బుక్‌మీద 'సుధాకర్ ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్' అనివుంది. దిగువ ప్రొ॥ వి. సుధాకర్ అని వుంది.

"షేర్‌సింగ్" చెప్పాడు కిరణ్.

సుధాకర్ ఎడమచేత్తో చకచక బిల్ రాసి, చించి కిరణ్ చేతిలో పెట్టాడు.

కిరణ్ బిల్ పేచేసి, ఆటోలో తిన్నగా పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళాడు.

శ్రీనివాస్ కిరణ్ వంక ప్రశ్నార్థకంగా చూసి, "వాట్ డూ యూ వాంట్ సార్!" అనడిగాడు.

కిరణ్ నవ్వి "మైడియర్ ఇన్‌స్పెక్టర్! హంతకుడు 'రంజిన్ ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్'లో వున్నాడు. వెళ్ళి అరెస్టు చెయ్యి. పేరు సుధాకర్, ప్రభాకరం తమ్ముడు" అన్నాడు.

శ్రీనివాస్ కిరణ్ గొంతు గుర్తుపట్టి ఆశ్చర్యంగా చూశాడు.

"బ్రదర్, ఏమిటీ అవతారం? గుర్తే తెలీడంలేదు" అన్నాడు.

"ముందు నే చెప్పిన పని చూడు" అన్నాడు కిరణ్.

9

"బ్రదర్ సుధాకర్ నేరం ఒప్పుకున్నాడు. రంజిన్ ప్రోద్బలంతో ముకుందాన్ని హత్య చేశానని చెప్పాడు. రంజిన్‌ని కూడా కస్టడీలోకి తీసుకున్నాం. రంజిన్ చూపిన ఆశతో ముకుందాన్ని హత్యచేయటం సహేతుకంగానే వుందిగాని, హంతకుడిగా స్వంతన్నని యిరికించటంలో సుధాకర్ ఉద్దేశ్యమేమిటి?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్.

"ఆలోచిస్తే, రంజిన్ హంతకుడు కాదని, కాకపోతే అతనికి హత్యతో పరోక్షంగా సంబంధముందని నాకర్థ మయింది. సుధాకర్ ప్రవర్తన అనుమానాస్పదంగా తోచింది. ఒక రోజంతా వాళ్ళిద్దరినీ కనిపెట్టాను. అందుకే మారువేషంలో 'రంజిన్ స్టోర్సు'కి వెళ్ళాను.

సుధాకర్ ఎడమచేతివాటం వాడని ప్రత్యక్షంగా తెలిసి పోయింది. బిల్ బుక్ మీద సుధాకర్ పేరన స్టోర్సు పేరుంది. ప్రొప్రయిటర్‌గా సుధాకర్ పేరుంది. అంటే

ముకుందాన్ని హత్యచేసినందుకు బహుమానంగా రంజిన్ తన స్టోర్సు సుధాకర్‌కి రాసిచ్చేశాడన్నమాట. బిల్‌బుక్స్ కొత్తవి వేసుకున్నాడుగాని, షాపు పేరింకా మార్చలేదు.

రంజిన్ ఆస్తికోసం తన మామను చంపించాడు. అతడి సావాసంలో సుధాకర్‌కు దురలవాట్లు అనేకం అలవడ్డాయి.

హత్య జరిగిన సాయంకాలం రంజిన్ కారులో-రంజిన్ సుధాకర్ రైస్‌మిల్లుకి వెళ్ళారు. రంజిన్ కాంపౌండ్ వాల్ వెనక కారు ఆపి, సుధాకర్‌కోసం ఎదురు చూస్తున్నాడు. సుధాకర్ హత్య చెయ్యటానికి కొద్దినిమిషాల ముందు నీకు ఫోన్‌చేసి నువ్వు సమయానికి స్పాట్‌లో వుండేలాచేశాడు. అంతక్రితమే ఓ మనిషిద్వారా ముకుందం రమ్మంటున్నాడని అన్నగారికి కబురుచేశాడు.

సరిగ్గా ప్రభాకరం కాంపౌండ్‌లోకి ప్రవేశించటం చూసి ఔట్‌హౌస్‌లో మామయ్యని మాటల్లోపెట్టి, అకస్మాత్తుగా ముకుందాన్ని పొడిచి, కత్తి అలాగే వదిలేసి, వెనుకద్వారం గుండా పారిపోయి, గోడదూకి సిద్ధంగావున్న కారులో రంజిన్‌తో పరారయ్యాడు. ప్రభాకరం ముకుందం గదిలోకి అడుగుపెట్టిన సమయానికి నువ్వూ నీ బలగంతో స్పాట్‌కి చేరుకున్నావు. ప్రభాకరంపేర రాసిన పొలం తాలూకు దస్తావేజులు రంజిన్ తెచ్చాడు. సుధాకర్ వాటిని గదిలో విడిచాడు.

ప్రభాకరాన్ని హత్యలో యిరికించటానికి రెండు కారణాలున్నాయి. మొదటిది సుధాకర్ అన్నను తనకు అడ్డుతొలగించుకోవాలనుకొనడము, రెండవది - రంజిన్‌కి ప్రభాకరం మీదవున్న శత్రుత్వం. ఒకప్పుడు తన భార్య అతన్ని చేసుకోబోయిందన్న దుగ్ధ రంజిన్‌లో వుంది'' ముగించాడు కిరణ్.

□

దొంగలను పట్టే గజదొంగ

జొన్నలగడ్డ రామలక్ష్మి

అనుకోకుండా మా వూరు వెళ్ళాల్సొచ్చింది. ప్రయాణానికి నాతోపాటు నా స్నేహితుడు రవి కూడా బయల్దేరి వచ్చాడు. అతను రావడానికి కారణముంది.

రవి ఊళ్ళోనే ఉండే ఒకాయన కొడుక్కు మా ఆఫీసులో ఉద్యోగం వుంది. సెలక్టయినట్లు తెలియగానే రవి ఆయన కుత్తరం రాశాడు. ఉత్తరం రాసి రెండు నెల లయింది. అప్పుడాయన రవికి ఉత్తరం రాశాడు-ఇంకా అపాయింట్‌మెంట్ ఆర్డరు అందలేదని. దానికి రవి ఆఫీసులో ఎంక్వయిరీ చేశాడు.

"పోలీసు వెరిఫికేషన్ అవాలండీ-అంతవరకూ ఆర్డర్సు ఇస్యూ చేయడానికి వీల్లేదు" అంటూ గుమాస్తా కారణం వివరించాడు. విషయం రవి తన ఊరి వ్యక్తికి తెలియ జేశాడు.

మరో నెల గడిచినా పోలీసు వెరిఫికేషన్ అవలేదు. ఊరివ్యక్తి రవిని సాయంకోరాడు. ఉద్యోగం వచ్చిన మురళి మొదట్నించీ పట్నంలోనే వున్నాడు. పోలీసు వెరిఫికేషన్‌కు కాగితాలు పట్నానికే వెళ్ళాయి. పేరు చెప్పను. ఆ పట్నం మా ఊరికి దగ్గర.

ఇద్దరూ ట్రయిన్లో బయల్దేరాం. పదిగంటల ప్రయాణం. మా ఊళ్ళో ట్రయిన్ ఆగుతుంది. కానీ ఎంతోసేపు ఆగదు. అదీకాక తెల్లవారుజామున ట్రయిన్ అక్కడికి చేరు కుంటుంది. నిద్రపట్టిందంటే చాలా కష్టం.

అసలు మేము సరాసరి పట్నం వెళ్ళిపోవచ్చు. అక్కడైతే ట్రయిన్ పదినిముషాలు ఆగుతుంది. హడావుడికి మెలకువ కూడా వస్తుంది. కానీ మా ఊళ్ళో కొందరు లిటిగెంట్సున్నారు. వాళ్ళెప్పుడూ పోలీసుల చుట్టూ, ప్లీడర్ల చుట్టూ తిరుగుతుంటారు. రవి స్నేహితుడి గురించి వాళ్ళకు రాశాను. మా స్వంతపని అంటే పట్టించుకుని చేస్తారుగానీ ఇతరుల పనిని వాళ్ళంతగా పట్టించుకోరు. నేను స్వయంగా వెళ్ళి దగ్గరుండి పనిచేయిస్తే అవుతుంది. ఊరికి వెళ్ళాక

వాళ్ళను తీసుకుని పట్నం వెళ్ళాలన్నది మా ప్లాను.

నిద్ర ఎక్కడ పట్టేస్తుందోనని ఒంటిగంటకే లేచికూర్చు న్నాం. కాలక్షేపానికి ఏవో కబుర్లు మొదలెట్టాం. లక్కీగా మా బెర్తులదగ్గర జనంలేరు — మేమేం మాట్లాడుకున్నా అభ్యంతరపెట్టడానికి.

"ఈ పోలీసు వెరిఫికేషనెందుకో? మన ప్రాణం తీయడానికి!" అన్నాను.

"అలాగనకు. ఇది చాలా అవసరం. మనుషుల్లో ఎలాంటివారుంటారంటే చూడ్డానికి అమాయకంగా కన బడుతూ అడ్డమైన వెధవపనులూ చేస్తారు—" అన్నాడు రవి.

"అవకాశం వస్తే చాలామంది వెధవపన్లు చేస్తారు" అన్నాను.

"ఒప్పుకుంటాను. కానీ కొందరు అవకాశం రాక పోయినా కల్పించుకుంటారు. అలాంటివారు చాలా ప్రమాద కారులు" అన్నాడు రవి.

"నీ మనసులో ఎవరో వున్నట్లున్నారు" అన్నాను.

"అవును. వాడిపేరు సత్యం" అన్నాడు రవి.

"కాలక్షేపం అవుతుంది. వాడిగురించి చెప్పు!"అన్నాను.

సత్యం ఎమ్మెస్సీ ఫైనలియర్‌లో రవికి క్లాసుమేటు. మనిషి చాలా అందంగా వుంటాడు. అప్పట్లో అతణ్ని దేవానంద్ అనేవారు చాలామంది. ఎటొచ్చీ మనిషి దేవా నంద్‌కంటే ఇంకా నిండుగా వుండేవాడు.

రవి, సత్యం—ఇద్దరూ రూం తీసుకుని వాల్తేర్ అప్ లాండ్స్‌లో వుండేవారు. వాళ్ళింటికి దగ్గర్లో కనకారావు అనే రీసెర్చి స్కాలరుండేవాడు. కనకారావు కా పేరు తగదనీ శునకారావు అంటే బాగుంటుందనీ సత్యం అనే

వాడు. కనకారావు మనిషి అంత బాగుండడు. అతను ఎక్కువగా ఎవరితోటీ మాట్లాడడు.

అతణ్ని గురించి సత్యం అస్తమానూ ఏదో ఒకటి అంటుంటే—"మధ్య మన కాయన గొడవెందుకూ?" అని రవి విసుక్కున్నాడు.

అప్పుడు సత్యం అసలు సంగతి చెప్పాడు. "కనకారావు భార్య మంజుల అందానికి అప్సరస. ఆవిడ కనకారావు పక్కన దొండపండులా గుంటుంది."

"అయితే మనకేం?" అన్నాడు రవి.

"మనకేం అంటా వేమిటి? కట్నం మిచ్చుకోలేక ఓ అభాగ్య తండ్రి ఆమెనీ దరిద్రుడికిచ్చి పెళ్ళిచేసి ఉంటాడు. గతిలేక యీామె కాపురం చేస్తోంది. పాపం ఆమెకు సాయ పడొద్దూ—"

"ఆమెకు విడాకు లిప్పించి నువ్వు పెళ్ళి చేసుకుంటావా?" అన్నాను.

"అబ్బా—నీ ఆలోచనలన్నీ యెప్పుడు రాంగ్ ట్రాక్ లోనే వుంటాయి. మంజులలాంటి ఆడవాళ్ళు జీవితంలో తమకు కలిగిన అసంతృప్తిని నాలాంటి మగవాళ్ళ ద్వారా రహస్యంగా తీర్చుకునేందుకు ప్రయత్నిస్తారు—...." అన్నాడు సత్యం.

"వెధవ సెక్సు పుస్తకాలు మరీ యెక్కువగా చదవకు. నీ ఆలోచనలన్నీ రాంగ్ ట్రాక్‌లోకి పోతున్నాయి—" అని హెచ్చరించాడు రవి.

సత్యం ఒప్పుకోలేదు. మంజుల తనవైపు జాలిగా చూస్తోందన్నాడు. ఆశగా చూస్తోందన్నాడు. ఓ రోజున తెగించి ఆమె కో ప్రేమలేఖ వ్రాశాడు.

ప్రేమలేఖ మంజులకు అందింది. కానీ సత్యానికి

జవాబు రాలేదు. నాలుగురోజులు ఎదురుచూశాడు. అయినా జవాబు రాలేదు.

"అదృష్టవంతుడివి. మళ్ళీ యిలాంటి పొరపాటులు చేయకు. ఈసారికి ఆమె నిన్ను క్షమించింది—" అన్నాడు రవి.

"అదేం కాదు. మౌనం అర్ధంగీకారం—" అంటూ సత్యం ఆమె కింకో ఉత్తరం రాశాడు. దీనికీ జవాబు రాలేదు. రవి సత్యాన్ని బాగా మందలించాడు. సత్యం వాటిని చెవిని పెట్టకుండా — "ఆడదాని హృదయం నీకు అర్థంకాదు. నా ఉత్తరాలామెకు సంతోషాన్నిచ్చాయి. ఎటొచ్చీ నేను చొరవ చేస్తానని ఎదురు చూస్తోందామె. సంకేత స్థలం సూచిస్తూ ఆమెకు నేను త్తరం రాస్తాను...." అని సత్యం ఆమెకు మళ్ళీ మూడో ఉత్తరం రాశాడు. సంకేత స్థలాని కతను వెళ్ళాడు.

అక్కడికి మంజులరాలేదు. కానీ కనకారావు వచ్చాడు. అతను సత్యాన్ని పులుసులోకి ఎముక లేకుండా తన్ని— "మరోసారి బుద్ధి తక్కువ పని చేశావంటే ప్రాణాలు దక్కవు—" అని హెచ్చరించాడు.

దెబ్బలు గట్టిగా తగలడంవల్ల సత్యం హాస్పిటల్లో కూడా చేరవలసి వచ్చింది. రవి హాస్పిటల్‌కి వెళ్ళి— "ఆవిడ నీ రెండు త్తరాలను క్షమించింది. మూడో ఉత్త రంతో విసిగిపోయి భర్తకు చూపించి వుంటుంది—" అన్నాడు.

అయితే సత్యానికి బుద్ధి వచ్చినట్లు లేదు—"అప్పుడే అయిందా-నేనూ ఆ కనకారావుగాడికి బుద్ధి చెబుతాను—" అన్నాడు.

"తప్పు నీదే కానీ అతడిది కాదు....—" అన్నాడు

రవి.

"తప్పొప్పులతో నాకు నిమిత్తం లేదు. నన్ను వాడు కొట్టాడు. నేనూ వాణ్ణికొట్టాలి. అదే నాతో వ్యవహారం" అన్నాడు సత్యం.

రవి భయపడి తనకు రూమ్ మేట్‌గా మరొకణ్ణి తీసుకున్నాడు.

"ఆ తర్వాతేమయింది? సత్యం కనకారావుని తన్నాడా?" అనడిగాను.

"అవేమీ నాకు తెలియదు. కనకారావుకి భయపడి వాడా ఏడాది పరీక్ష ఇవ్వలేదు. ఎందుకంటే కనకారావు ప్రొఫెసర్‌కు దగ్గర మనిషి. ఎందుకయినా మంచిదని నేను కనకారావుని కలుసుకుని—ఈ విషయంలో పూర్తిగా నేను అమాయకుణ్ణని చెప్పుకున్నాను కూడా. లక్కీగా నా కేమీ అపకారం జరగలేదు—" అన్నాడు రవి.

"అది సరే—తర్వాత సత్యం పరీక్ష ప్యాసయ్యాడనుకో. పోలీసు వెరిఫికేషన్లో ఈ విషయం బయటపడదు గదా!" అన్నాను.

"చెప్పలేం! ఒక రీసెర్చి స్కాలరు భార్య కుత్తరం రాసినవాడు తన యింటి చుట్టుపక్కల ఇంకెంత వెధవలా వుండేవాడో—పోలీసు వెరిఫికేషన్లో యిలాంటి విషయాలే బయటపడతాయి—" అన్నాడు రవి.

అనుకోకుండా అప్పుడు నాకు సురేష్ గుర్తుకు వచ్చాడు.

"పోలీసు వెరిఫికేషన్లో కాకపోయినా ఏదో రకం వెరిఫికేషన్ ఒకోసారి అవసరమే" అన్నాను.

"ఎవరో నీ మనసులో వున్నట్లున్నారు—" అన్నాడు రవి.

అప్పుడు నేను సురేష్ కథ ప్రారంభించాను.

అన్నయ క్లాసుమేట్ సురేష్. రోజూ యింటికొచ్చి అన్నయ్యా సురేష్ గురించిన వివరాలు చెబుతూండేవాడు. క్లాసులో సురేష్ చాలా అల్లరి. అతడి అల్లరి అంతా మాట ల్లోనే వుంది.

ఓసారి సురేష్ క్లాసుకు ఆలస్యంగా వచ్చాడు. అది తెలుగు క్లాసు. లెక్చరర్ ఆలస్యానికి కారణం అడిగాడు.

"చెప్పడానికి బాగుండదండి—" అన్నాడు సురేష్.

"ఫరవాలేదు చెప్పు—" అని నొక్కించాడు లెక్చరర్. సురేష్ ఓ పట్టాన చెప్పలేదు. చెబితేకానీ క్లాసులోకి రానివ్వ నన్నాడు లెక్చరర్.

ఆఖరికి—"మా ఆవిడ యింట్లోకి రాకూడదదండి—" అన్నాడు సురేష్.

"ఊఁ" అని యిబ్బందిగా తల దించుకున్నాడు లెక్చ రర్. క్లాసులో ఇరవై మందిదాకా ఆడపిల్లలున్నారు. మగ పిల్లలంతా ఘొల్లుమన్నారు.

ఇంతకీ సురేష్‌కి పెళ్ళి కాలేదు.

తర్వాతి వారం కూడా సురేష్ క్లాసుకి ఆలస్యంగా వచ్చాడు.

"ఈసారేమయింది?" అన్నాడు లెక్చరర్.

"చెప్పకుందుకు బాగుండదండి—...." అన్నాడు సురేష్.

"ఫరవాలేదు — చెప్పు! ..." అని నొక్కించాడు లెక్చరర్.

"మేము పేదవాళ్ళమండి.డబ్బుకోసం కాలేజీ కాంటీన్లో పిండి రుబ్బి వచ్చానండి—" అన్నాడు సురేష్ కళ్ళొత్తు కుంటూ.

క్లాసులో అంతా ఘొల్లుమన్నారు. లెక్చరర్ తను అలాంటి ప్రశ్న అడిగినందుకు నొచ్చుకుంటూ జాలిగా సురేష్‌వంక చూసి—క్లాసువంక చిరాగ్గా చూసి—"మీలో మాత్రం ఎవరికీ ఆర్థిక ఇబ్బందులు లేవా? ఎందుకలా నవ్వుతారు?" అనడిగాడు.

"లేకేమండీ—ఆ వెంకటరత్నం నాలాంటివాడేనండి." అని—"ఒరేయ్ వెంకటరత్నం—నిన్ను రెండోవాయ రుబ్బడానికి కాంటీన్ మేనేజర్ రమ్మంటున్నాడురా—" అంటూ సురేష్ తన సీట్లో వెళ్ళి కూర్చున్నాడు. క్లాసంతా మళ్ళీ ఘొల్లుమన్నారు.

ఆ తర్వాతనుంచి ఏ లెక్చరరూ సురేష్ క్లాసుకు అలస్యంగా వస్తే కారణం అడిగేవారు కాదు.

సురేష్‌లో విశేష మేమిటంటే అతడి దగ్గర రెడీ విట్ వుండేది. అటు లెక్చరర్‌తోనూ, యిటు స్టూడెంట్సుతోనూ కూడా అతను జోక్సుమీద జోక్సు విసురుతూండేవాడు.

మా అన్నయ్య క్లాసులోనే అనంతం అని ఓ హార్మోనిస్టు వుండేవాడు. అతడు హార్మోనియం చాలా బాగా వాయించడంవల్ల చాలా కాలేజీఫంక్షన్సులో హార్మోనియం పట్టుకుని స్టేజి ఎక్కుతూండేవాడు. ఒక రోజున అనంతానికి తన ప్రతిభ గురించి నలుగురూ ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనిపించిందో ఏమో—నలుగురూ వుండగా—"చాలామందికి రకరకాల హాబీలుంటాయి. కొంతమంది ఇంటికిపోయి కథలు రాసుకుంటారు. కొంతమంది ఇంటికి పోయి బొమ్మ లేసుకుంటారు........" అని ఓ క్షణం ఆగాడు.

అప్పుడే అక్కడకు వచ్చిన సురేష్ ఆ మాటలు విని—"కొంతమంది వెధవలు ఇంటికి పోయి హార్మోనియం

వాయించుకుంటారు—" అన్నాడు.

ఇది విన్న అనంతం మొహం చిన్నబోయింది. కానీ ఏమీ అనలేక ఊరుకున్నాడు. ఇది విన్నప్పట్నించీ—"కొంతమంది—" అన్నది మా యింట్లో కూడా ఒక జోకుగా మారింది.

సురేష్ సరదా అయినవాడే అయినప్పటికీ అతడి కారణంగా క్లాసులో యిబ్బందులు కలుగుతూండేవి. అతడు బయటపడకుండా చాలా అల్లరి చేస్తూండేవాడు. ఆ కారణంగా పాఠాలు సరిగ్గా జరిగేవికాదు. రోజూ ఏదో విశేషం క్లాసులో అతడి కారణంగా జరుగుతూండేది.

మొదటి సంవత్సరం పరీక్షలు లేవు కాబట్టి ఫరవాలేక పోయింది. బియ్యే రెండవ సంవత్సరంలో లాంగ్వేజస్, జనరల్ ఎడ్యుకేషన్ పరీక్షలున్నాయి. అయినప్పటికీ సురేష్ అల్లరి తగ్గలేదు. కేవలం చదువుమీదనే దృష్టి ఉంచుకునే విద్యార్థులకు కొందరికి అతడి కారణంగా యిబ్బందిగా వుండేది.

అయితే అనుకోకుండా అందరికీ సురేష్ బెడద వదలి పోయింది.

అప్పట్లో మూడేళ్ళ డిగ్రీ కోర్సు కొత్తగా ప్రవేశపెట్ట బడింది. అంతకు పూర్వం పదకొండవతరగతి ప్యాసైనాక రెండేళ్ళ ఇంటర్మీడియట్ కోర్సూ, రెండేళ్ళ డిగ్రీ కోర్సూ వుండేవి: పాత ఇంటర్మీడియేట్ కోర్సు పెయిలయినవారు నూటికి 20 మార్కులు చొప్పున అన్ని సబ్జక్టులోనూ తెచ్చుకుని వుంటే మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో చేరవచ్చు. అంతకు తక్కువ వచ్చి ఫెయిలయినవారు పియ్యూసీలో చేరాలి. ఇంటర్మీడియేట్ ప్యాసైనవారు తిన్నగా డిగ్రీకోర్సు రెండవ సంవత్సరంలో చేరవచ్చు.

సురేష్ పాత ఇంటర్మీడియేట్ కోర్సు వాడు. అతడికి అన్ని సబ్జక్టుల్లోనూ నూటికి ఇరవై మార్కులు వచ్చి పరీక్ష ఫెయిలయ్యాడు. అందువల్ల అతణ్ని డిగ్రీ మొదటి సంవత్సరంలో జేర్చుకున్నారు.

రెండవ సంవత్సరం పరీక్ష ఫీజులు కట్టినపుడు రిజిస్ట్రారాఫీసులో ఓసారి మార్కుల లిస్టులను—ఒరిజినల్సుతో వెరిఫై చేస్తారు. మా కాలేజీనుంచి కూడా అందరి మార్కుల వివరాలూ యూనివర్సిటీ రిజిస్ట్రారాఫీసుకు పంపబడ్డాయి. అందులో ఓ తమాషా బయటపడింది.

సురేష్‌కు అన్ని సబ్జక్టుల్లో రెండువందలకూ ముప్పై మార్కులే వచ్చాయి. సురేష్ దాన్ని తెలివిగా ఎనభై గా మార్చాడు. మూడును ఎనిమిదిగా మార్చడం అంత కష్టం కాదు. అది చూసి ప్రిన్సిపాల్ అతన్ని కాలేజీలో చేర్చుకున్నాడు. అతడి నేరం వెరిఫికేషన్లో బయటపడింది.

సురేష్‌ను ఆరు సంవత్సరాలపాటు ఏ పరీక్షలకూ కూర్చోవడానికి వీల్లేదని యూనివర్సిటీ బహిష్కరించింది. ఆ తర్వాత సురేష్ ఏమయ్యాడో తెలియదు.

నేను చెప్పిన కథ విని—"చూశావా—వెరిఫికేషన్ వల్ల ప్రయోజనముందనడానికి నువ్వు చెప్పిన ఈ కథే సాక్ష్యం" అన్నాడు రవి.

"అది సరే—పోలీసు వెరిఫికేషన్లో యిలాంటి పాయింట్లన్నీ దొరుకుతాయంటావా? నాకు తెలిసినంతవరకూ స్టేషన్‌కు ఉత్తరం రాగానే ఓ కానిస్టేబులు బయల్దేరుతాడు. అడ్రసు పట్టుకుని యిల్లు చేరతాడు. మీవాడి కుద్యోగం వచ్చింది—ఏదయినా బక్షీసు యిప్పించండి బాబూ—అంటాడు. అయిదో పదో పుచ్చుకుని వెళ్ళిపోతాడు. ఈ మాత్రందానికి ఈ తతంగమంతా యెందుకూ అని నాకు అనిపిస్తుంది—"

అన్నాను.

"లోకంలో అన్యాయాలు, అక్రమాలు ఆగడం లేదని కోర్టులు మూసేస్తామా? ప్రతిదానికీ యెంతో కొంత అదుపు వుండాలి. ఇప్పుడీ ట్రయిన్లో మనం ప్రయాణం చేస్తున్నాం. ఎవరయినా మనల్ని కత్తులతో అటకాయించి వున్నదంతా దోచుకుపోవచ్చు. కానీ యెవరుపడితే వాళ్ళు అలా చేయరు. ఎందుకని? పోలీసులున్నారన్న భయంవల్ల. పోలీసులుండడం వల్లనే చాలామంది నేరాలు చేయడానికి భయపడుతున్నారు. కాదంటావా?" అన్నాడు రవి.

రవి నిజమే చెప్పాడు. కాదని యెలాగనగలను? ఊరుకున్నాను.

2

ట్రయిన్ ఓ అరగంట లేటుగా మా ఊళ్ళో ఆగింది. ఆదరాబాదరాగా స్టేషన్లో దిగి రిక్షాల్లో యింటికి చేరి వెంటనే పడుకున్నాం. నిద్ర లేచేసరికి తొమ్మిదయి పోయింది.

"త్వరగా తెమలి పట్నం వెళ్ళాలి. ఆ పని చూసుకుని తొందరగా వూరు తిరిగి వెళ్ళకపోతే మా ఆవిడ క్రోధం వస్తుంది—" అన్నాడు రవి.

"అలాగే—మరి మా ఊరు రాకరాక వచ్చావు. ఊరు చూడనీకుండా వెళ్ళనిస్తానా? ఈ రోజు కింకే పనీ లేదు. ఊళ్ళో తిరుగుదాం—" అన్నాను.

"అలా వద్దు. మరోసారి మా ఆవిణ్ణి తీసుకునివస్తాను. అప్పుడు యిద్దరం కలిసి మీ ఊరు చూస్తాం. ఈ రోజుకు పని చూసుకు పోదాం—" అన్నాడు రవి.

సరేనని నాకు తెలిసిన చలపతి యింటికి బయల్దేరాను.

నేను వెళ్ళేసరికి చలపతి యింట్లోనే వున్నాడు. నేను చెప్పినదంతా విని—"నాకు తెలిసిన పోలీసు ఇన్‌స్పెక్టరున్నాడు. మీ పని క్షణాలమీద అయిపోతుంది. ఎటొచ్చీ మీ కాగితాలు స్టేషన్లో వుంటే రైటరు ద్వారా లాగిలించాలి బైటకు. అందుకు కనీసం వందరూపాయలైనా యిచ్చుకోవాలి. సిద్ధంగా ఉన్నారా?" అన్నాడు.

"అవసరమైతే తప్పదు. అలాగే ఇచ్చుకుందాం—" అన్నాడు రవి.

"ఈ మాత్రందానికి మీకు రాయాలా—ఆ కుర్రాడా ఊళ్ళోనే చదివాడు గదా—అతనే చూసుకోలేకపోయాడూ" అన్నాడు చలపతి.

"కుర్రాడు తెలివైనవాడే కానీ భయస్థుడు. ఇంకా పోస్టాఫీసుకెళ్ళి ఎంవో చేయడం రాదుట. ఆరొందల పేజీల పుస్తకం యిస్తే అర్థగంటలో ఆకళింపు చేసుకుంటాడుట" అన్నాను.

చలపతి నవ్వి—"ఆ తెలివితేటలు బ్రతుకుతెరువుకు పనికిరావు. సరేలే—ఎల్లుండి వెళ్ళి పని పూర్తి చేసుకొచ్చేద్దాం—" అన్నాడు.

ఎల్లుండి అనగానే రవి ఏడుపుముఖం పెట్టాడు. నేను రవి పరిస్థితి వివరించి చెప్పాను. అందుకు చలపతి జాలి పడి—"సరే—దానికేముంది? ఈయ నుండకపోయినా పనైపోతుంది. మనిద్దరం పూర్తి చేసేద్దాం. ఎటొచ్చీ మీ ఇద్దరిలో ఎవరో ఒకరుండాలి. వందరూపాయలు కావాలి!" అన్నాడు.

అలాగేనని అక్కణ్నించి బయల్దేరి ఇంటికి వచ్చాం. దారిలో గజపతి ఎదురయ్యాడు. సంగతేమిటి అని అడిగాడు. నేను చెప్పాను.

"కొంప ముంచారు. పోనీలెండి—ముందుగా నాచెవిన ఈః మాటవేశారు. ఆ చలపతిగాడికి పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం. పోలీస్‌స్టేషన్‌లో లంచ మివ్వడమంటే మాటలనుకున్నాడా? కొంపలు మునిగిపోతాయి. ఇచ్చిన వాణ్ణి ముందు బొక్కలో తోస్తారు. అలాంటి కేసులు అయిదు తెలుసు నాకు. ఒకవేళ అదృష్టం బాగుండి ఇన్‌స్పెక్టర్‌గారు మంచివాడయితే దయతల్చి మిమ్మల్ని వదలి పెట్టొచ్చు. కానీ—కుర్రాడి పోలీసు వెరిఫికేషన్‌కు వీళ్ళు లంచమివ్వాలని ఎందుకొచ్చారూ? కుర్రాడి ప్రవర్తనలో ఏదయినా లోపముందా? అన్న అనుమానం పట్టుకుంటుంది పోలీసోళ్ళకి. ఓసారి అనుమానమంటూ కలగాలికానీ అది ఓ పట్టానపోదు. కుర్రాడికి వుద్యోగం వచ్చినట్లే!—" అన్నాడు గజపతి.

నాకూ, రవికీకూడా కాళ్ళుచేతు లాడలేదు.

"మరేం చేయాలంటావ్?" అన్నాను కంగారుగా.

"ఏం చేయడానికీ ఏముందీ? నాకు తెలిసిన కోటిగాడొకడున్నాడు. వాణ్ణి కేటుగాడని అంతా అంటారు. వాడికి పోలీసోళ్ళతో చాలా లాలూచీ వ్యవహారాలున్నాయి. పట్నంలో చాలామంది ఇన్‌స్పెక్టర్‌బాబులకి వాడెంత చెబితే అంత! వాడికో యాభయి యిచ్చారంటే అది వాడు లంచంగా తీసుకుని పోలీసులకు లంచమివ్వకుండా పని చేయిస్తాడు. మీకూ ఏమీ ప్రమాదముండదు—" అన్నాడు గజపతి.

"ఈఃవేల్టికి వీలవుతుందా?" అన్నాను.

"అబ్బే—వా డూళ్ళోలేడు. రెండు మూడురోజులు ఆగాలి!" అన్నాడు గజపతి. ఆయనలా గనగానే రవి ముఖం మాడిపోయింది.

నేను రవి ఇబ్బంది గురించి గజపతికి చెప్పాను.

"అలాగా—దానికేముంది. మీ యిద్దరిలో ఎవరో ఒక రుంటే చాలు నాకు...." అన్నాడు గజపతి.

అక్కణ్నించి బయటపడి యిల్లుచేరాం. ఇప్పుడేం చేయాలి? చలపతిని నమ్మాలా, గజపతిని నమ్మాలా? ఇద్దరూ పరస్పర వ్యతిరేకంగా చెప్పారు. వాళ్ళిద్దరూ లిటిగెంట్సని నాకు తెలుసును కానీ లిటిగెంటు వ్యవహారాల్లో నాకు పరిచయంలేదు.

మే మిద్దరం చర్చించు కుంటూంటే నాన్నగారొచ్చి— "ఏమిటి విషయం? మీలో మీరు తర్జనభర్జన చేసుకుంటు న్నారు!" అనడిగారు.

నేను నెమ్మదిగా అంతా వివరించాను.

"బాగుంది. ఈ విషయం ముందే నాకు చెప్పాల్సింది" అన్నారు నాన్నగారు. "చలపతి, గజపతి ఇప్పుడు పూర్తిగా డబ్బు మనుషులయిపోయారు. ప్రతి విషయంలోనూ ఒక డవునన్నది ఇంకోడు కాదంటాడు. ఒకసారి వాళ్ళచేతుల్లో పడ్డామా—లేని సమస్యలు సృష్టించి మన దగ్గర్నుంచి ఇంకా యింకా డబ్బు లాగాలనే చూస్తారు తప్పితే—ఓ పట్టాన పని కానివ్వరు. వాళ్ళ తియ్యనిమాటలు, నమ్మకం కబుర్లు విని అంతా మోసపోతుంటారు. నా మాటవిని మీరు వాళ్ళని నమ్మకుండా—మీ అంతట మీరే పట్నంవెళ్ళి వివరాలన్నీ చెప్పి పోలీస్ స్టేషన్లో వాకబుచేయండి. అదృష్టం బాగుంటే వెంటనే పని పూర్తి కావచ్చును" అన్నారు నాన్నగారు.

3

మేము సాయంకాలం కాగానే పట్నం చేరుకున్నాము. అక్కడ మొత్తం మూడు పోలీసుస్టేషన్లు వున్నాయి.

మేము వన్ టౌన్‌కి వెళ్ళాం. మా వివరాలన్నీ విని వాళ్ళు టు టౌన్‌కి వెళ్ళమన్నారు.

తర్వాత మేము టూ టౌన్‌కి వెళ్ళాం. అక్కడ ఫైల్స్‌లో మావాడి కాగితాలున్నాయి.

"ఏమి టాలశ్యం?" అనడిగాడు రవి.

రైటరు ఫైల్సులోకి చూసి చెప్పాడు.

"కుర్రాడిమీద రిపోర్టు బ్యాడ్‌గావుంది. రెండుసార్లు జైలుకి వెళ్ళాట్ట. ఒకసారి హత్యచేస్తానని ఎవరినో బెదిరించాట్ట...." అన్నాడు రైటరు.

"అయితే ఈ రిపోర్టు వెంటనే ఎందుకు పంపలేదు—" అన్నాను.

"రెండుసార్లు జైలుకి వెళ్ళాడంటే ఆ వివరాలు మేం సంపాదించాలి. అంతవరకూ రిపోర్టు పంపడానికి లేదు" అన్నాడు రైటరు.

"మరి—ఎంతకాలం పడుతుంది?" అన్నాను.

"కొన్ని ప్రయత్నాలు చేశాం. మాకు వచ్చిన సమాచారం నిజమనడానికి ఋజువులు లభించలేదు. ఏం చేయాలో తెలియక ఊరుకున్నాం. చూస్తూ చూస్తూ ఓ అనుమానాస్పదమైన కేసుని మంచిగా రికమెండ్ చేయడం ఇన్‌స్పెక్టరు గారి కిష్టంలేదు. అలాగని అమాయకుడికి అన్యాయమూ చెయ్యలేము...." అన్నాడు రైటర్.

"ఆ కుర్రాడు నాకు చిన్నప్పట్నించీ తెలుసు. నేను బాధ్యతగల ప్రభుత్వోద్యోగిని. అతడి గురించి నేను సర్టిఫై చేస్తాను. మీకువచ్చిన సమాచారం అబద్ధం" అన్నాడు రవి.

రైటరు మా గురించిన వివరాలన్నీ విని జరిగిందానికి నొచ్చుకొని — "ఇదంతా మా ఇన్‌స్పెక్టర్‌గారికి చెప్పండి" అన్నాడు.

అప్పటికి ఇన్‌స్పెక్టర్ స్టేషన్‌లో లేడు. ఓ పావుగంట తర్వాత ఆయనవచ్చి మా కథవిని తక్షణం ఆ యింటి అడ్రసుకు ఓ కానిస్టేబుల్‌ని పంపాడు.

రిపోర్టు మంచిగా వచ్చింది.

"బహుశా కిట్టని వాళ్ళెవరో ఆ పని చేసుంటారు. ఇప్పుడు ఒకే కుర్రాడిమీద రెండురకాల రిపోర్టులొచ్చాయి. ఈ రెండూ పరిశీలించి—అసలు విషయం తెలుసుకోడానికి మరికొంత సమయం అవసరం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఇందుకు మరేమీ దారిలేదా?" అన్నాడు రవి.

అప్పుడు నేను ఇన్‌స్పెక్టర్‌ని పరీక్షగా చూసి—"మీ పేరు సురేష్ కదూ!" అన్నాను.

"అవును. మీకెలా తెలుసు!" అన్నాడు ఆశ్చర్యంగా అతను.

"మీరు మా అన్నయ్య క్లాసుమేటు—" అంటూ అన్నయ్య పేరు చెప్పాను.

అది వింటూనే సురేష్ నన్ను కౌగలించుకున్నంత పని చేసి-"మీ అన్నయ్య నాకు బాగా దగ్గర స్నేహితుడు. మీకు నేను తప్పక సాయం చేస్తాను. ఈరోజు ఈ విషయమై డీయస్పీగారితో మాట్లాడుతాను" అన్నాడు.

డీయస్పీగారితో తనూ మాట్లాడతానన్నాడు రవి.

సురేష్ మా అన్నయ్యమీద గౌరవంకొద్దీ అప్పటికప్పుడు రవిని తీసుకుని జీపులో డీయస్పీ యింటికి వెళ్ళాడు. నేను మాత్రం పోలీస్ స్టేషన్‌లో వుండిపోయాను.

ఇన్‌స్పెక్టర్‌కు తెలిసినవాడినని తెలియడంతో అక్కడ నాకు మర్యాదలు కాస్త ఎక్కువగా జరిగాయి. నేను మాత్రం ఆలోచిస్తున్నాను. కాలేజీలో తప్పుమార్కులు వేసి డిబారయిన సురేష్—ఇప్పుడు పోలీసు ఇన్‌స్పెక్టరై

ఇతరుల సచ్ఛీలతను ధృవపరుస్తున్నాడా? ఈ పరిస్థితి ఎలా ఏర్పడింది?

పూర్వం ఒక రాజు దొంగలను పట్టుకునే కొత్వాలు పదవికి ఓ పేరుమోసిన గజదొంగను నియమించాడట. అది రాజు తెలిసి చేసిన పని! పోలీస్ స్టేషన్‌లో సురేష్ నియామకం ప్రభుత్వం తెలిసి చేసిన పనియేనా? ప్రజల శాంతి భద్రతలను పరిరక్షించవలసిన పోలీసు ఉద్యోగంలో చేర్చుకునేముందు ప్రభుత్వం ఎలాంటి వెరిఫికేషన్ పద్ధతులు వుపయోగిస్తోంది!

నా ఆలోచనలు పరిపరివిధాలా పోయాయి.

ఒకసారి తప్పుచేసినవాడు కలకాలం శిక్షింపబడాలా అన్న దొక్కటైతే — నేరస్థుల్ని పట్టుకునేందుకు కొంత దుడుకు మనస్తత్వం గలవారేగానీ పనికిరారేమోనన్నది మరొక్కటి! బాల్యచాపల్యంలో సురేష్ చేసిన దుడుకుపని ఆనాడు మార్కులు మార్చడం. అందువల్లనే అతడు పోలీస్ ఇన్‌స్పెక్టర్ కాగలిగాడా?

పోలీస్ స్టేషన్‌లో నేను వాకబుచేశాను సురేష్‌గురించి. డిపార్టుమెంటులో అంతకంటే సమర్థవంతుడయిన వాడు లేడని చెప్పుకుంటారని వాళ్ళన్నారు. నేను సురేష్‌కు తెలిసిన వాణ్నిగదా అని వాళ్ళలా చెప్పారో లేక అది పూర్తిగా నిజమేనో! ఏది ఏమైనా అతడి క్రింది ఉద్యోగులందరూ అతడంటే గడగడలాడుతున్నారు. అది సమర్థుడయిన ఆఫీసరు లక్షణమే!

దీన్నిబట్టి నాకిప్పుడేమి తెలుస్తుంది?

ఒకసారి తప్పు చేసిన మనిషి — ఎన్నటికీ నేరస్థుడిగా మారడని రుజువుచేసిన సంఘటనగా దీన్ని తీసుకోవాలా లేక పోలీసు డిపార్టుమెంటులో ఇటువంటివారికి స్థానం లభి

స్తోందని అనుకోవాలా?

ఏది ఏమైనా ఆనాడు ముప్పయిని ఎనభయిగా మార్చి—పరీక్షలకు వెళ్ళకుండా డిబార్ చేయబడ్డ సురేష్—ఈనాడు మరో కుర్రాడి సచ్ఛీలతను ధృవపరచే ఉద్యోగం చేస్తున్నాడనగానే నా మనసు పరిపరివిధాల పోయింది. అన్యమనస్కంగా అలా కూర్చున్నాను.

ఆఖరికి రవి తిరిగి వచ్చినాక కూడా అతడు చెప్పేది నేను సరిగా వినలేదు. యాంత్రికంగా సురేష్‌దగ్గర సెలవు తీసుకుని అక్కణ్నించి రవితో కలసి బయటకు నడిచాను.

"ఉత్సాహంగా లేవేం? మావాడి పనయిపోయింది" అన్నాడు రవి.

"నా ఉత్సాహాని కేంలే-పనవడమే కదా మనకు ముఖ్యం" అన్నాను.

"పనెలాగయిందని అడగవేం?" అని ఇంకా వుత్సాహంగా అడిగాడు.

"చెప్పు!" అన్నాను.

"ట్రయిన్లో చెప్పాను-ఆ సత్యం డీయస్పీగా వున్నాడు. అప్పుడెలాగున్నా మంచి సమర్థుడయిన డీయస్పీ అని పేరు తెచ్చుకున్నాట్ట. పాత రిపోర్టు చించిపారేసి వెంటనే కొత్త రిపోర్టు పంపించమన్నాడు...."

ఉలిక్కిపడ్డాను....

"పోలీస్ వెరిఫికేషన్ క్షణాలమీద ముగిసింది—" అన్నాడు రవి.

నేను నా చిన్నతనంలో అల్లరిచిల్లరి పనులుచేసేవాళ్ళని గుర్తు తెచ్చుకుందుకు ప్రయత్నిస్తున్నాను. వాళ్ళ అడ్రసులు తెలుసుకుంటే వాళ్ళంతా నాకు సాయపడే స్థితిలో వుంటారేమో ననిపిస్తోంది. ▢

సుజనశ్రీ

అర్ధరాత్రి అబల

హోటల్ సవేరా, నగరంలోని స్టార్ హోటల్స్‌లో ఒకటి. బీచ్‌కి దగ్గరగా వుంది ఆ హోటల్. ఆ హోటల్ ప్రక్కగా చిన్నసందు, సందుకి అవతలివైపు ఏవో కంపెనీకి చెందిన గోడౌన్‌లు వున్నాయ్. ఆ సందులో

వేరే నివాసగృహాలు లేవు. హోటల్లోని చెత్తా చెదారం ఆ సందులోనే పోస్తుంటారు.

అటు ఎత్తయిన హోటల్, ఇటు మూడంతస్తుల గోడౌన్ వుండటంవల్ల ఆ సందులోకి పగలే యెండ పడదు నేలమీదకు.

పగలే చీకటి. నిర్మానుష్యమైన సందు. అమావాస్య రాత్రినాడు ఇంకా ఎంత భయంకరంగా వుంటుందో చెప్పనలవికాదు. రాత్రి ఏడు దాటింది.

ఆ సందులోంచి ఒక యువతి ప్రాణభయంతో పరుగెత్తు తున్నది. ఆమెను మరోవ్యక్తి వెంటాడుతున్నాడు.

"ఏయ్! సరోజా! అగు! నిన్నే ఆగు. ఆగకపోయావో చంపేస్తాను" ఆ వ్యక్తి అరుస్తున్నాడు.

ఆ యువతి రొప్పుతోంది. భయంతో వణికిపోతోంది. అడుగు వేయటం ఆలశ్యమైతే, ఆగంతకుడు తనను దొరకబుచ్చుకుంటాడేమో నన్న ప్రాణభీతితో యింకా వేగాన్ని పుంజుకుంది.

ఆ యువతికీ, ఆగంతకుడికీ మధ్యదూరం కొంచెంగా ఎక్కువయింది.

వెనుకనుంచి కారు హెడ్లైట్ల కాంతి పడింది.

వెనుకనుంచి వస్తున్న కారుని తప్పుకోవటానికి ఆగంతకుడు ప్రక్కకు జరిగాడు రోడ్డుమీద! కారు అతడ్ని దాటుకుని ముందుకు వెళ్ళిపోయింది.

ఆ యువతిలో ఆ కారు కొత్త ఆలోచనల్ని రేపింది. ఆగంతకుడ్ని దాటుకుని వచ్చేసింది కారు. దాన్ని ఎలాగయినా ఆపగలిగితే, దాంట్లో యెక్కి ఆగంతకుడ్నించి త్వరితంగా దూరంగా వెళ్ళిపోవచ్చు తను!

ఆమె పరుగు ఆపి నిలబడింది. రోడ్డు మధ్యలో నిలబడి

ఆపమన్నట్టుగా చేతులు అడ్డంగా ఊపసాగింది. కీచు మంటూ సడన్ బ్రేకులతో కారు ఆగింది ఆమెను తాకు తూన్నట్టుగా!

అదొక బాడుగ టాక్సీ! యూనిఫారలలో వున్న డ్రైవరు తల బైటికిపెట్టి పెద్దగా అరిచాడు.

"ఏవమ్మా! నీవు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే నా కారే చిక్కిందా!"

"బాబ్బాబూ! ఆ రౌడీ నన్ను తరుముకొస్తున్నాడు. నీ మీటర్ ఛార్జీ నే నిస్తాను. త్వరగా పోనీయ్. అతడ్నుంచి వీలైనంత దూరంగా, అతి వేగంగా పోనీయ్?" రొప్పుతూ రొజుతూ ఆ యువతి డోర్ తెరుచుకుని వెనుక సీట్లో కూర్చుంది.

విషమ పరిస్థితిని గమనించిన వాడిలా డ్రైవర్ ఆక్సి లేటర్ త్రొక్కాడు. కారు ముందుకు దూకింది.

అప్పటికి చేరువ అవుతున్న ఆగంతకుడి అరుపులు వెనకనుంచి వినిపించినయ్. క్రమేపీ దూరమైపోయినయ్.

"ఇంతకీ ఎవడు వాడు? నిన్నెందుకు వెంటాడుతున్నాడు. నువ్వు సరాసరి పోలీసు స్టేషన్‌కి వెళ్ళి రిపోర్టు ఇవ్వు! వాడి సంగతి వాళ్ళే చూసుకుంటారు" డ్రైవర్ సలహా ఇచ్చాడు.

"పోలీసులా!" ఆ యువతి కంగారుపడింది. అంతలోనే సంబాళించుకుంది.

"వద్దు! వద్దు! పోలీసులు నా మాటలు నమ్మరు. పైగా నన్నో పిచ్చిదానికింద జమకడతారు. ఇంకా నన్ను లాక్కెళ్ళి ఆ దుర్మార్గుడి చేతుల్లో అప్పజెప్పుతారు కూడాను!"

"అయితే మరి ఎక్కడకు తీసుకెళ్ళమంటావ్ నిన్ను!" డ్రైవర్ అడిగాడు.

"ఎవరైనా మంచి డిటెక్టివ్ దగ్గరకు జేర్చు! ఆ తర్వాత నీ దోవన నీవు పోవచ్చు!" ఆమె బ్రతిమాలింది.

"ప్రైవేట్ డిటెక్టివా? మనం వెళ్ళే దోవలోనే రమణ మూర్తి అనే ప్రైవేట్ డిటెక్టివ్ ఉన్నాడు. మంచిపేరు గలవాడు గూడాను! అక్కడికే వెడదాం!"

డ్రైవర్ కారు వేగాన్ని హెచ్చించాడు.

పదినిముషాల తర్వాత ఒక బిల్డింగ్‌ముందు కారాపాడు. వీధి లైట్ల వెలుగులో అనేక దుకాణాల మధ్య "రమణ మూర్తి ప్రైవేట్ డిటెక్టివ్!" అని బోర్డు కనిపిస్తోంది.

2

భయంతో ఆ యువతి ఇంకా వణికిపోతోంది. మొహం తెల్లగా పాలిపోయింది.

"ఇక ఇప్పుడు చెప్పమ్మా నీ కథ!" డిటెక్టివ్ రమణ మూర్తి లాలనగా అడిగాడు.

"నా పేరు సరోజ. మాది ఇక్కడకు దగ్గరలోనే దామరపల్లె అనే గ్రామం. ప్రస్తుతం నేను నా మేనమామ సంరక్షణలో వున్నాను. మా నాన్న నాకు చాలా ఆస్తిని వదిలిపోయాడు. నన్ను మా బావ లక్ష్మణరావు కిచ్చి పెళ్ళి చేయాలనీ, తద్వారా నా ఆస్తిని అతని అజమాయిషీలోనే వుంచుకోవచ్చనీ మా మేనమామ ఎత్తుగడ! పైగా మా బావకు చదువు తక్కువ!

"అయితే నేను కాలేజీలో చదివేటప్పుడు శేఖర్ అనే యువకుడ్ని ప్రేమించాను. అతడికి ఉద్యోగం దొరకగానే మేమిద్దరం పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకున్నాం. మేం విడిపోయి రెండు సంవత్సరాలైనా, మామధ్య రహస్యంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూనే వున్నయ్.

"శేఖర్ తనను ఈ సిటీలో హోటల్ సవేరాలో 66

నెంబరు గదిలో కలుసుకోమని రాశాడు. అతడ్ని కలుసుకు నేందుకే నేను ఇక్కడకు సిటీకి వచ్చాను. అతడి ఉద్యోగ వివరాలు వినేసరికి నాకు మతిపోయింది.

"అతడొక సి.ఐ.డి. అట! ప్రభుత్వ గూఢచారి! ఒక పెద్ద ముఠా రహస్యాలను బలమైన సాక్ష్యాలతో సేకరించు కుని ఢిల్లీ వెడుతున్నట్టుగా చెప్పాడు. ఆ రహస్య పత్రా లను నా దగ్గర ఉంచమని ఇచ్చాడు. ఎవరో తనను వెంటాడుతున్నట్టుగా అనుమానంగా వుందనీ, రెండు రోజుల పాటు నన్నే వాటిని కాపాడమన్నాడు. ఆ తర్వాత నా దగ్గర నుంచి తీసుకుంటానని చెప్పాడు.

"ఆ రహస్య నివేదికను నా హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టు కుని నా గదికి వచ్చేశాను. మళ్ళీ సాయంత్రం శేఖర్ గదికి వెళ్ళి చూద్దును గదా! నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. శేఖర్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అతడు దారుణంగా హత్య చేయబడ్డాడు నేను భయంతో వణికిపోతూ నా గది చేరుకున్నాను.

"శేఖర్‌ని వెంటాడి హత్యచేసిన హంతకులు నా ఉనికినీ కనిపెట్టే వుంటారు గనుక అక్కడనుంచి ఎంత త్వరగా బయట పడితే అంత మంచిదనిపించింది. పోలీసు లకీ హత్య గురించి ఫోన్ చేద్దామనుకున్నాను. అంతలో ఎవరో నన్నే గుచ్చి చూస్తున్నట్టుగా తోచింది.

"అతడు చాల భయంకరంగా వున్నాడు. సూటులో పెద్ద మనిషిలా వున్నాడు పైకి మాత్రం! ఫోన్‌చేసే ప్రసక్తికి స్వస్తిచెప్పి అక్కడనుంచి బయటకు నడిచాను. మలుపు దగ్గరకు చేరానో, లేదో నా వెనుకే ఎవరో పరు గెత్తుకు రావడం కనుపించింది. అంతే! పరుగు లంకించు కున్నాను."

ఆ యువతి తన కథను పూర్తిచేసింది.

"చూడండి మిస్ సరోజ! మీరు నిశ్చయంగా వుండండి! మీ కొచ్చిన భయం లేదు! మీరు చెప్పేదంతా నిజమైతే మీకు నా నుంచి పూర్తి రక్షణ లభించగలదు. మీరు, శేఖర్ దిగిన హోటల్ పేరేమి టన్నారు? శేఖర్ రూమ్ నెంబరు ఎంత?"

"హోటల్ సవేరా! శేఖర్ రూమ్‌నెంబరు అరవయ్ ఆరు."

రమణమూర్తి ఫోన్‌ని దగ్గరకు లాక్కున్నాడు.

"హలో! హోటల్ సవేరా! రూమ్ నెంబర్ 66 కి కనెక్షన్ ఇస్తారా? శేఖర్ అనే వ్యక్తి కావాలి!"

"సారీ సార్ ఆ రూమ్‌లో ఆ పేరుగల వ్యక్తి ఎవరూ లేరు! ఇంత క్రితం రాజు అనే ఆయన దిగాడు. ఆయన ఖాళీ చేసి పోగా, ఎవరో దంపతులు దిగారు అందులోకి."

రమణమూర్తి ఫోన్ పెట్టేశాడు. మిస్ సరోజ వంక అనుమానంగా చూశాడు.

"నా మాట నమ్మండి! నేను చెప్పేది నిజం!" సరోజ ప్రాధేయపడింది.

"అందుకు నిరూపణ కావాలి గదా?"

"బహుశా శేఖర్ మారుపేరుతో దిగివుండవచ్చునేమో! అసలే సి.ఐ.డి.గదా? తన అసలుపేరు బయటపెట్టడం యిష్టపడకపోవచ్చు!" సరోజ సంశయాన్ని వెలిబుచ్చింది.

"ఓహో! అదీ సంభవమే! ఇంతకీ అతడిచ్చిన కాగితాలు నీ దగ్గరే వున్నాయా?"

"అవునండీ! నా హ్యాండ్‌బ్యాగ్‌లోనే వున్నాయ్" అంటూ సరోజ ఒక కవర్ని అందించింది.

రమణమూర్తి కవర్లో కాగితాల్ని విప్పిచూశాడు. అతడి

కనుబొమలు ముడిపడినయ్.

అవి నిజంగా ఎంతో అపురూపమైన సాక్ష్యాధారాలు. అవి ప్రభుత్వానికి అందితే ఒక రహస్య ముఠా పని మూడి నట్టే. అవి ఎంత త్వరగా చేరవలసిన వారికి చేరితే అంత మంచిది. లేకపోతే క్షణక్షణానికి హంతకులు వాటిని చేజిక్కించుకునేందుకు యత్నిస్తుంటారు.

"కాగితాల్ని నేను భద్రంచేస్తాను. వాటిని ప్రభుత్వానికి అందజేయాలి తెల్లారేసరికల్లా!" అని రమణమూర్తి రహస్య పత్రాన్ని తన డ్రాయర్లో వుంచాడు. డ్రాయర్‌కి భద్రంగా తాళం వేశాడు.

"నీవు మా యింటికి వెళ్ళు. నీవు ఎవరో, యెందుకు వస్తున్నావో నా భార్యకు చీటీ రాసి నీ చేతికిస్తాను. దాన్ని చూపితే। నీకు నా యింటిలో ఈ రాత్రికి రక్షణ లభిస్తుంది. అక్కడ నీకే భయం వుండదు."

రమణమూర్తి తెల్లకాగితం తీసి దానిమీద భార్యకు చీటీ రాశాడు. వెనుక ప్రక్క తన ఇంటి అడ్రసు గూడా వ్రాపి ఇచ్చాడు.

అంతలో కాలింగ్ బెల్ మ్రోగింది.

"అదుగో! వచ్చింది నా పాలిటి యముడై వుంటాడు." సరోజ వణికిపోయింది.

తలుపుసందులోంచి గూర్ఖా తొంగి చూశాడు.

"ఎవరో ఒకాయన అర్జంటుగా మిమ్మల్ని చూడాలట! అతడి మరదలు మీ దగ్గరకు వచ్చివుండాలంటున్నాడు" గూర్ఖా చెప్పాడు.

"అయితే సందేహంలేదు! ఆ వచ్చింది మా బావే అయి వుంటాడు. నన్ను దాచెయ్యండి యెక్కడన్నా!" సరోజ అరిచింది.

"అలా ఆ గదిలోకి వెళ్ళి తలుపేసుకో! మీ బావకు యేదో చెప్పి పంపేస్తాలే!" రమణమూర్తి గదివంక చూశాడు.

బాణంలా రివ్వున వెళ్ళింది సరోజ ఆ గదిలోకి. తన వెనుకనే తలుపుమూసి లోపల గడియపెట్టుకుంది.

చూసే వాళ్ళకు అనుమానం రాకుండా వుండాలని ఆ గదికి బయట గొళ్ళెం పెట్టి, దానికి తాళంగూడ వేశాడు రమణమూర్తి.

మరుక్షణంలో లోపలకి ప్రవేశించాడు ఆగంతకుడు.

"డిటెక్టివ్ రమణమూర్తి ఎవరిక్కడ? నా మరదలు ఇక్కడకు వచ్చింది. ఆమెను తక్షణం నాకు తిరిగి అప్ప గించండి! లేదా ఆమెను బలవంతంగా లేపుకు వచ్చారని పోలీస్ కేసు పెడతాను" అని అరిచాడు ఆగంతకుడు.

"పోలీస్‌స్టేషన్‌కు దోవ తెలుసా? మిస్టర్! నీవు ఎవరి దగ్గర మాట్లాడుతున్నావో మరోసారి గుర్తుతెచ్చుకుని మరీ మాట్లాడు!"

ఆగంతకుడు రమణమూర్తి వంక ఎగాదిగా చూశాడు. ఆగంతకుడు అలసటతో, ఆయాసంతో రొప్పుతున్నాడు. మనిషి చాలా ఆదుర్దాగా వున్నాడు.

"నీవు ఎంత గుండెలు తీసిన డిటెక్టివ్‌వి అయినా ఈ లక్ష్మణరావు నుంచి నా మరదలు సరోజను దూరం చేయ లేవు! ఎక్కడ దాచావు ఆమెను? వెంటనే తిరిగి నాకు అప్పగించండి! ఆమెను యిక్కడ దింపినట్టు, ఆమెను తీసుకొచ్చిన టాక్సీడ్రైవర్ చెప్పాడు."

"మిస్టర్ లక్ష్మణరావు! నా ఇంట్లోకి బలవంతంగా దౌర్జన్యంచేసి ప్రవేశించావని నిన్ను లాకప్‌లో తోయించ గలను" అంటూ ఫోన్ దగ్గరకు నడిచాడు రమణమూర్తి.

లక్ష్మణరావులో ఈ సారి మార్పు వచ్చింది.

"క్షమించండి! నా మరదలు ఏమయిందోనన్న ఆదుర్దాతో అలా మాటలు దురుసుగా అన్నాను. ఇంతకీ సరోజ ఎక్కడ సార్! ఆమె క్షేమంగా వుందని ఒక్కముక్క చెప్పండి చాలు! నా మనసుకు ఊరట కలుగుతుంది."

"ఆమె నిక్షేపంలా వుంది. నీ నుంచి ఆమెకేం ప్రమాదం లేదని నాకు నమ్మకం కలిగిన క్షణాన ఆమెను నీ కప్ప జెబుతాను."

"నా నుంచి ప్రమాదమా? నే నామెకు కాబోయే భర్తను. ఆమె క్షేమమే నా క్షేమం! మీరిలా మాట్లాడుతున్నారంటే మీకేదో మంచి కథే అల్లిచెప్పిందన్న మాట! ఆమె ఇంట్లోంచి పారిపోయిన ప్రతిసారీ ఏదో కొత్తకథ అల్లుతూనే వుంటుంది?"

"అదంతా నాకు తెలియదు. ఆమె నా దగ్గరకు వచ్చింది. తనను హంతకుల బారినుంచి కాపాడమని కోరింది. ఆమెను కాపాడవలసిన భారం నాది. మీ ఇద్దరి కథలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఇందులో ఏది నిజమో ఏది అబద్ధమో తెల్సుకోవాల్సి ఉంది గదా?"

"నేను చెప్పేది అక్షరాలా నిజం! మీకు కావలసిన సాక్ష్యాధారాల్ని చూపించగలను. మా నాన్నే సరోజకు గార్డియన్. ఇంతకీ సరోజ ఇక్కడే ఉందా! ఆమెను ఇక్కడ్నుంచే పిలవండి! ఆమె గొంతును నేను గుర్తించ గలను."

రమణమూర్తికి చిర్రెత్తుకొచ్చింది. గది తలుపు దగ్గరకు వెళ్ళి తలుపుమీద చిన్నగా తట్టాడు.

"సరోజా! నీకేం భయంలేదు. తలుపు తియ్యి ఒక

సారి!" అనునయంగా పిలిచాడు రమణమూర్తి.

"ఏమిటీ? యింతసేపట్నుంచి పక్క గదిలోనే ఉందా? సరోజా? సరోజా! నేను మీ బావను! లక్ష్మణరావును! నీ వేషాలు కట్టిపెట్టి బయటికి రా!" లక్ష్మణరావు కోపంగా అరిచాడు.

"నీ బెదిరింపులకు ఆమె అసలు బయటకు రాదు. నువ్వు నోరు మూసుకుని కూర్చో!—నీ మొహం చూడటానికి ఆమెకు యిష్టం లేకనే లోపలకు దూరి తలుపేసుకుంది. నీ ప్రేలాపన ఆపకపోతే ఆమె గది అవతల తలుపు తీసుకుని పారిపోయినా పారిపోతుంది గూడా!"

"అరి భగవాన్! ఆమె పారిపోవడమా! ఇంత రాత్రి వేళ ఒంటరిగా వీధినబడితే యింకేమన్నా వుందా? ఆమె తెల్లారేసరికల్లా శవంగా మారుతుంది! ఆడవాళ్ళకు రక్షణ లేని ఈ రోజుల్లో ఆమెకేం ఆపద వాటిల్లుతుందో!" లక్ష్మణరావు వాపోయాడు.

రమణమూర్తి తాళం తీశాడు. గొళ్ళెం తీసి తలుపు తెరిచాడు.

గదిలో సరోజ లేదు. గది అవతలవేపు తలుపు తెరిచి వుంది.

"చూశారా! 'దొంగా, చేయి కొరికేవు సుమా!' అన్నట్టుగా, నీ సలహాను అక్షరాలా పాటించింది నీ క్లయింటు! ఆమె కేదో పెద్ద రక్షణ కల్పిస్తానంటివే!" లక్ష్మణరావు వెటకారంగా అన్నాడు.

"నోరు మూసుకో! యిదంతా నీ వల్లే జరిగింది. నీవు నాతో పాటు పోలీస్ స్టేషన్‌కి రావల్సి వుంటుంది."

"పోలీసేస్టేషన్‌కా! నేను రాను! నీకు దూలగా వుంటే నీవే పో! నా మరదలు ఒంటరిగా చీకటి రాత్రిలో బయటకు

వెళ్ళింది. ఆమెకేం అపకారం జరక్కుండా చూసుకోవాలి సిన బాధ్యత నామీద వుంది, ఆమెకేదైనా అకాల మరణం సంభవించిందో ఆమె ఆస్తి అంతా అనాధ శరణాలయానికి చెందుతుంది!"

లక్ష్మణరావు సుడిగాలిలా బయటకు దూసుకు పోయాడు.

3

చీకటి గదిలో బిక్కు బిక్కు మంటూ నిలపడింది సరోజ. లక్ష్మణరావు అక్కడకు వచ్చాడన్న విషయం తల్చుకుంటేనే ఆమెకు వెన్నులోంచి భయం ఊరుకు వస్తోంది.

మళ్ళీ అంతలోనే ధైర్యం తెచ్చుకుంది. రమణమూర్తి తనను లక్ష్మణరావు కబంధ హస్తాలనుంచి రక్షించగలడనే నమ్మకం కలిగింది తనలో! కానీ తన కథను అతడు నమ్మాడా, లేదా అన్నదే అనుమానంగా వుంది.

తను చెప్పిందాన్ని అతడు నమ్మకపోతేనో? తనను తీసుకువెళ్ళి పోలీసులకు అప్పజెబుతాడా? అప్పుడు తన బావ స్టేషన్‌కి వచ్చి తనను విడిపించుకు వెడతాడు. ఇక ఈసారి తనకు స్వేచ్ఛ నివ్వడు. కాళ్ళూ చేతులూ కట్టేసి తనను పెళ్ళాడుతాడు.

తనమీద ప్రేమతో కాదు. తన పేరిట వున్న లక్షల ఆస్తికోసం! తన తండ్రి అంత ఆస్తి వదలకుండా వుండి వుంటే, తమ పెళ్ళి అయిపోయి వుండేది. తను ఎంతటి దురదృష్టవంతురాలు!

గది బయటనుంచి అరుపులు వినవచ్చినయ్. సరోజ చెవిని తలుపుకు ఆనించి మరీ ఆలకించింది. తన బావ పెద్ద గొంతుతో అరుస్తున్నాడు. కొంపదీసి అతడు రమణ

మూర్తిని చితగ్గొట్టలేదు గదా!

అదే జరిగితే తనకు గత్యంతరం ఏమిటి? ఆమె కళ్ళు ఎదురుగా మరో తలుపుమీద పడ్డాయ్.

అంతలో యెవరో బయట తలుపు తట్టారు. విలుకాడి నుంచి విసిరివేయబడిన బాణంలా ఆమె రెండో తలుపుని సమీపించింది.

ఎక్కడకు పోవాలో, ఎలా పోవాలో గూడా ఆలోచన, అంచనా లేకుండా, సరోజ బయటకు పరుగెత్తింది. మెట్లు గబ గబ దిగి రోడ్డుమీదకు వచ్చింది.

పరుగు దీయటం ఆపింది. అయినా పరుగులాటి నడకతో ఆమె డిటెక్టివ్ రమణమూర్తి ఆఫీసుకి దూరం కాసాగింది.

మధ్య మధ్యలో వెనుదిరిగి చూస్తోంది, తనను ఎవరైనా వెంబడిస్తున్నారేమో అని.

కొంచెం దూరం వెళ్ళేసరికి టాక్సీ కనుపించింది.

టాక్సీని ఆపి, అందులోకి ఎక్కింది సరోజ.

"రైల్వేస్టేషన్‌కి పోనీయ్!" అంది డ్రైవర్‌తో.

టాక్సీ ముందుకు సాగిపోయింది. అయినా సరోజ వెనక్కు వెనక్కు చూస్తునే వుంది, తనను యింకా ఎవరైనా వెంటాడుతున్నారేమో అని!

రైల్వే స్టేషన్‌దగ్గిర టాక్సీకి బాడుగ చెల్లించి, లోపలకు ప్రవేశించింది సరోజ.

స్టేషన్ నిండా జనం. లైట్లతో పట్టపగలులా వెలిగిపోతోంది రైల్వేస్టేషన్. అదీగాక దూరాభారం వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైళ్ళన్నీ రాత్రిపూటే బయలుదేరతాయ్. అందువల్ల కూడా రద్దీగా వున్నారు రైల్వేస్టేషన్‌లో జనం!

లేడీస్ వెయిటింగ్ రూంలో కూర్చుంది సరోజ.

అప్పుడుగానీ ఆమెకు తృప్తిగా గాలి పీల్చుకునేటందుకు సమయం చిక్కలేదు. తనను ఎవరూ గుర్తించకుండా వుండాలని న్యూస్‌పేపరు తీసి ముఖానికి అడ్డం పెట్టుకుంది, పేపర్ చదివేదానిలా.

శేఖర్‌ని పట్టుపెట్టిన హంతకులు, అతడివద్ద తమకు కావలసిన రహస్యపత్రాలు దొరక్కపోయేసరికి, తనపైనే అనుమాన పడతారు తప్పకుండా.

అ హంతకులెవరో తను గమనించి వుండకపోవచ్చు. కానీ వాళ్ళు తనను బాగా గుర్తుపెట్టుకుని వుంటారు. కనుక తను మళ్ళీ రమణమూర్తిని కలుసుకోవాలి వీలయినంత త్వరలో. కొద్దిరోజులపాటు తన నెక్కడన్నా రహస్యంగా దాచమని కోరాలి అతడ్ని!

ఆలోచనలోవున్న సరోజ త్రుళ్ళిపడింది. అందుకు కారణం ఎవరిదో చెయ్యి ఆమె భుజంమీద పడింది. త్రాచు పాము స్పర్శలా వణికిపోయింది ఆమె ఆ మాత్రానికే. పేపరులోంచి తలత్రిప్పి ఆ చేయివంక చూసింది.

ఆ చేయి తన బావది కాదు. అసలు పురుషస్పర్శ కానే కాదు! ఆమె ఒక స్త్రీ! తన ముఖంలోకి చూసి చిరునవ్వు నవ్వింది.

సరోజ సర్దుకుంది. ఆమె భయం తగ్గింది. అప్పుడు గానీ ఆ స్త్రీని ఆమె గుర్తుపట్టలేదు. ఆమెపేరు సుమతి అని చెప్పినట్టుగా గుర్తు. తనుండే హోటల్లోనే పై అంతస్థులో వుంటుంది.

"ఓ మీరా!" అంది సరోజ పలకరింపుగా.

"అవును నేనే! మీరు వూరెళ్ళుతున్నారా?" అడిగింది ఆమె.

సరోజ చిరునవ్వు నవ్వింది.

కాసేపు మాట్లాడాక "అలావెళ్ళి టీ త్రాగి వద్దాం క్యాంటీన్‌లో!" ఆమె చొరవగా అంది.

సరోజ కాదనలేకపోయింది. ఆమెవెంట క్యాంటీన్‌కి దారితీసింది.

టీ అందించేటప్పుడు ఆమె ఏదో పొడిని టీ కప్పులో జారవిడవడాన్ని సరోజ కనిపెట్టలేకపోయింది. ఆమెకళ్ళు చుట్టూరా కలయచూస్తున్నాయి. తనపాలిటి కాలయముడయిన 'వాడు' ఏ క్షణాన ఊడతాడో అని ఆమె భయం.

ఇద్దరూ టీ సేవించారు. తిరిగి వచ్చి వెయిటింగ్ రూమ్‌లో కూలబడ్డారు.

"ఇంకో అరగంటలో రాజధాని ఎక్స్‌ప్రెస్ రావాల్సి వుంది. అందులో నా ఫ్రెండ్ ఒకామె వస్తోంది. ఆమెను రిసీవ్ చేసుకోవాలని వచ్చాను స్టేషన్‌కు" అంది ఆమె.

సరోజ కళ్ళు మత్తుగా మూసుకుపోతున్నాయ్. నిద్ర ముంచుకు వచ్చినదానిలా తల ప్రక్కకువాల్చి, పడక కుర్చీలోనే వాలిపోయింది.

ఆమె చిరునవ్వు నవ్వింది. సరోజ హ్యాండ్‌బ్యాగ్‌ని తీసుకుంది. దాన్ని శోధించింది. ఆమెకు కావాల్సింది లేదు అందులో. అందులోంచి చిన్నలెటర్‌ని ఆత్రంగా తీసింది. దాన్ని తన హ్యాండ్‌బ్యాగ్‌లో భద్రపరుచుకుంది.

ఆ తర్వాత గబగబా అడుగులేస్తూ అక్కడ్నుంచి మాయమయింది.

4

హోటల్ సవేరాలోకి అడుగుపెట్టాడు లక్ష్మణరావు. లాబీలోనూ, లాన్‌లోనూ తీరుబడిగా కాఫీ సేవిస్తూన్నవారి నందర్నీ పరీక్షగా చూశాడు. వారిలో సరోజ కనుపించలేదు.

అంటే ఇంకా ఇక్కడకు చేరుకోలేదన్నమాట! ఇంత రాత్రివేళ ఎక్కడ తిరుగుతున్నదో ఒంటరిగా!

ఈ రాత్రే ఆమె పాలిటి కాళరాత్రిగా మారదుగదా? స్త్రీలు ఒంటరిగా నిశిరాత్రివేళ తిరిగే రోజులు కావు ఇవి! అటు దుర్మార్గులూ, రౌడీలచేత బడినా, ఇటు పోలీసుల దృష్టి నాకర్షించినా, ఆమె మాన ప్రాణాలు దక్కవనేవి ఖాయం!

అయినా సరోజ ఇలా బరితెగించి ఒంటరిగా రావటం ఇది మొదటిసారికాదు. లోగడ తనూ, తన తండ్రి చాలా సార్లు కోప్పడ్డారు, వార్నింగ్ లిచ్చారు. కానీ సరోజ మారలేదు. తమకన్ను గప్పి తన ప్రియుడికోసం వస్తున్నది. వాడ్ని పెళ్ళిచేసుకొని యావదాస్తి స్వాధీనం చేసుకుని, కులుకుదా మనుకుంటున్నది కాబోలు!

ఈసారి ఉపేక్షించేది లేదు. ఆమె కిదే ఆఖరిసారి. ఇంటికి లాక్కెళ్ళి దాని మెడలో తాళి కట్టేదాకా, నాలుగు గోడల మధ్యనుంచీ బయటకు రానీయరాదు.

రిసెప్షన్‌లోకి నడిచాడు లక్ష్మణరావు?

"ఏమండీ! సరోజ అనే యువతి ఈ హోటల్లో గది తీసుకుంది కదూ?" అని అడిగాడు.

"అవునండీ! కానీ ప్రస్తుతం ఆమె గదిలో లేదు" రిసెప్షన్‌లో యువతి బదులిచ్చిగది.

"పోనీ ఎప్పుడు వస్తుందో చెప్పగలరా? నేను ఆమె బావను? నన్నిక్కడకు వచ్చి కలుసుకోమని మరీ కబురు పెట్టింది."

"తెలీదండి!"

"ఆమె వచ్చేదాకా నేనామె గదిలో నిరీక్షించవచ్చునా?"

"లాభం లేదండి! మా రూల్స్ అందుకు అనుమతిం

చవు. ఆమె వచ్చేదాకా మీరు లాబీలో వేచి వుండా ల్సిందే!"

"చూడు మిస్! అలాగే ఆగుతాను కానీ, నాకు చిన్న సమాచారం కావాలి? ఆమె ఇక్కడ హోటల్లో యెవరి నన్నా కలుసుకోను వచ్చిందా? అతడెలా వుంటాడు?"

"మా అతిథుల రహస్యాలు ఎవరికీ వెల్లడించం!" ఆ యువతి మర్యాదగా నిరాకరించింది.

లక్ష్మణరావు నిట్టూర్పు విడిచాడు. "సరే! నేను అలా ఊళ్లోకి వెళ్ళివస్తాను. ఈలోగా సరోజ గనుక వస్తే వుండ మని చెప్పండి. నేను త్వరలోనే వస్తాను మళ్ళీ!" అంటూ అక్కడనుంచి కదిలాడు.

5

డిటెక్టివ్ రమణమూర్తి అసహనంగా వీధిలోకి చూశాడు. సరోజ యెక్కడ తిరుగుతున్నదో, యెలాంటి ప్రమాదాల్లో యిరుక్కోబోతున్నదో అని ఆదుర్దా పడు తున్నాడు.

ఇంటికి ఫోన్ చేశాడు. సరోజ అక్కడకు కూడా వెళ్ళ లేదు.

కారు స్టార్టు చేశాడు రమణమూర్తి. రోడ్ల వెంట సరోజ కోసం అతడి కళ్ళు వెదుకుతూనే ఉన్నాయ్. పోలీస్‌స్టేషన్ దగ్గర ఆగాడు అతడు.

స్టేషన్లో ఇన్‌స్పెక్టర్ రాఘవ తీరిగ్గా కూర్చుని సిగరెట్లు తగలేస్తున్నాడు. ప్రక్కనే హెడ్‌కానిస్టేబులు గురవయ్య నిలబడి ఏదో సోది చెబుతున్నాడు.

"డిటెక్టివ్‌లకి పోలీసులతో పనిబడిందే? దొంగతనమా? మర్డరా?" ఇన్‌స్పెక్టర్ రాఘవ పెద్దగా నవ్వుతూ అడిగాడు, రమణమూర్తిని చూస్తూనే.

"అలాంటివేమీ కాదులే ఉలికి పడకండి!" రమణ మూర్తి కుర్చీలో కూర్చుంటూ అభయమిచ్చాడు.

"ఈ వేళ ఎక్కడన్నా మర్డర్ కేసు రిపోర్టు వచ్చిందా?"

"లేదు! ఏం? ఎవరైనా హంతకుడు ఎదురైనాడా, రక్తపు దుస్తులతో, నెత్తురులో తడిపిన కత్తితో!" రాఘవ మరోసారి నవ్వాడు.

"మీ పోలీసులు ఇంత చాకచక్యంతో వ్యవహరిస్తుంటే కత్తిని అందునా రక్తంలో తడిపిన కత్తిని బాహాటంగా పట్టుకుని తిరగటానికి దమ్ములేనా?" రమణమూర్తి పోలీసు డిపార్టుమెంటుకి అభినందన పారేశాడు.

అతడి ముఖస్తుతికి ఇన్స్పెక్టర్ రాఘవ ఛాతీ రెండంగుళాలు ఉబికింది.

"హోటల్ సవేరా నుంచి ఏవైనా కంప్లైయింట్స్ వచ్చాయా?" మళ్ళీ అడిగాడు రమణమూర్తి.

"ఈ క్రాస్ ఎగ్జామినేషన్ అంతా ఎందుకంట? అసలు సంగతేమిటో బయటపెట్టరాదూ?"

రమణమూర్తి తన దగ్గరకు సరోజ ఎలాంటి పరిస్థితుల్లో వచ్చిందో, యెలా బయటకు జారుకుందో వివరించాడు. రహస్య పత్రాల గురించి, సరోజ ప్రియుడు సి.ఐ.డి. అన్న విషయం మాత్రం చెప్పలేదు.

అంతా విని ఇన్స్పెక్టర్ రాఘవ తల నిమురుకున్నాడు. "నువ్వు చూపిన సరోజ మతి స్థిమితం కోల్పోలేదు గదా? లేక త్రాగిన మైకంలో కథలల్లుతోందా?"

"లేదు! ఆమె చెప్పేది నిజమే అనిపిస్తోంది."

"ఏమిటి నిజం? సొంత బావను చూస్తే పారిపోయే యువతి, ఆడపిల్లను ఇంటిదగ్గరే జాగ్రత్తపరచలేని బావ

బయటకు రాని శవం! ఇవన్నీ డిటెక్టివ్ సినిమా నవలకు పనికొస్తయ్."

రమణమూర్తి ముఖం అదోలా పెట్టాడు.

"ఆల్‌రైట్! మా కానిస్టేబుల్స్ ఇద్దరు బీటుమీదకు పోతున్నారు. ఆ యువతి, ఆమె బావ గుర్తులు చెప్పి పంపుతాను. వాళ్ళెక్కడన్నా తారసపడితే, మారు మాట లేకుండా, స్టేషన్‌కి లాక్కురమ్మంటాను సరా!"

6

హోటల్ సవేరా వెనుక పెద్ద చెరువు వుంది. ఆ చెఱువుకి అవతల ప్రక్క పెద్ద పార్కు వుంది. పార్కులో చెఱువు గట్టుకి రెండు మూడు పడవలు కట్టేసి వున్నయ్. ఆ పార్కులో రాత్రిళ్ళు రహస్య ప్రేమికులు కలుసుకుంటారు.

ఒక మూలగా చెఱువు గట్టుకు కొద్ది దూరంలో పొద చాటున ఒక యువజంట క్రీనీడలో కూర్చుని వున్నారు.

"ఎంత తీయటి మాట చెప్పావ్ డార్లింగ్!" అంటూ ఆమెను గట్టిగా అదుముకుని ముద్దు పెట్టుకున్నాడు అతడు.

ఆ యువతి కిలకిల నవ్వింది.

"ఈ రాత్రి ఎంత బాగుంది? ఇంకొంచెం వెన్నెల వస్తే, చెరువులో పడవ షికారు చాలా హాయిగా వుండదూ?"

"పడవ షికారుకోసం మోజు పడుతున్నావల్లే వుంది! పోనీ అలా వెళ్ళి, ఒడ్డుకు కట్టేసి వున్న పడవలో కూర్చుందాం కాసేపు!"

ఇద్దరూ గుసగుసలాడుకున్నారు.

"దీనికి తెరచాప వుంటే ఎంత బాగుండును?" ఆమె అంది.

7

రమణమూర్తి భార్య రూప బద్ధకంగా ఆవులించింది. గడియారం వంక చూసింది. రాత్రి పదిగంటలయింది.

బల్లమీద మూసి వుంచిన నవలను తెరిచింది మళ్ళీ.

రూప ఉలిక్కిపడింది. కాలింగ్‌బెల్ మ్రోగుతోంది. అమ్మయ్య! ఆవిడెవరో వచ్చింది! తను అట్టేసేపు కాచుకు కూర్చోకుండా!

లేచి వెళ్ళి తలుపు తెరిచింది. ఎదురుగా ఒక స్త్రీ గుమ్మంలో నిల్చుంది.

"రమణమూర్తి భార్య మీరేగదూ? మీకో ప్రేమలేఖ తెచ్చాను" అంటూ కిలకిల నవ్వింది ఆమె.

"మిస్ సరోజకదూ మీరు? మీ గురించే వారు ఇప్పటికి రెండుసార్లు ఫోన్ చేశారుగూడా."

"అర్ధరాత్రివేళ మీకు చాల ఇబ్బంది కలిగిస్తున్నాను" లోపలకు వస్తూ ఆమె నొచ్చుకుంది.

"ఇదుగోండి! మీవారు రాసిచ్చిన చీటీ!" అంటూ హ్యాండ్ బ్యాగ్‌లోంచి చీటీ తీసి అందించింది ఆమె.

రమణమూర్తి భార్య రూప చీటీ అందుకుని, దాన్ని చదివింది ఆసక్తిగా, తర్వాత దాన్ని తీసి బల్లమీద పెట్టింది.

"అలా కూర్చోండి! ఫ్లాస్కులో కాఫీ వుంది! త్రాగుదాం!" అంటూ రూప ఆమెకు సోఫా చూపెట్టింది. ఫ్లాస్కు వంచి కాఫీ రెండు కప్పుల్లో పోసింది. ఒక కప్పు తను తీసుకుని, రెండో దాన్ని ఆమెకు అందించింది.

"మీవారు నా గురించి ఫోన్‌లో ఇంకా ఏం చెప్పారు?" ఆమె నవ్వుతూ అడిగింది.

"ఎవరో దుర్మార్గుడు మిమ్మల్ని తరుముతున్నాడని

చెప్పారు. అతడు మిమ్మల్ని హత్యచేసేందుకైనా వెనుకాడడని హెచ్చరించారు గూడా?"

"అవునవును! నేను నిజంగానే అంత ప్రమాదంలో వున్నాను" అంది ఆమె కళ్ళు టప, టప లాడిస్తూ.

"ఈ కప్పు క్రింద మీ చింతలన్నీ మరిచి నిద్రపొండి. తెల్లారాక మా వారు అన్నీ చక్కబరుస్తారు."

"అంటే మీవారు ఈ రాత్రికి తిరిగి రారా?" ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"ఆ హంతకుడ్ని దొరకబుచ్చుకుని, లోపల వేయించందే ఇల్లు చేరరనుకుంటాను" రూప ఖండితంగా చెప్పింది.

"ఆఁ! మరిచాను! మీరు రాగానే ఫోన్ చేయమని చెప్పారు!" అంటూ రూప కూర్చున్న చోటునుంచి లేచి ఫోన్ దగ్గరకు వెళ్ళింది.

నెంబర్ డయిల్ చేసింది, రిసివరెత్తి!

8

రమణమూర్తి, ఇన్స్పెక్టర్ రాఘవ మాట్లాడుతున్నారు పిచ్చాపాటీ!

టెలిఫోన్ పెట్టేసి, కానిస్టేబుల్ పరుగెత్తుకొచ్చాడు.

"సార్! తన పేరు వెల్లడించని వ్యక్తి ఎవరో, పబ్లిక్ టెలిఫోన్ బూత్‌నుంచి ఫోను చేశాడు, హోటల్ సవేరా వెనుక చెరువులో శవం తేలుతోందట!"

"మైగాడ్! సరోజ కథనం ఋజువుకు వస్తోంది. హతుడు ఆమె ప్రియుడు శేఖర్ అయి వుండాలి. అతడ్ని ఆ హోటల్లోనే ఎవరో హత్యచేశారు. శవాన్ని చెరువులోకి చేర్చారు. జలచరాలు అతడి ముఖాన్ని తినేస్తే, అతడ్ని గుర్తించడం కష్టం! రాఘవ్! త్వరపడాలి!"

పాఠం అప్పజెప్పినట్టు గడగడ చెప్పసాగాడు డిటెక్టివ్ రమణమూర్తి.

కారులోనూ, జీపులోనూ పోలీసులు బయలుదేరారు. పార్కులోని శవాన్ని చూశాడు రమణమూర్తి. సరోజ చెప్పిన వర్ణననుబట్టి శేఖర్ ఇతడే అయివుండాలి. అతి రహస్యమైన సమాచారాన్ని సేకరించి, ప్రభుత్వానికి అంద జేసే లోపలే అతడు దుర్మార్గుల చేతిలో బలి అయి పోయాడు.

అంబులెన్స్‌లో శవాన్ని మార్చ్యురీకి తరలించారు. అతడు హత్య చేయబడ్డాకనే నీళ్ళలోకి నెట్టివేయబడ్డాడని డాక్టర్ తెలిపాడు.

రమణమూర్తి తల నిమురుకున్నాడు.

"మిష్టర్ రాఘవ! ఇతనో సి.ఐ.డి. ఉద్యోగి! కొన్ని రహస్యపత్రాలతో తిరిగి తన స్వస్థలానికి పయనంలో మజిలీ వేశాడు హోటల్ సవేరాలో! సరోజ అతడి ప్రియు రాలు. తను ఒక పెద్ద రాచకార్యం మీద వెడుతున్నాననీ, ఆ పని పూర్తికాగానే తిరిగి వచ్చి ఆమెను పెళ్ళాడుతాననీ హామీ ఇచ్చాడట."

"గుడ్‌గాడ్! దీని వెనుక ఇంత కథ ఉందా? ఆ విషయం ముందే చెప్పివుంటే, అతడికి రక్షణ కల్పించే వాళ్ళం కదా? ఎంతపని చేశావ్?"

"అతడి విషయం సరోజ వల్లనే తెలిసింది. తను చాల ప్రమాదంలో వున్నాననీ, తనకేదైనా ఆపద సంభవిస్తే, కొన్ని కాగితాల్ని ఢిల్లీలోని హెడ్ క్వార్టర్స్‌కి అందజేయ మని చెప్పి, రహస్య పత్రాల్ని సరోజకు ఇచ్చాడట!"

"అంటే సరోజ ఎక్కడుందో తక్షణం వెదికి పట్టుకో వాల్సిన అవసరం ఎంతైనా వుంది! ఆ కాగితాలు ఆమెకు

ప్రమాదాన్ని తెచ్చిపెట్టగలవు" ఇన్‌స్పెక్టర్ రాఘవ హడా వుడిపడ్డాడు.

"సరోజ గురించి ఆదుర్దా పడవలసిన అవసరంలేదు. అసలు శేఖర్ ఉనికిని హంతకులు కనిపెట్టి అతడ్ని హత్య చేయటం, ఇటు సరోజవెంట ఆగంతకుడు దాడి చేయటం యాదృచ్ఛికంగా జరిగివుంటాయని నా ఊహ!" రమణ మూర్తి ఆదుర్దాగా అన్నాడు.

"నీ ఊహలు కట్టిపెట్టవయ్యా డిటెక్టివ్! ముందా సరోజ కోసం గాలించాలి! ఆమె ఆయువు క్షణాల్లోనే వుండి వుండవచ్చు."

"సరోజకోసం మీరు ఆదుర్దాపడనక్కర్లేదు. ఆమెకు నా యింటి అడ్రసు రాసిచ్చాను. నా భార్యకిమ్మని చీటీ గూడా రాశాను ఆమెకు ఆతిథ్యం ఇమ్మని! ఈ పాటికి ఆమె నా ఇల్లు చేరుకుని వుంటుందేమో!"

"అయితే ఆలశ్యం దేనికి! వెంటనే మీ ఆవిడకు రింగప్ చేసి, సరోజ వచ్చిందో, రాలేదో తేల్చుకో!" అంటూ ఇన్‌స్పెక్టర్ రాఘవ రిసీవర్ని అందించాడు.

రమణమూర్తి ఇంటికి ఫోన్‌చేశాడు.

"హల్లో రూపా! రూపా?"

"ఓ! మీరేనా? ఏవండీ నిద్రపోలేదా మీరు! ఇంకా మెలకువగానే కూర్చున్నారా?" అవతల నుంచి రమణ మూర్తి భార్య రూప అడిగింది.

"కంటిమీదకు కునుకు ఎలా వస్తుంది డార్లింగ్! ఇంతకీ సరోజ వచ్చిందా మనింటికి?"

"సరోజ! ఓహ్! సరోజ గురించి కదూ మీరడుగుతూంట! అమె వచ్చిందండి! మళ్ళీ అంతలోనే, నన్ను ఏమార్చి చెప్పా చెయ్యకుండా వెళ్ళిపోయింది!"

"నీకేమైనా బుద్ధి వుందా? ఆమెను మనింట్లోనే వుంచమని చెప్పాను గదా! ఎలా పోనిచ్చావ్?" కోపంగా అరిచాడు, రమణమూర్తి.

"ఆమెను విశ్రాంతి తీసుకోనిమ్మని చెప్పారు. అంతే కానీ, ఇలా పారిపోతుందని తెలిస్తే ముందరే, ఆమెను గదిలో పెట్టి తాళంవేసి వుండేదాన్ని!" రూప సంజాయిషీ చెప్పుకుంది.

"ఎంతసేపయింది ఆమె వెళ్ళి! ఎక్కడికెడుతున్నదీ చెప్పిందా?"

"ఇంత క్రితమే వెళ్ళింది. ఎక్కడికెళ్ళేదీ చెప్ప లేదు."

"అఘోరించలేకపోయావు!" కోపంతో, అసహనం చిరాకుతో ఫోన్ పెట్టేశాడు రమణమూర్తి.

"ఆమె మళ్ళీ మా ఇంటినుంచి గూడ పారిపోయిందిట ఇన్‌స్పెక్టర్! ఎక్కడ కెళ్ళిందో? ఎందుకెళ్ళిందో!" తల పట్టుకున్నాడు.

9

రూప ఫోన్ పెట్టేసింది. భర్త మాటల్లోని ఆవేదననూ ఉద్వేగాన్నీ ఆమె స్పష్టంగా కనిపెట్టింది.

కానీ ఆమె అసహాయురాలు. చుట్టమై వచ్చి దయ్యమై పట్టిందని సామెత. అతిథిగా అర్ధరాత్రివేళ వచ్చిన స్త్రీ తన పాలిట పిశాచమై కూర్చుంది.

ఫోన్ మ్రోగంగానే, ఆగంతకురాలు తన హ్యాండ్ బ్యాగ్‌లోంచి పిస్తోలు తీసింది. భర్తతో ఎలా మాట్లాడాలో ఏం చెప్పాలో వివరించింది. అంతకు మించి మరొక్క అక్షరం పొల్లుపోయినా, ఆమె తలలోకి పిస్తోలు గుండ్లు దిగబడతాయని హెచ్చరించింది.

అలాగే ఆమె ఆజ్ఞలకు లోబడి, భర్తతో ఆమె చెప్ప మన్నట్టుగానే చెప్పింది రూప.

"గుడ్! మంచి పిల్లవనిపించుకున్నావ్!" హేళనగా అంది ఆవిడ.

రూప ఒక ప్రక్కగా కూర్చుంది. తన ఇంట్లోనే తను బందీ అయింది.

ఆగంతకురాలు ఫోన్ ఎత్తి ఎవరికో డయల్‌చేసింది.

"నేను ఫలానా నెంబరునుంచి ఫోన్ చేస్తున్నాను. మా అన్నయ్య హోటల్ సవేరాకు వస్తే, నీ చెల్లెలు ఫోన్ చెయ్యమన్నదని చెప్పండి! నేనెక్కడున్నదీ అడ్రసు చెప్తాను రాసుకోండి! తక్షణమే జాగుచేయకుండా ఇక్కడకు రమ్మని చెప్పండి!"

"కొద్దిసేపట్లో మా మనిషి వస్తున్నాడు. అతడు వచ్చే లోపల చెప్పు! సరోజ దగ్గర్నుంచి తీసుకున్న రహస్య పత్రాల్ని మీ ఆయన ఎక్కడ దాచాడో వెదికి తీయ్! మీ ఆయన దాచిన స్థలం నీకు తెలియకుండా వుండదు! మా మనిషి చాలా దుర్మార్గుడు. ఆడవాళ్ళని హింస పెట్టడంలో యముడ్ని మించి పోతాడు" ఆమె బెదిరించింది మళ్ళీ.

"నిజంగానే నాకు తెలియదు. ఆయన వ్యాపకాలేవీ నాకు నచ్చవ్! అందుకే ఆయన వృత్తి గొడవల్లో నేను తలదూర్చను" రూప గద్గద కంఠంతో చెప్పింది.

అయినా ఆమె మాటలు ఆగంతకురాలికి తృప్తి కలిగించ లేదు.

రూప ఒక డిటెక్టివ్ భార్య అన్నమాటే గానీ, అతడి తెలివి తేటల్ని నూరోవంతు అలవర్చుకోలేదు. మరొక రయితే ఆ సమయంలో ఆగంతకురాలి నుంచి ఎలా తప్పించుకోవాలో ఆలోచించేవారే! కనీసం అందుకు

యత్నంగూడ చెయ్యలేదు ఆమె.

పైపెచ్చు అర్ధరాత్రివేళ ఈ పిచ్చిదాన్ని ఇంటిమీదకు తోలి ఆయన ఊరంతా చెడ తిరుగుతున్నందుకు ఆమె భర్తను తిట్టుకుంది గూడా!'

ఆగంతకురాలు టెలిఫోన్ వున్న టేబుల్ ప్రక్కనే, కుర్చీ వేసింది. రూపను అందులో కూర్చోబెట్టింది. ఆమె కాళ్ళను కుర్చీ ముందు కాళ్ళకు తాడుతో బంధించింది. కుడిచేతిని కుర్చీ ఒక చేతికి కట్టేసింది.

"ఫోన్ వస్తే అందుకోను వీలుగా ఎడమచేతిని మాత్రం వదిలేశాను. మళ్ళీ ఫోన్ వస్తే గొంతు సవరించుకో! ఏ మాత్రం తొట్రుపాటు లేకుండా మాట్లాడు సరేనా?"

రూప గుడ్లనీరు కుక్కుకుంది. తను ఈ తరుణంలో తిరగబడినా లాభం లేదు. రమణమూర్తి వస్తాడు తప్పకుండా! అతడు ఎంత త్వరగా వస్తే అంత బాగుండును.

సరోజ మళ్ళీ పారిపోయిందని విని ఆయనకు ఎంత కోపం వచ్చిందని? నిజానికి ఆ చీటీ తెచ్చిన సరోజ తన ప్రక్కనేవుందని, ఆమె ఒత్తిడిపైనే, బెదిరింపువల్లనే తను అలా అబద్ధంచెపుతున్నానని అతడికెలా తెలియజెప్పగలదు?

అతడు త్వరగా వస్తే బాగుండును, ఈమె తాలూకు మనిషి రాకముందే! ఒకవేళ భర్త తెల్లారేదాకా రాకపోతే తన గతి ఏమవుతుంది?

మళ్ళీ ఫోన్ వస్తే, ఆగంతకురాలికి అనుమానం కలగకుండా, తను ప్రమాదంలో వున్నట్టుగా అతడికెలా తెలియజెప్పాలా అని తీవ్రంగా ఆలోచించసాగింది ఆమె.

ఆగంతకురాలు ఏదో పుస్తకం తీసి చదువుకోసాగింది. మధ్య మధ్యలో తనవంక క్రీగంట చూస్తోంది నవ్వుతూ.

ఆ నవ్వులో విషాన్ని కక్కుతోంది.

"ఇదంతా నా ఖర్మ! అసలాయన నిన్ను ఇక్కడకు పంపడమేమిటి కాకపోతే!" వెక్కుతూ అంది రూప.

"ఎందుకా? పోలీసులు నా కోసం ఈ పాటికి గాలిస్తుంటారు. వాళ్ళకు దొరక్కుండా తల దాచుకోను వచ్చాను. డిటెక్టివ్ రమణమూర్తి ఇంట్లో హంతకురాలు దాక్కుంటుందని ఎంతటి పోలీసాఫీసరయినా ఎలా ఊహించగలడు.

"నా పేరు సరోజ కాదు! ఆమె రైల్వేస్టేషన్లో శాశ్వత నిద్రలో మునిగిపోయి వుంటుంది ఈ పాటికి! ఆమె బ్యాగ్ లోంచి, నీ భర్త ఇచ్చిన చీటీ సంగ్రహించుకొచ్చాను."

"అంటే సరోజ అనే యువతిని నీవు చంపేశావా?"

"సరోజది రెండో హత్య? మొదటిది ఆమె ప్రియుడు శేఖర్‌ది. ప్రభుత్వ యంత్రాంగంలో సి.ఐ.డి. మా బాస్‌కి సంబంధించిన అక్రమ వ్యాపార రహస్యాలన్నిటినీ సేకరించి తిరుగు ప్రయాణం కట్టాడు. మధ్యలో మజిలీలో అతడ్ని టపాకట్టించాం స్వర్గానికి! లేకపోతే కోట్లకు పడగెత్తే మా బాస్ రహస్యాలు, ప్రభుత్వంలో చిన్న నెల జీతగాడు సేకరిస్తాడా?"

ఆమె కళ్ళు ఆనందంతో మెరుస్తున్నయ్.

10

ఇన్‌స్పెక్టర్ రాఘవ ఫోన్‌లో వచ్చిన వార్త విని హడావిడి చేశాడు.

"రైల్వేస్టేషన్ స్త్రీల వెయిటింగ్ రూమ్‌లో ఎవరో యువతి చచ్చిపడి వున్నదట! ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లో దొరికిన కాగితాల్ని బట్టి ఆమె పేరు సరోజ అని తెలుసుకున్నారట!" రమణమూర్తి వంకచూస్తూ చెప్పాడురాఘవ.

"భగవాన్! సరోజ మరణం! అదే హత్యే అయి

వుండాలి! నలుగురిలో ఆమెను కాల్చి చంపటం, కత్తితో పొడవడం ఇలాంటివి వీలుపడక ఆగంతకుడు ఆమెకేదో విషమిచ్చి వుండాలి!" రమణమూర్తి తనవద్దకు ఆశ్రయం కోసం వచ్చిన యువతి అలా దుర్మరణం పాలవటం గురించి ఆందోళన వ్యక్తం చేశాడు.

రమణమూర్తి మస్తిష్కంలో మెరుపు మెరిసింది.

"ఇన్స్పెక్టర్! హంతకురాలు దొరికింది! క్విక్! మా ఇంట్లోనే ఆశ్రయం పొందింది, సరోజ పేరు చెప్పుకొని! అక్కడయితే ఎవరూ అనుమానించరని! భలే ఎత్తు వేసింది! ఎంత గుండెలు తీసిన బంటు!"

రమణమూర్తి కారు, పోలీసు జీప్ వేగంగా రోడ్డుమీద పరుగెత్తినయ్.

డిటెక్టివ్ ఇంటికి కొంచెం దూరంలో ఆగినయ్. అతడి ఇంటి కిటికీలు తెరిచే వున్నయ్. కానీ లైట్లు వెలగటం లేదు. అదే అతడికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

రూప ఎన్నడూ లైటు లేకుండా వుంచదు. డిమ్మర్ అయినా వెలుగుతూ వుంటుంది, నిద్రపోయేటప్పుడయితే!

అత్యవసర సమయాల్లో ఉపయోగించుకొనేందుకు రమణమూర్తి తన ఇంటికి రహస్యద్వారం వుంచాడు. దాన్ని ఇంతవరకూ అతడు ఉపయోగించాల్సిన అవసరం రాలేదు.

అతడి మనసు ఏదో కీడు శంకిస్తున్నది. జేబులోంచి తాళం చెవి తీసి రహస్య ద్వారాన్ని తెరిచాడు చప్పుడు కాకుండా.

లోపలకు ప్రవేశించిన రమణమూర్తి హాల్లో దృశ్యాన్ని చూసి అదిరిపడ్డాడు. తన భార్య కుర్చీకి కట్టివేయబడివుంది.

ఆమె కెదురుగా కూర్చుని మరో స్త్రీ ఆమెను హింసిస్తున్నది. రూప సన్నని గొంతులో ఏడుస్తున్నది!

"ఏడ్చి లాభంలేదు! ఆ కాగితాలెక్కడ దాచాడో నీ భర్త త్వరగా చెప్పు" ఆమె బలవంతం చేస్తున్నది: ఆ స్త్రీ చేతిలో కత్తి వుంది. దానికి రక్తం గూడా అయివుంది.

సుడిగాలిలా వెళ్ళి పడ్డాడు రమణమూర్తి. బూటు కాలితో ఆమె చేతిలోని కత్తిని తన్నాడు బలంగా. కత్తి ఎగిరిపోయి గోడవారగా పడింది.

లైటు వెలిగింది గదిలో! రమణమూర్తి వెనుకే రాఘవ, ఇతర పోలీసులూ వచ్చారు బిలబిల!

ఆ యువతిని క్షణాల్లో బంధించారు.

"సారీ రూపా! ఆ సరోజ క్షేమం గురించిన ఆతృతలో నీకు రానున్న ప్రమాదాన్ని ఊహించలేకపోయాను" భార్యను ఊరడించాడు రమణమూర్తి.

"పోనీ లెండి! ప్రాణాలు పూర్తిగా పోకముందు వచ్చారు! అంతే చాలు! మీరు ఆశ్రయం ఇవ్వమన్న ఈ యువతి ఎవరో పిచ్చిది లాగుంది. ఇప్పటికే ఇద్దర్ని హత్య చేశానని చెప్పింది. మీరు రావడం ఆలస్యమయితే, నన్ను మూడో శవం క్రింద మార్చేది?"

"ఆమె వెంట ఎవరన్నా వచ్చారా? లేక ఆమె ఒంటరిగానే వచ్చిందా?"

"అమె ఒంటరిగానే వచ్చింది. కానీ ఎవరికో ఫోన్ చేసి ఇక్కడకు రమ్మని చెప్పింది."

"విన్నారా ఇన్స్పెక్టర్! మరికొద్దిసేపు మీరు నా ఆతిథ్యాన్ని స్వీకరించండి! ఈమెకు తోడు నీడా అయిన వ్యక్తి వలలోకి నడుస్తాడు. అప్పుడు ఇద్దర్నీ తీసుకెళ్ళుదురు గాని రాచమర్యాదలతో!"

ఆగంతకురాలు బంధించబడింది. లైట్లు ఆర్పి అందరూ చీకట్లో కాచుకుని కూర్చున్నారు.

కొద్ది క్షణాలు గడిచినయ్. ఎవరో వ్యక్తి మేడమెట్లెక్కి వస్తున్న అడుగుల సవ్వడి వినవచ్చింది.

ఆగంతకురాలు అరచి, అతడ్ని హెచ్చరించకుండా ఆమె నోరు మూశారు ఒకరు.

కోటూ సూటుతో ఒక వ్యక్తి తలుపు నెట్టుకు లోపలకు వచ్చాడు.

"సుమతీ! సుమతి!!" విసుగ్గా అరిచాడు.

వెంటనే లైట్లు వెలిగినయ్. చుట్టూరా వున్న పోలీసు బృందాన్ని చూస్తూనే ఆతడు వెనుదిరిగి పారిపోబోయాడు.

పోలీసులు అతడ్ని అటకాయించారు. అతడు చివరకు లొంగిపోయాడు.

"మిస్టర్ షోమాచంద్! ఈ ప్రాంతాల్లో పేరుమోసిన స్మగ్లర్! నిన్ను ఎన్నిసార్లు పట్టుకోవాలని యత్నించినా నీవు దొరక్కుండా తప్పించుకుంటున్నావ్! ఈసారి నీవు చట్టాన్ని తప్పించుకోలేవు. ప్రాణాల్ని బలిపెట్టి, నిన్ను ఉరికంబానికి ఎక్కించేందుకు తగిన సాక్ష్యాధారాల్ని శేఖర్ సంపాదించాడు" ఇన్‌స్పెక్టర్ రాఘవ సంతోషంగా చూశాడు. ఈ కేసుతో తనకు ప్రమోషన్ ఖాయం.

"ప్చ్! కానీ ఈ కేసుతో సంబంధం లేని సరోజగూడ హత్య చేయబడింది, చివరి క్షణాల్లో ఆ కాగితాలు ఆమె చేతికి రావడం వలన! నన్ను నమ్మలేక, నా రక్షణలోంచి పారిపోయింది సరోజ! సరాసరి మృత్యుదేవత కౌగిలిలోకి వెళ్ళింది. పూర్ గర్ల్!" రమణమూర్తి సానుభూతి వ్యక్తం చేశాడు.

స్మగ్లర్ షోమాచంద్, అతడి అసిస్టెంట్, హంతకురాలూ అయిన స్త్రీని ఇద్దర్నీ ఎక్కించుకుని పోలీస్‌జీప్ కదలిపోయింది. □

ప్రతిబించిన గెలుపు

వాణిశ్రీ

చెవిక్రింద జోరీగలా అదేపనిగా రింగ్ అవుతోంది టెలిఫోన్.

ప్రవీణ్ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. కనురెప్పలు బరువుగా వున్నాయి. కళ్ళు మంటగా వున్నాయి. రాత్రి సెకండ్

షోకి వెళ్ళాడు. ఉదయం తొమ్మిదింటి వరకూ నిద్రపోవా లని అనుకున్నాడు. అలారం తొమ్మిదికే పెట్టాడు. కాని డిస్టర్బ్ చేసింది టెలిఫోన్.

అలారం టైమ్‌పీస్ వంక చూశాడు.

ఎనిమిది దాటి పది నిముషాలైంది.

రిసీవర్ ఎత్తి "యస్ ప్లీజ్!" అన్నాడు.

"డిటెక్టివ్ ప్రవీణ్ గారేనా?" కంగారుగా వినిపించింది అవతలి కంఠం.

"యస్. ప్రవీణ్ స్పీకింగ్!"

"నేను రామనాథాన్ని మాట్లాడుతున్నాను."

"గుడ్ మార్నింగ్! ఏమిటి విశేషం ప్రొద్దున్నే!" అన్నాడు ప్రవీణ్.

"ఘోరం జరిగింది మిష్టర్ ప్రవీణ్. మా లలితని ఎవరో మర్డర్ చేశారు" ఆవేదన ధ్వనించింది రామనాథం కంఠంలో.

"వాట్!...." అదిరిపడ్డాడు ప్రవీణ్.

"యస్ మిష్టర్ ప్రవీణ్!"

"ఎక్కడ జరిగింది? ఎలా జరిగింది?"

"మా ఫ్యాక్టరీ ఆవరణలో వున్న గెస్ట్‌హౌస్‌లో జరిగింది. మీరు వెంటనే రావాలి."

"యస్....వస్తున్నాను."

ప్రవీణ్ రిసీవర్ రెస్ట్‌మీద పడేసి బెడ్‌మీద నుంచి లేచాడు.

పది నిముషాల్లో తయారైపోయి బులెట్‌ని పరుగు లెత్తించాడు.

ఫ్యాక్టరీ మెయిన్‌గేటు ముందు జనం మూగివున్నారు. పోలీసులు ఎవర్నీ రానీయకుండ గేట్లు మూసి వుంచారు.

డిటెక్టివ్ ప్రవీణ్‌ని చూడగానే సెల్యూట్ చేసి గేటు తెరిచారు పోలీస్ కానిస్టేబుళ్ళు.

ప్రవీణ్ బులెట్ గెస్ట్‌హౌస్ ముందు ఆగింది.

"గుడ్‌మార్నింగ్ మిష్టర్ ప్రవీణ్" అంటూ విష్ చేశాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

ప్రవీణ్ తలెత్తి చూసి "గుడ్‌మార్నింగ్ ఇన్‌స్పెక్టర్" అని విష్‌చేశాడు.

లోపల హాల్లో సోఫాలో కూర్చున్న రామనాధం ముఖం దీనంగా వుంది. నగరంలో ప్రముఖులైన కొందరు రామనాధం మిత్రులు అతన్ని ఓదారుస్తున్నారు.

సబ్ ఇనస్పెక్టర్ అర్జునరావు ప్రవీణ్ వైపు చూసి "రండీ మీకోసం ఎదురు చూస్తున్నాం" అన్నాడు.

"మా ఫ్యాక్టరీలో జరిగిన పెద్ద దొంగతనాన్ని మీరు ఇన్వెస్టిగేట్ చేసి దొంగల్ని పట్టారు. అలాగే ఇప్పుడు గూడా లలితను చంపిన హంతకుడ్ని పట్టుకుని నా ముందు నిలబెట్టాలి మీరు" ఆవేశంతో అన్నాడు రామనాధం.

"మీరు వుద్రేక పడకండి. హంతకుడు తప్పించుకో లేడు" అన్నాడు ప్రవీణ్ గంభీర స్వరంతో.

"మీమీద నాకు నమ్మకం వుంది" హీనస్వరంతో అన్నాడు రామనాధం.

రామనాధానికి నలభై అయిదేళ్ళుంటాయి. కాని మనిషి అంత వయస్సున్న వాడిలా కనిపించడు. తల వెంట్రుకలు గూడా నల్లగానే వున్నాయి. ముప్పై దాటిన వాడిలా వుంటాడు. అతని కర్లింగ్ హెయిర్ ముఖానికి ఎంతో అందాన్నిచ్చింది.

రామనాధం భార్య పోయి మూడేళ్ళు దాటింది. మళ్ళీ పెళ్ళి చేసుకోమని బంధువర్గం పోరుపెట్టినా, మిత్రులెందరు

బలవంతం చేసినా ఒప్పుకోలేదు.

కాని అతని ఫ్యాక్టరీలో అకౌంటెంటెడిట్‌గా జేరిన లలితతో పరిచయం అయ్యాక అతని మనస్సు మారిపోయింది.

లలిత అసాధారణ అందగత్తె. బి.కామ్. ప్యాసయింది. ఫ్యాక్టరీలో చేరిన ఆర్నెల్లల్లోనే నిప్పులాంటి ఆడది అని పేరు తెచ్చుకుంది. రామనాధాన్ని ఆకర్షించిన విషయాల్లో అదొకటి.

ఆమెపై అతనికి అభిమానం పెరిగింది. ఆమెకు దగ్గర కావాలని మనసు తహతహలాడింది. ఆర్నెల్లల్లో దగ్గరయ్యాడు. లలిత ఆతనికి తన సర్వస్వం ధారపోసింది.

ఒకటి రెండు నెలలో వాళ్ళ పెళ్ళి జరుగుతుందని అంతా అనుకున్నారు. ఇంతలోకే ఈ ఘోరం జరిగింది.

యస్.ఐ. అర్జునరావు డిటెక్టివ్ ప్రవీణ్‌ని హత్య జరిగిన ప్రదేశానికి తీసుకెళ్ళాడు.

హత్య బెడ్‌రూమ్‌లో జరిగింది.

బచ్చలిపండు రంగు నైట్ డ్రెస్‌లో వుంది లలిత శవం. బెడ్‌మీద వెల్లకిలా పడివుంది శవం. మెడమీద, గుండెమీద కత్తిపోట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"వెపన్ దొరికిందా?" ప్రశ్నించాడు ప్రవీణ్, అర్జునరావు వైపు చూసి.

లేదన్నాడు అర్జునరావు.

ఫింగర్ ప్రింట్స్ ఎక్సపర్ట్ హంతకుడి వేలిముద్రల కోసం వెతుకుతున్నాడు.

"హత్య చేసిన తర్వాత హంతకుడు చేతులు కడుక్కోవడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి వుండవచ్చు. బాత్‌రూమ్ తలుపు, లోపల టాప్‌మీద ప్రింట్స్ వుండటానికి అవకాశం వుంది. అక్కడ కూడా దొరికితే తియ్యండి" అని సలహా

ఇచ్చాడు ప్రవీణ్.

ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్ అలాగేనని తల వూపి తన పనిలో నిమగ్నుడై పోయాడు.

ఫ్యాక్టరీ ఆవరణలోనే దూరంగా కట్టిన గెస్ట్‌హౌస్ అది. రాత్రిపూట నిర్మానుష్యంగా వుంటుంది. ఫ్యాక్టరీలో వర్క్ జరుగుతున్నా అది చాలా దూరంగా వుంటుంది. ఫ్యాక్టరీ దాదాపు నగర సరిహద్దుల్లో వుంది. ఫ్యాక్టరీ వెనక అన్నీ పంటచేలు. గెస్ట్‌హౌస్‌లో హత్యచేసి పారిపోవటం సులువు.

రోడ్డుమీద వాహనాలు తప్ప మనుష్యుల రాకపోకలు అసలే వుండవు.

అది గెస్ట్‌హౌస్ అప్‌స్టయిర్స్‌లోని బెడ్‌రూమ్. కిటికీ దగ్గర నిల్చుని దూరంగా దృష్టిసారించి చూస్తున్నాడు ప్రవీణ్. అన్నీ పొలాలే. రెండుమైళ్ళ దూరాన వున్న పల్లెటూరు వంకాయలపాలెం కనిపిస్తోంది.

హంతకుడు ఆ వూరివైపు పారిపోయివుండొచ్చు. లేదా రోడ్డు యెక్కి ఏదైనా వాహనంమీద వెళ్ళిపోవచ్చు.

ప్రవీణ్ దృష్టి కిటికీపై నిల్చిపోయింది. కిటికీ చెక్క మీద కత్తిరించిన గోళ్ళు, వాటి ప్రక్కనే నెయిల్ కట్టర్.

ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్‌ని పిలిచి నెయిల్‌కట్టర్ మీద వేలిముద్రలు చూడమన్నాడు.

"ఉన్నాయి సార్!" అన్నాడతను.

ప్రవీణ్ సంతృప్తిగా తల ఆడించాడు.

ప్రాథమిక పరీక్షల అనంతరం శవాన్ని పోస్ట్‌మార్టమ్ రిపోర్టుకోసం హాస్పటల్‌కి పంపించారు.

అప్పటికి పన్నెండు దాటింది.

రూమ్ లాక్‌చేయించి "రామనాధంగారూ! రూమ్ ఎవరూ

తీయకుండా చూడండి" అన్నాడు ప్రవీణ్.

"రూమే కాదు ఈ గెస్ట్‌హౌస్ మొత్తాన్ని సీల్ చేయిస్తాను" అన్నాడు రామనాథం.

హాల్లో కూర్చుని ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్. ఐ. అర్జునరావు ఫ్యాక్టరీ వాచ్‌మాన్‌ని ఇంటరాగేట్ చేశారు.

రాత్రి ఎవరూ రాలేదనీ, తను కేకలు ఏమీ వినలేదనే చెప్తున్నాడు అతను. వాచ్‌మాన్‌కి యాభై ఏళ్ళు దాటి వుంటాయి. అతని పేరు బసవయ్య.

బసవయ్య చెప్పేదాంట్లో అబద్ధం ఏమీ వుండదని ప్రవీణ్‌కి అనిపించింది.

లలితని గెస్ట్‌హౌస్‌లో హత్య చేయడానికి ఫర్లాంగు దూరంలో వున్న వాచ్‌మాన్‌తో లాలూచీపడే అవసరం ఏమీ వుండదు. వాచ్‌మాన్ గేటుదగ్గర పడివుంటాడు. లేదా ఫ్యాక్టరీ చుట్టూ తిరుగుతాడు తప్ప గెస్ట్‌హౌస్ దగ్గరకు వెళ్ళడు.

2

"మీకు ఎవరిమీదనైనా అనుమానం వుందా?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

"నాకు అయోమయంగా వుంది ఇనస్పెక్టర్. ఏమీ అర్థం కావడంలేదు. లలిత యెవరికీ అపకారం చేసే మనిషి కూడా కాదు" అన్నాడు రామనాథం బాధపడుతూ.

"అపకారం చెయ్యనవసరంలేదు. ఉపకారం చేసినా కష్టాలు వస్తాయి యీ రోజుల్లో" నవ్వుతూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఉపకారం అంటే జ్ఞాపకం వచ్చింది. లలిత మేనత్త కొడుకు సుబ్బారావు అని ఒకడున్నాడు. అతను బి. ఏ. ప్యాసయాడనీ, ఏ ఉద్యోగం దొరక్క తిరుగుతున్నాడనీ,

యేదైనా వుపకారం చెయ్యమని లలిత నన్ను అడిగింది.

చదువుకున్నవాడని నేను అతన్ని ఆరాధనా పెయింట్స్ ప్రొప్రయిటర్ రామశాస్త్రికి చెప్పి సేల్స్ రిప్రజెంటెటివ్‌గా యిప్పించాను. ఒక సంవత్సరంలో అతను శాస్త్రి అభిమానం పొంది ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోట్ అయ్యాడు.

అతను తనను పెళ్ళిచేసుకోమని అడుగుతున్నాడనీ, ఇంట్లో వాళ్ళతో ఒత్తిడి తెస్తున్నాడనీ లలిత నాతో చెప్పింది. ఆ తర్వాతనే నేను లలితను పెళ్ళి చేసుకోవడానికి నిశ్చయించుకుని ఆమె తల్లిదండ్రులకు చెప్పాను. తనను పెళ్ళిచేసుకోలేదనే కోపంతో సుబ్బారావు ఈ అఘాయిత్యం చేశాడా? అని నా అనుమానం'' వివరించాడు రామనాథం.

అనుమానితుల జాబితాలోకి సుబ్బారావు ఎక్కాడు.

''సుబ్బారావు ఎలిబీ టెస్ట్ చెయ్యాలి'' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ప్రవీణ్ తల వూపాడు.

''పోస్టుమార్టమ్ రిపోర్టు రేపుగాని రాదు. ఈ లోపల మీరు ఒకసారి స్టేషన్‌కి వస్తారా?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

''ష్యూర్!....'' అన్నాడు ప్రవీణ్.

''అర్జున్! నువ్వు ఆరాధనా పెయింటింగ్స్ ఆఫీసుకి వెళ్ళి సుబ్బారావు ఎలిబీ టెస్టుచేసి నాకు చెప్పాలి. ఏ మాత్రం అనుమానం వున్నా అతన్ని అరెస్టుచేసి తీసుకురా!'' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

పోలీస్ ఆఫీసర్లు వెళ్ళడానికి సిద్ధమై రామనాథం దగ్గర సెలవు తీసుకున్నారు.

''నేను ఇప్పుడే వస్తున్నాను. మీరు బయల్దేరండి'' అన్నాడు ప్రవీణ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తితో.

వాళ్ళు వెళ్ళిపోయారు.

రామనాథం ఒక్కడే వున్నాడు సోఫాలో.

ప్రవీణ్ సిగిరెట్ వెలిగించి రెండుదమ్ములు పీల్చాడు.

"మీరు నిన్న గోళ్ళు కత్తిరించారా!" ప్రశ్నించాడు ప్రవీణ్.

రామనాథం వులిక్కిపడి తన చేతిగోళ్ళవంక చూసుకున్నాడు. అవి నున్నగా వున్నాయి.

ప్రవీణ్ రామనాథం వంక సూటిగా చూస్తున్నాడు.

"లేదే....ఏం అలా అడుగుతున్నారు?" కంగారుగా అన్నాడు రామనాథం.

"లలిత వున్న రూమ్ కిటికీలో కత్తిరించిన గోళ్ళు కన్పించాయి. నెయిల్ కట్టర్ గూడా అక్కడ వుంది" అన్నాడు ప్రవీణ్.

"అవి లలితవేనేమో?"

"కాదు. ఆమె గోళ్ళకు పాలిష్ వుంది" అన్నాడు ప్రవీణ్.

రామనాథం ఏం మాట్లాడలేదు.

"రాత్రి ఎవరో లలిత గదికి వచ్చారు. వాళ్ళు లలితకు అతి సన్నిహితులై వుండొచ్చు. లేకపోతే అంత తీరికగా గోళ్ళు కత్తిరించుకుంటూ కాలం గడపరు."

రామనాథం ముఖ కవళికలు మారిపోతున్నాయి.

"ఆమె క్యారెక్టర్ గురించి మీ అభిప్రాయం ఏమిటి?" సూటిగా ప్రశ్నించాడు ప్రవీణ్.

ఆ ప్రశ్న రామనాథాన్ని ఇబ్బందిలో పెట్టింది. కొంచెం సేపు వూరుకుని తర్వాత చెప్పాడు.

"అంతకుముందు ఏమో నాకు తెలియదు. నాతో పరిచయమైన తర్వాత ఆమెలో ఏ లోపంలేదు. ఆమెకు వేరే

వాళ్ళతో సంబంధం వున్నట్లు నేనెప్పుడూ నోటీస్ చెయ్యలేదు. ఆమె నిప్పులాంటిదని పేరు తెచ్చుకుంది. అందుకే ఆమెకు నేను దగ్గరయ్యాను."

"రాత్రి ఆమె గెస్టుహౌస్‌లో ఎందుకు వున్నట్లు? ఇంటికి వెళ్ళలేదా?"

"ఉహూఁ.....మీకు తెలుసో లేదో మే మిద్దరం కలుసుకునేది గెస్టుహౌస్‌లోనే. రాత్రి కలుసుకోదలిస్తే నేను ముందుగానే ఆమెకు చెప్పేవాడిని. ఆమె పని చూసుకుని గెస్టుహౌస్‌లో వుండిపోయేది. రాత్రి నేను వస్తానని ఆమెకు చెప్పాను. కాని రాలేకపోయాను."

"అశోక్ హోటల్లో పార్టీ జరిగిందని మీరు పోలీసులకు స్టేట్‌మెంట్ యిచ్చారు."

"అవును. పార్టీ అయ్యాక రావాలనే వుద్దేశ్యంతో లలితను వుండమని చెప్పి వెళ్ళాను. కాని రాలేకపోయాను. పార్టీలో రంగారావు అని ఒకడున్నాడు. వాడు ఇంజనీర్. నా క్లాస్ మేట్ గూడా. వాడు నాకు ఎక్కువ పోసేసి ఓవర్ చేశాడు. నాకు మందు ఎక్కువైపోయింది. అదీకాక...."

రామనాథం చెప్పడానికి తటపటాయిస్తున్నాడు.

"చెప్పండి. నా దగ్గర దాపరికం యెందుకు? మీ రహస్యాలు యెక్కడికీ పోవు" చిరునవ్వుతో అన్నాడు ప్రవీణ్.

"పార్టీ తర్వాత అమ్మాయిల్ని గూడా అరేంజి చేశారు. అందుకని వుండిపోవాల్సి వచ్చింది" సిగ్గుపడుతున్నట్లు అన్నాడు రామనాథం.

ప్రవీణ్ మనసులో ఆలోచనలు మబ్బుల్లా కదుల్తున్నాయి.

"హంతకుడు ఎక్కడికీ పోడు రామనాథంగారూ!

పోలీసులు పట్టుకోగలుగుతారు. ఈ కేసు నేను ఇన్వెస్టిగేట్ చెయ్యాల్సిన అవసరం లేదనుకుంటాను."

రామనాధం ఆదోలా చూశాడు.

"ఏమిటి మీరనేది?"

"ఏంలేదు. హంతకుడు ఎవరైనా లలిత మీకు కాకుండా పోయింది. అందుగురించి మీకు పట్టుదల ఎందుకు?"

"మీరనేది ఏమిటో నాకు అర్థం కావడంలేదు మిష్టర్ ప్రవీణ్. హత్య చేసినవాడు దొరికితీరాలి. ఈ రోజు లలితను హత్యచేశాడు. రేపు వాడు నన్నూ మర్డర్ చెయ్యొచ్చును. నేను తెలుసుకుని తీరాలి. పోలీసులు అసమర్థులని కాదు నా వుద్దేశ్యం. వాళ్ళకు ఎన్నో కేసులు వుంటాయి. ప్రత్యేకించి ఈ కేసుమీద కాన్‌సంట్రేట్ ఎందుకు చేస్తారు చెప్పండి? అందుకే మిమ్మల్ని పిలిపించాను."

"మీకు అంత పట్టుదల వుంటే కేసు తీసుకుంటాను" అన్నాడు ప్రవీణ్.

"థాంక్స్" అన్నాడు రామనాధం.

"లలిత తల్లిదండ్రులతో ఎక్కడ వుంటోంది? ఆమె ఇంటి అడ్రెస్ కావాలి నాకు. బై దిబై ....ఆమె మీ ఫ్యాక్టరీలో అక్కౌంటెంట్‌గా పనిచేస్తున్నది గదా! ఆమె ఆఫీసులోవున్న బీరువా, టేబుల్ వగైరా చూడాలి."

"ఓ.కే!....లలిత ఇల్లు రామచంద్రరావు పేటలోవుంది. శివాలయానికి అరఫర్లాంగు దూరంలో వుంది. వాళ్ళ నాన్న పేరు రాజారావు. ఎవర్నడిగినా చెప్తారు. పదండి ఫ్యాక్టరీకి వెళ్దాం. లలిత సీటు చూస్తానన్నారుగా" అంటూ లేచాడు రామనాధం.

ఇద్దరూ ఫ్యాక్టరీకి వెళ్ళారు.

లలిత కూర్చునే రూమ్‌లో అంతా చూశాడు. పనికి

వచ్చే విషయాలు ఏమీలేవు.

ప్రవీణ్, రామనాథం దగ్గర సెలవు తీసుకుని బయల్దేరాడు.

మర్నాడు ప్రవీణ్ వెళ్ళేసరికే ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి పోస్టుమార్టమ్ రిపోర్టు ముందు పెట్టుకుని దీర్ఘాలోచనలో మునిగిపోయివున్నాడు.

ప్రవీణ్ విష్ చేశాక తేరుకుని చిరునవ్వు నవ్వాడు.

"వెల్‌కమ్ మిష్టర్ ప్రవీణ్! ఇదుగో పోస్టుమార్టమ్ రిపోర్టు వచ్చింది చూడు. రామనాథం చెప్పిన దానికీ దీనికీ సంబంధం లేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఏమిటి అసలు విషయం?"

"రామనాథం తను ఆ రాత్రి అశోక్ హోటల్లో పార్టీ చేసుకుంటూ వుండిపోయానని అంటాడు. అంటే అతను గెస్టహౌస్‌కి రాలేదనే అర్థం కదా!"

"అంతే మరి!"

"హత్య జరగడానికి ముందు ఆమెను ఎవరో అనుభవించారని రిపోర్టులో వుంది. నా అనుమానం ఏమిటంటే రామనాథమే ఆమెను చంపి నాటకం ఆడుతున్నాడేమో!"

"నో.... ఇన్‌స్పెక్టర్!"

"అఫ్‌కోర్స్! నా అనుమానం...." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"రామనాథం కాదని నేను రూఢి చేసుకున్నాను. అతనే ఈ హత్య చేసివుంటే దోషిని పట్టుకునే విషయంలో నన్ను పిలిచివుండేవాడు కాదు. ఇప్పుడు అతను హంతకుడ్ని పట్టుకోవాలని పట్టుదలతో వున్నాడు. నన్ను ఈ కేసు ఇన్వెస్టిగేట్ చెయ్యమని అడిగాడు. అంటే దాన్నిబట్టి అతను

కాదనే సంగతి తెలిసిపోతోంది. కావాలని ఎవరూ తమ కంఠానికి వురిపెట్టుకోరు" అన్నాడు ప్రవీణ్.

ప్రవీణ్ పోస్టుమార్టమ్ రిపోర్టు చూశాడు. రాత్రి పది గంటలకు ప్రాణం పోయిందని రాశాడు డాక్టర్.

ఇంతలో పోలీస్‌స్టేషన్ ముందు జీప్ ఆగింది.

యస్.ఐ. అర్జునరావు వచ్చి సెల్యూట్ చేసి "ఇతనే సార్ సుబ్బారావు" అన్నాడు.

సుబ్బారావు ముఖంలో భయాందోళనలు వ్యక్తమౌతున్నాయి. మనిషి సన్నగా పొడుగ్గా, చామనచాయలో వున్నాడు. ముఖంలో కళలేదు. అతను లలితకు ఏ విధంగానూ తగడు.

"లలిత మేనత్త కొడుకు కదూ మీరు?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

"అవున్సార్!" అన్నాడు సుబ్బారావు.

"నిన్న రాత్రి ఎక్కడున్నారు మీరు?"

"ఊళ్ళోనే వున్నాను సార్!"

"ఊళ్ళోనే వున్నారు సరే! ఊళ్ళో ఎక్కడని? ఇంట్లోనా? వీధిలోనా?" కఠినంగా ధ్వనించింది ఇన్‌స్పెక్టర్ కంఠం.

"నిన్న వుదయమే హైదరాబాద్ నుంచి వచ్చాను సార్! సాయంకాలం వరకూ ఇంట్లోనే రెస్ట్ తీసుకున్నాను. చీకటి పడిన తర్వాత సెంటర్‌కి వెళ్ళి నైజామ్ హోటల్లో టీ తీసుకుని కాసేపు పార్కులో కూర్చుని యింటికి వెళ్ళిపోయాను."

"ఇంటికెళ్ళేసరికి టైమెంత?"

"ఎనిమిది దాటింది సార్!"

"లలితను పెళ్ళి చేసుకోమని నువ్వు వేధించేవాడివట నిజమేనా?"

"అబద్ధం సార్! లలితంటే నాకు ఎంతో గౌరవం. నాకు రామనాథంగారితో రికమండేషన్ చేయించి వుద్యోగం యిప్పించింది. నేనెన్నడూ వేధించలేదు సార్! ఆమెకు యిష్టమైతే పెళ్ళి చేసుకుంటానని అడిగాను. అప్పుడే పెళ్ళి చేసుకునే వుద్దేశ్యం లేదని అంది. అంతే సార్!"

"తర్వాత. ఇంట్లో వాళ్ళతో చెప్పి వత్తిడి తీసుకొచ్చావా?"

"లేదు సార్! నేనిక పట్టించుకోలేదు. మా మామయ్యే లలితను అడుగుతూ వుండేవాడని తెలిసింది."

"లలిత వాళ్ళ యజమానిని పెళ్ళి చేసుకోబోతున్నదని తెలిసి నీకు ఏమనిపించింది?"

"బాధనిపించింది సార్!"

"ఎందుకు? నిన్ను చేసుకోలేదనా?"

"అందుకు కాదు సార్! వయసులో వాళ్ళిద్దరికీ ఇరవై ఏళ్ళు తేడా వుంది సార్! అందుకు?"

"అంతేగాని నువ్వు ఆమెమీద పగపట్టలేదంటావ్?"

"పగపట్టి చంపితే నాకు వచ్చే లాభం ఏముంది సార్?" దీనంగా అన్నాడు సుబ్బారావు.

తర్వాత సుబ్బారావు వేలి ముద్రలు తీసుకొని పంపేశారు.

"ఏమిటి వీడిమీద మీ వుద్దేశ్యం?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

"ఫింగర్ ప్రింట్సు రానివ్వండి" అన్నాడు ప్రవీణ్.

"అతనికి ఫీవర్ వచ్చి ప్రింట్స్ వెయ్యలేదట. లేక పోతే ఈపాటికి వచ్చి వుండేవి. ఫోన్ చేసి చెప్పాడు రేపు

పంపుతానని."

"రేపు సుబ్బారావు ప్రింట్స్‌గూడా వెయ్యమనండి. టాలీచేసి చూద్దాం" అన్నాడు ప్రవీణ్.

ఇన్‌స్పెక్టర్ తల వూపాడు.

4

సుబ్బారావుకి బలమైన ఎలిబీ లేకపోయినా అతను లలితను హత్య చేశాడనటానికి యెటువంటి ఆధారాలూ లేవు. గదిలో దొరికిన ఫింగర్ ప్రింట్స్‌తో సుబ్బారావువి టాలీ కాలేదు. అయినా అతనిమీద నిఘావేసి వుంచారు పోలీసులు.

లలితకు రామనాథంతోనే కాకుండా వేరే మరొక మనిషితో శారీరక సంబంధం వుందనే విషయం పోస్టు మార్టమ్ రిపోర్టులో తేలింది. బెడ్‌రూమ్‌లో ముగ్గురి వేలి ముద్రలు దొరికాయి. లలిత, రామనాథాలవే కాకుండా నెయిల్ కట్టర్‌మీద మరొకరివి.

ఆ మనిషికోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. కాని ఏ విధమైన ఆచూకీ దొరకడంలేదు.

"మీకు ఎవరిమీదనయినా అనుమానం వుందా?" అని ప్రవీణ్ ప్రశ్నించినప్పుడు లలిత తండ్రి తల అడ్డంగా వూపాడు.

"నాకు ఎవరిమీదా లేదు బాబూ!" అన్నాడు రాజారావు నిట్టూరుస్తూ.

"లలిత రామనాథాన్ని పెళ్ళి చేసుకోవడం మీకు ఇష్ట మేనా? మీరు ఫీలయ్యారా?"

"నిజం చెప్పాలంటే నాకు యిష్టంలేదు. వయసు తార తమ్యం చాలా వుంది. రామనాథాన్ని పెళ్ళి చేసుకోవాల్సిన అవసరం ఏమిటో కూడా నాకు అర్థం కావడంలేదు. నెలకు

వెయ్యి రూపాయలు జీతం వస్తున్నది. నా మేనల్లుడు సుబ్బా రావూ దాదాపు అంత సంపాదిస్తున్నాడు. ఇద్దరూ పెళ్ళి చేసుకుంటే హాయిగా గడిచిపోయేది. కాని ఎందుకో లలిత యీ పెళ్ళికి యిష్టపడలేదు. రామనాథం ఆస్థిపరుడు కావ డమే కారణమై వుంటుంది'' అన్నాడు రాజారావు.

ప్రవీణ్ తల వూపి "మీరు సరిగ్గా వూహించారు'' అన్నాడు.

"ఈ రోజుల్లో పిల్లలు తాత్కాలికమైన సుఖం చూసు కుంటున్నారు గాని భవిష్యత్తు గురించి ఆలోచించలేకపోతు న్నారు'' అని వాపోయాడు రాజారావు.

రాజారావు రిటైర్డ్ మాష్టారు. వయస్సు అరవై దాటి వుంటుంది. పీలగా పొడుగ్గా వున్నాడు.

"లలితను హత్య చేసినవాడి ఆచూకీ తెలుసుకోవాలని రామనాథంగారు పట్టుదలతో వున్నారు. నిజం తెలుసుకోవా లంటే మీరు ఏమీ దాచకుండా చెప్పాలి.''

"ఇంకా దాచుకోవడం యెందుకు బాబూ! ఏం లాభం?'' అన్నాడు రాజారావు విచారంగా.

"మీ అమ్మాయికి మగపిల్లలు యెవరయినా స్నేహితు లున్నారా? కాలేజీలో చదువుకునే రోజుల్లో: అంటే వుద్యో గంలో చేరకముందు.''

రాజారావు కొంచెం ఆలోచించాడు.

"మా అమ్మాయి కాలేజీలో చదువుకునే రోజుల్లో యాక్టివ్‌గా వుండేది. కల్చరల్ సెక్రటరీగా పని చేసింది. కొందరు మగపిల్లలు కూడా స్నేహితులు వుండొచ్చు. కాని యెవరితోనూ ఎక్కువ సన్నిహితంగా తిరిగినట్లు నేను నోటీస్ చెయ్యలేదు.''

ప్రవీణ్ ఇల్లంతా కలయ చూస్తూ "మీ అమ్మాయి గది

ప్రత్యేకంగా వుందా?" అన్నాడు.

"అవును బాబూ! ఆ గదే! తాళం వేసేశాం. తన గది ప్రత్యేకంగా నీట్ గా వుంచుకునేది."

"మీకు ఎంతమంది పిల్లలు?"

"ముగ్గురు ఆడపిల్లలు. లలిత చిన్నది. పెద్దవాళ్ళిద్దరికీ పెళ్ళిచేసి పంపాను."

"ఈ ఇంట్లో లలితా, మీరు యిద్దరే వుంటున్నారా?"

"అవును. యెప్పుడైనా పెద్దమ్మాయిలు వచ్చి పోతుంటారు."

"యింట్లో వంట యెవరు చేస్తారు? మీ అమ్మాయేనా....?"

"వుద్యోగం రాకముందు చేసేది. తర్వాత వీలుకావడం లేదని వంటకి ఒక మనిషిని పెట్టింది."

"అలాగా! ఈ యిల్లు మీ స్వంతమే అనుకుంటాను...."

"అవును. ఏనాడో మా తాత కట్టించాడు" రాజారావు పై కప్పువైపు చూసి నిట్టూర్చాడు.

"లలిత హత్య జరిగిన రోజు ఆమె కోసం ఎవరైనా వచ్చారా? అంతకు ముందురోజు గాని."

"ఆ రోజు వుదయం ఎనిమిదింటికి నేను ఇంట్లోనుంచి వెళ్ళిపోయాను. ఒక స్నేహితుడు హాస్పటల్లో అడ్మిట్ అయ్యాడని తెలిసి చూడ్డానికి వెళ్ళాను. తిరిగి వచ్చేసరికి పదకొండు దాటింది. అమ్మాయి పదింటికంతా వెళ్ళి పోతుంది. ఒంటి గంటకు బాయ్ వచ్చి క్యారేజీ పట్టుకెళ్తాడు. సాధారణంగా అమ్మాయికోసం ఎవరూ ఇంటికి రారు" అన్నాడు రాజారావు.

"ఒకసారి ఆ గది తెరుస్తారా? చూస్తాను" అన్నాడు ప్రవీణ్.

"అలాగే...." అని రాజారావు లలిత గది తాళం తీసి తలుపులు తెరిచాడు.

కిటికీ రెక్కలు తీశాక వెలుతురు వచ్చింది గదిలోకి. గది విశాలంగా వుంది. ఎత్తైన పందిరి మంచంమీద ఫోమ్ బెడ్ వుంది. గాడ్రెజ్ బీరువా, ఐరన్ ఆఫీసు టేబులు, దానిముందు యస్ మార్కు కుర్చీ. మెత్తటి సోఫా. గదిలో ఖరీదైన వాతావరణం కనిపిస్తోంది.

టేబుల్ మీద టేప్‌రికార్డర్ జపాన్ సెట్ వుంది. టూ ఇన్ వన్ సెట్ అది. ఒక ప్రక్కగా కేసెట్‌లు పేర్చి వున్నాయి.

గదంతా పరీక్షగా చూశాడు. బీరువా తెరిపించాడు. అన్నీ చీరలు, బ్లౌజులు, లో లంగాలు, గాజులు వగైరా వున్నాయి. డైరీ, లెటర్స్‌వంటివేమీ దొరకలేదు.

కుర్చీలో కూర్చుని గదంతా చూస్తూ ఆలోచనలో పడిపోయాడు.

టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. దానిలో యేదో కేసెట్ వుంది.

కాని యేమీ సౌండ్ రాలేదు. అది ఖాళీ దన్నమాట.

కాసెట్ రివర్స్ చేసి ఆన్ చేశాడు. డిస్కో సంగీతం వస్తోంది. అలా వింటూ కూర్చున్నాడు. కొంచెంసేపటి తర్వాత "కిరణ్ :...." అనే మాట తర్వాత "హాయ్! లలితా!" వినవచ్చాయి. తర్వాత సౌండ్స్ లేవు.

లలిత మరో కేసెట్‌లోనుంచి గాని, రేడియోలోనుంచి గాని డిస్కో మ్యూజిక్ రికార్డు చేస్తూ వుండగా "కిరణ్!"

అనే అతను వచ్చాడు. అతను లలితను పలకరించాడు. తర్వాత లలిత టేప్‌రికార్డర్ ఆఫ్ చేసింది.

"కిరణ్ .... యెవరతను?" ప్రవీణ్ దీర్ఘంగా ఆలోచించాడు.

రాజారావు గదిలోకి వస్తూ కాఫీ కప్పు పట్టుకొచ్చాడు.

"ఎందుకండీ యిప్పుడు?" అన్నాడు ప్రవీణ్ మొగమాట పడుతూ.

"ఫరవాలేదు బాబూ!" అంటూ కాఫీ కప్పు టేబులు మీద పెట్టాడు.

"రాజారావుగారూ! కిరణ్ అంటే యెవరో మీకు తెలుసా?" ప్రశ్నించాడు ప్రవీణ్.

"ఎందుకు తెలీదు. అతనే మా లలితకు వుద్యోగం ఇప్పించాడు. అతను మా లలిత క్లాస్‌మేట్."

"అలాగా!...."

"అవును బాబూ! రామనాధంగారి అబ్బాయే అతను" అన్నాడు రాజారావు.

ప్రవీణ్ ఆశ్చర్యంగా చూశాడు.

"అతను ఆ రోజు మీ యింటికి వచ్చాడు. మీరు లేరు. ఇదుగో ఈ టేప్ వినండి" అంటూ ప్రవీణ్ కిరణ్, లలితల మాటలు వినిపించాడు.

రాజారావు తెల్లబోయాడు.

"అయితే...." అని యేదో అడగబోయాడు రాజారావు.

ప్రవీణ్ ఆయన అడగబోయేది గ్రహించి "ఇప్పుడేమీ చెప్పలేను" అన్నాడు.

టేప్‌రికార్డర్‌లోని క్యాసెట్ తీసి జేబులో వేసుకుని బులెట్‌మీద స్టేషన్‌కి వెళ్ళాడు.

"వెల్‌కమ్ మిష్టర్ ప్రవీణ్. గుడ్ న్యూస్. లలితను చంపిన కత్తి దాన్ని చుట్టిన టవల్ దొరికాయి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

"గుడ్! ఎలా దొరికాయి?" ప్రశ్నించాడు ప్రవీణ్ కూర్చుంటూ.

కానిస్టేబుల్ టవల్, కత్తి తెచ్చి టేబులు మీద పెట్టాడు.

"గెస్టుహౌస్ గోడప్రక్కనే మట్టిలో పాతిపెట్టారు. నిన్న కురిసిన వానకి బైటపడింది టవలు. వాచ్‌మాన్ లాగితే మొత్తం బైటపడింది కత్తితో సహా. రామనాథం గారు పంపించారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"వేలిముద్రలు దొరికాయా."

"ఆ....ఎప్పుడో తీయించాను. నెయిల్ కటర్‌మీద వున్నవీ కత్తిమీద వున్నవీ టాలీ అయ్యాయి. రెండూ ఒకడివే."

"గుడ్."

"ఎవడో వాడు?"

"నేను చెప్తాను."

ఆశ్చర్యంగా చూశాడు ఇన్‌స్పెక్టర్.

"ఎవరు?"

"కిరణ్, రామనాథం కొడుకు!" అన్నాడు ప్రవీణ్.

"ఈజిట్?" అదిరిపోయాడు ఇన్‌స్పెక్టర్.

"అతని వేలిముద్రలు తీసుకోండి. సరిగ్గా సరిపోతాయి" అని నవ్వాడు ప్రవీణ్.

5

ప్రవీణ్ చెప్పినట్లే జరిగింది.

కత్తిమీద, నెయిల్ కట్టర్‌మీద వున్న వేలిముద్రలు రామనాథం కొడుకు కిరణ్‌వే.

పోలీసులు కిరణ్‌ని అరెస్ట్ చేశారు. అతను తన నేరం ఒప్పుకున్నాడు.

"నాకూ లలితకూ యెప్పట్నుంచో సంబంధం వుంది. అందుకే నేను నాన్నకి చెప్పి ఆమెకు ఫ్యాక్టరీలో వుద్యోగం యిప్పించాను. లలిత అత్యాశకు పోయి నాన్ననే వలలో వేసుకుంది. చివరకు పెళ్ళి చేసుకోవడానికి ఒప్పించింది.

నేను లలితను అభ్యంతరపెట్టాను. మీ నాన్నను పెళ్ళి చేసుకుంటే నీకేం నష్టం? నువ్వు చెప్పినట్లు వింటానుగా అని నాకే నచ్చజెప్పసాగింది.

కాని నా కీ నాటకం ఇష్టం లేదు. మా నాన్న పెళ్ళి చేసుకున్నాక ఆమె నాకు తల్లి అవుతుంది. నాతో సంబంధం వున్న స్త్రీ నాకు తల్లి అవుతుంటే సహించలేకపోయాను. లలిత నా మాట వినేట్లు కనిపించలేదు. అందుకే చంపాను" అన్నాడు కిరణ్.

ప్రవీణ్ రామనాథంగారికి ఫోన్‌చేసి "ఐ యామ్ సారీ రామనాథంగారూ!" అన్నాడు.

"ఫరవాలేదు" ఆయన గొంతు హీనంగా పలికింది.

"ఇలా జరుగుతుందనుకోలేదు" అన్నాడు ప్రవీణ్.

"దట్సాల్ రైట్. ఇంట్లోనే వుండండి మీ ఫీజు పంపుతున్నాను" అన్నాడు రామనాథం.

ప్రవీణ్ ఏదో అనాలనుకునేంతలో అవతల ఫోన్ పెట్టేసినట్లు 'క్లిక్' మని శబ్దం వచ్చింది. □

క్రిష్ణవేణి

రక్తభ్రమరకాలు

"నమస్కారం సార్!" ఓ నలభై సంవత్సరాల వ్యక్తి లోపలికొస్తూ అన్నాడు.

"నమస్కా.రం" ఇన్‌స్పెక్టర్ పళనివేలు తలెత్తి చూశాడు.

"సార్! నా పేరు విశ్వనాథరావు. తెలుగువాడిని. మద్రాసులో వుంటున్నాను."

"మీరు వచ్చిన పని...." సార్జంటు తంగం ప్రశ్నించాడు.

"నేను టి. నగార్‌లో వెంకటనారాయణ స్ట్రీట్‌లో వుంటున్నాను. మా యింటి ప్రక్కన శ్రీదేవి అనే అమ్మాయి వుంటోంది. ఆ పిల్ల తన వాటాలో లేదు. ఆమె బెడ్ రూమ్‌లో రక్తపు మరకలు వున్నాయి...."

తంగం కుతూహలంగా ముందుకు వంగాడు.

ఇన్‌స్పెక్టర్—"వివరంగా చెప్పండి" అని అన్నాడు.

"సార్! నేను వివరంగా చెపుతున్నాను. శ్రీదేవి యింటిలోనూ మా యింటలోనూ ఒకే పనిమనిషి పని చేస్తోంది. శ్రీదేవి ఉద్యోగస్థురాలు...."

"ఎక్కడ ఫని చేస్తోంది?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్న.

"ఏదో ప్రయివేట్ కంపెనీలో అని విన్నాను. నాకు సరిగా తెలియదు."

"తరువాత...."

"పనిది ఐదున్నరకంతా ఆమె యింటికి వెళ్ళి పనిచేసి ఏడుగంటలకి ఆమె పనికి వెళ్ళగానే మా యింటికి వస్తుంది. ఈ రోజూ అలానే వెళితే ఎంత పిలచినా ఆమె తలుపు తీయలేదట. వెనుక వేపు తలుపు తీసి వుందట. లోనకు వెళితే ఓ వూరకుక్క గదినంతా నాకుతోందట. ఆమెలేదు. రక్తపు మరకలని కుక్క నాకుతోందట. ఓ రక్తపుగుడ్డని అది పీలికలు చేస్తోందట. పనిది భయపడి మాయింటి కొచ్చి చెప్పింది."

"నేను ఇరుగు పొరుగుని పిలచి వెళ్ళి చూసి, కుక్కని తరిమి గదికి గొళ్ళెంపెట్టి, మీ దగ్గరకి వచ్చాను" అని

చెప్పాడు.

"రిపోర్టు వ్రాసి యివ్వండి."

అతను వ్రాసి యిచ్చాడు.

తంగం, ఇనస్పెక్టరు, ఫోటోగ్రాఫర్‌తో స్పాట్‌కి బయలుదేరారు.

2

అది రెండుపోర్షన్‌ల యిల్లు. ఒక పోర్షనులో విశ్వనాధ రావు, రెండోదానిలో శ్రీదేవి వుంటున్నారు.

"అద్దె ఎంత?" తంగం ప్రశ్నించాడు.

"ఆరువందలండి."

"ఇంటి ఓనర్ ఎక్కడ?"

"ఆయన అన్నానగర్‌లో వుంటున్నారు."

లోపలకు వెళ్ళారు.

నాలుగు గదుల పోర్షన్ అది.

బెడ్‌రూము అత్యంత ఆధునికంగా అలంకరించి వున్నది.

ఫోమ్ డబుల్‌కాట్ టి.వి. వగైరా వున్నాయి. గోడలకి వాల్‌ప్లేట్స్ ఖరీదయినవి అలంకరించి వున్నాయి.

బెడ్‌మీద దుప్పటి నిండా రక్తపు మరకలు వున్నాయి.

టి. వి. మీద ఓ అందమైన యువతి నిలబడివున్న కలర్‌ఫోటో వున్నది. ఫోటోలోనే అంత అందంగా వున్నది. వాస్తవంగా చూస్తే యింకెంత అందమో అని పించేలా వున్నది.

విశ్వనాధరావు—"సార్! ఆమె శ్రీదేవి" అని ఆ ఫోటోని చూపించాడు.

ఇల్లంతా వెతికారు,

శవం కనిపించలేదు.

దొడ్లో ఏమయినా పాతిపెట్టారేమోనని వెతికి చూశారు. తవ్విన గుర్తులు కనిపించలేదు.

అసలు మనుషులు నడచిన గుర్తులు కూడా కనిపించలేదు.

"ఆమె గురించి వివరాలు చెప్పండి" ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"సార్! మాకంతగా తెలియదు. పనిచేస్తున్న పిల్ల-ప్రొద్దుటపోయి ఏ సాయంకాలమో వస్తుంది. ఎవరి తాపత్రయం వారిది" విశ్వనాధరావు అన్నాడు.

"మీ శ్రీమతిని పిలండి" విశ్వనాధరావు పిలవగా ఆమె వచ్చి నమస్కరించింది.

"ఏమ్మా! శ్రీదేవి ఎక్కడ పని చేస్తోందో మీకు తెలుసా?"

"లక్ష్మీ కాస్మోటిక్సు ఫరమ్‌లో సేల్సు ఏజెంటుగా చేస్తున్నానని చెప్పింది."

"దాని ఆఫీసు ఎక్కడ?"

"అంబత్తూరులో."

"ఆమె రోజూ అక్కడికి వెళ్తుందా?"

"లేదు.... ఆఫీసు షో రూము టి. నగర్‌లో వుందని చెప్పింది."

"ఆమెదే వూరు? తల్లిదండ్రులు ఎక్కడ వుంటున్నారు?"

"ఆమెది కోలారుపేట. అందరూ అక్కడే వుంటున్నారని అంది గానీ రెండు సంవత్సరాలలో ఎవ్వరూ యిక్కడికి రాలేదు."

"ఆమె కోసం ఒక్క చుట్టం కూడా రాలేదా?"

"ఎవరో ఓ యాభై సంవత్సరాలాయన మాత్రం

నెలకోసారి వచ్చి రెండు మూడు రోజులు వుండి వెళ్తారు. ఆయన అంకుల్ అని, సేలమ్‌లో ఆయిల్ మిల్ వుందని, వ్యాపారనిమిత్తం వస్తారని చెప్పింది. ఆయన వచ్చినప్పుడు శ్రీదేవి పనికి వెళ్ళదు.

"ఆయన చాల డబ్బు వున్న మనిషిలా వుంటాడు. శ్రీదేవికి టి. వి. చీరలు అవీ ఇవీ కొనియిస్తూ వుంటాడు" ఆమె చెప్పిందిట.

"కేరక్టర్ ఎటువంటిది?"

"మంచిదనే చెప్పాలి. మాకు తెలిసి యీ రెండేళ్ళల్లో ఆమె కోసం యువకు లెవ్వరూ రాలేదు. తన ఆఫీసు ఏమో' తన యిల్లేమో అన్నట్లు వుంటుంది. అటువంటి ఆమె మీద చెడు ఎలా చెప్పగలం."

"నిన్న ఆమెను ఎప్పుడు చూశారు?"

"మామూలుగా సాయంకాలమే వచ్చింది. నీరసంగా వుందని, వంట చేసుకోలేనని అన్నది. పాపం అనిపించి నాలుగు చపాతీలు కూడా యిచ్చాను. మొహమాటంగానే తీసుకుంది. మా ప్లేటు గిన్నె ఆమెవద్దే వుంది."

"ఎన్ని గంటల కిచ్చారు?"

"7 గంటలకు."

"ఆ తరువాత ఆమెను చూడలేదా?"

"లేదు."

"ఆమె కోసం ఎవరయినా వచ్చారా?"

"నిన్న ఆదివారం. టి. వి. లో సినిమా వస్తుంది. 6-30 నుంచి ఎవరు వచ్చారో, పోయారో కూడా తెలియదు. టి. వి. చూస్తూనే స్టవ్‌మీద చపాతీలు చేశాను కాబట్టి, ఆ నాలుగు యిచ్చి పంపించాను" అంది.

అంతకు మించి ఆమె వివరాలు తెలియలేదు.

చాలా జాగ్రత్తగా యిల్లంతా వెతికితే ఓ యాభై వేలు క్యాషూ, ఓ యాభై వేలు ఖరీదుచేసే బంగారు నగలు యింట్లో వున్నాయి.

ఆఫ్టరాల్ ఓ సేల్సుగరల్‌కి యింత డబ్బా!

ఆమె వెనుక తప్పక ఒక కథ వుండాలి.

3

టి. నగర్‌లోని లక్ష్మి కాస్మొటిక్సు షో రూమ్‌కి వెళ్ళారు.

"ఇక్కడ శ్రీదేవి అనే సేల్సు ఏజెంటు పనిచేస్తోందా?" తంగం ప్రశ్నించాడు.

పోలీస్ ఆఫీసర్ రాగానే వాళ్ళు భయపడి మొహా మొహాలు చూసుకున్నారు.

మళ్ళీ ప్రశ్నించిన తర్వాత— "చేస్తున్నారు సార్! యీరోజు యింకా రాలేదు" అంది ఒకామె.

"సార్! తమరు ఎందుకొచ్చారు?" మధ్యలో ఎవరో వచ్చి ప్రశ్నించారు.

"బహుశా ఆమె మర్డర్ చేయబడి వుంటుందని మా అనుమానం...."

"కెవ్వు" మన్నారు విన్న ఆడవారు.

అక్కడ చాలామంది స్త్రీలే పనిచేస్తున్నారు.

"ఆమె గూర్చి వివరాలు కావాలి మాకు" ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"సార్! మాకన్నా మా ఓనర్‌గారికే బాగా తెలుసు. వారిని అడగండి."

"ఆయన ఎక్కడ?"

"ఇంకా రాలేదు."

"సరే! మీకు తెలిసింది చెప్పండి."

అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ వుండి పోయారు.

"సమ్‌థింగ్" మనసులో అనుకున్నారు ఇనస్పెక్టర్ ద్వయం.

అందులో జాయింటు మేనేజరు అనే ముత్తుని బయటికి పిలిచి ప్రశ్నిస్తే కొన్ని నిజాలు తెలిశాయి.

ఓనర్ తిరునావ్‌కరుసుకి శ్రీదేవికి మధ్య ప్రేమ మూడు సంవత్సరాల క్రితం ప్రారంభం అయింది. అది ఓనర్ భార్యకి తెలిసి ఆవిడ రోజూ భర్తతో దెబ్బలాడుతూనే వున్నది.

ఆమెను నేను పెండ్లి చేసుకుంటాను ఏం చేసుకుంటావో చేసుకో అని ఆయన అన్నారట. ఆవిడ స్లీపింగ్ టాబ్‌లెట్సు మింగేసి, మొన్నటివరకూ నర్శింగ్‌హోమ్‌లో వుండి మొన్ననే యింటికి వెళ్ళింది.

శ్రీదేవి విషయంగా చాలగొడవలు రేగాయి ఆ కుటుంబంలో. ఏమైనాసరే ఆమెను నేను వదలనని ఓనరు తెగేసి చెప్పేశారట. అదీగాక అమె యిప్పుడు గర్భిణి అని విని కిడి. దానితో గొడవలు పరాకాష్టనందుకుంది.

ఓనర్ వచ్చే గురువారం ఆమెను కరుమారియమ్మ కోవెలలో పెండ్లి చేసుకోవడానికి నిశ్చయించారు.

ఇది వివరాలు.

ఓనర్ ఇంటి అడ్రసు తీసుకొని, ఆయన యింటికి బయలుదేరారు.

4

ఇంటిని చూడగానే తెలుస్తోంది ఆయన ఎంత గొప్ప ధనవంతుడో!

మద్రాసు టాటా, బిర్లా అని చెప్పవచ్చు. ఒక పట్టాన

క్రొత్తవారికి ప్రవేశం లభించదు.

పోలీసువారు కాబట్టి ఆ ఇబ్బంది లేదు.

పోలీసు అనగానే ఆయన ఆశ్చర్యపోతూ బయటికివచ్చి-

"రండి! నమస్కారం, మీ గురించి కుముదంలో ఆనందవికడంలో చదివాను. సంతోషం. మీకు నాతో ఏం పని వచ్చింది?" అడిగారు తిరునావుకరుసు.

"మీ కంపెనీలో పనిచేసే శ్రీదేవి అనే అమ్మాయి విషయంగా వచ్చాం—"ఇనస్పెక్టర్ అన్నారు.

ఆయన కనుబొమలు ముడిపడ్డాయి.

కొన్ని క్షణాల తరువాత-"విషయం ఏమిటో చెప్పండి" నెమ్మదిగా అన్నారు.

ఇప్పుడుఆయన మొహంలో దర్పంలేదు.దీనత్వంవుంది.

"శ్రీదేవి బెడ్‌రూమ్‌లో రక్తం వుంది. ఆమెగానీ, ఆమె శవంగానీ లేదు."

"ఆఁ....." ఆయన ఆర్తనాదం చేశారు.

మొహనికి చేతులు కప్పుకొని ఆయన రోదించసాగారు.

పనివారు హాలులో మూగారు. ఒక పనివాడి దగ్గరకి వెళ్ళి—"మీ అమ్మగారి గది ఎక్కడ?" అని అడిగారు. "రండి బాబూ, చూపిస్తాను" అని మేడమీదికి దారితీశాడు.

మంచం మీద రగ్గు కప్పుకొని ఓ నలభై పైపడి నావిడ పడుకొని వుంది.

సామాన్యమైన అందం.

మనిషి దీర్ఘవ్యాధిగ్రస్థురాలిగా వున్నది. శ్రీదేవి హత్య విషయం చెప్పగానే ఆమె మొహంలో ఒక రకమైన రిలీఫ్ కనబడింది. గాఢంగా తేలికపడ్డ హృదయంతో నిట్టూర్చింది.

సమాధానాలు ఆమె పెడసరంగానే చెప్పింది.

ఆ దంపతులకి ఒక్కడే కొడుకు. పేరు ఆనందు.

మెడికో స్టూడెంటు. వయస్సు ఇరవై మూడు వుంటుంది. తల్లిలానే అందమైన వ్యక్తి కాదు. అయితే వయస్సు, డబ్బు వలన ఆకర్షణీయంగానే వున్నాడు.

అతని గది క్రింద వుంది.

ఇనస్పెక్టరు ఆనందు గదిలోకి వెళ్ళేసరికి అందులో ముగ్గురు యువకులు వున్నారు.

ఇనస్పెక్టరుని చూడగానే ముగ్గురిలో కలవరంకలిగింది.

వాళ్ళ కలవరాన్ని ఇనస్పెక్టరు గ్రహించగలిగారు.

అందులో ఒక యువకుడు గదిదాటి పారిపోవడానికి ప్రయత్నించాడు.

తంగం పట్టుకున్నాడు.

బెడ్ రూమ్‌కి ఎటాచ్‌డ్ బాత్ రూమ్ వుంది.

బాత్ రూమ్‌లోని వాష్‌బేసిన్‌లో మెడికల్ స్టడీస్‌కి సంబంధించిన కత్తులు అవీ రక్తంతో తడిసి ఎండినవి నీళ్ళతో తడిసి వున్నవి.

మూడొంతులు రక్తంపోయిఎండినభాగాలు ఇంకా వుంది.

తంగం పైపుని మూసివేశాడు.

ఇనస్పెక్టరు ముగ్గురిని అరెస్టుచేసి,వ్యాను ఎక్కించాడు.

ఇది విని తిరునావుకరుసు భార్య లక్ష్మమ్మ 'కెవ్వున' కేకవేసి ప్రాణం పోగొట్టుకుంది.

అందరూ స్టేషనుకి వచ్చారు.

కుర్రవాళ్ళు ముగ్గురూ మాకేమీ తెలియదన్నారు.

పోలీసు మర్యాదచేసిన తరువాత ఆనందు ఇలాచెప్పాడు.

"మా అమ్మ స్లీపింగ్ టాబ్‌లెట్స్ మింగిన తరువాత నాకు యీ మేటర్ సీరియస్‌గా అనిపించింది. అంతకు ముందే నాన్నకూ శ్రీదేవికి కనెక్షను వున్నట్లు నాకు

తెలుసు. వాళ్ళిద్దరినీ చాలాసార్లు హోటళ్ళల్లో సినిమాలలో చూశాను. అప్పుడు అది నాకు తప్పుగా అనిపించలేదు.

కానీ....కానీ....మా అమ్మ కన్నీరుని చూడలేక పోయాను. ఏం చేస్తే నీకు తృప్తి అమ్మా అంటే—

'అది చస్తే నాకు తృప్తి' అని అంది.

నా ఫ్రెండ్సు ముందు యీ సమస్య పెడితే చంపేయడమే అని అన్నారు.

నిన్నరాత్రి మేము శ్రీదేవి యింటికి వెళ్ళాం.

టి. వి. చూస్తున్నది.

మమ్మల్ని చూసి తలుపు తీసింది.

లోనకి వెళ్ళి నోరు నొక్కి చంపి, ముక్కలు చేసి, మాతో తీసుకెళ్ళిన బాక్సులో సర్ది, సముద్రం మధ్యలో ఆ పెట్టెని విసిరేశాం—" అతను ఏడుస్తూ చెప్పాడు.

తంగం చాలా విచారంగా ఆ యువకుడివేపు చూశాడు.

తల్లికోసం అతని బంగారు జీవితాన్ని నాశనం చేసుకున్నాడు.

ఆనందు తండ్రి యీ విషాదాన్ని భరించలేక హార్టు ఎటాక్ తెచ్చుకుని హాస్పటల్‌పాలు అయ్యాడు.

అతని శృంగారం ఎంతపని చేసింది! ఇద్దరి పసివారి జీవితాలు నాశనం అయింది.

ప్రేమికురాలు అన్యాయంగా బలి అయింది!

ఒక్కగానొక్క కొడుకు జైలుపాలయ్యాడు!

భార్య మరణించింది.

దీనికంతా మూలం అయిన వ్యక్తి హాస్పటల్‌పాలు అయ్యాడు!!!

శ్రీదేవి శవం కోసం సముద్రంలో అన్వేషణ మొదలైంది. □

డుమ్మీ వేషగాడు

బుస్సా బాలచందర్

ట్రింగ్-ట్రింగ్-ట్రింగ్!!

ట్రింగ్-ట్రింగ్!!!

అదేపనిగా మ్రోగుతోంది టేబుల్‌మీద ఫోన్. డిటెక్టివ్ రచయిత జితేంద్ర అదేమీ వినిపించుకోవడంలేదు. దీక్షగా

రాసుకుపోతున్నాడు. టెలిఫోన్ గొంతు చించుకుంటోంది. జితేంద్రకి విసుగేసింది. ఎడంచేత్తో రిసీవర్ని తీసుకున్నాడు.

"ఎస్! జితేంద్ర హియర్-ఎవరు మీరు?" విసుగ్గా ప్రశ్నించాడు.

"నేను గురూ! ఆనంద్‌ని. మిమ్మల్ని డిస్టర్బ్ చేశానేమో క్షమించు గురూ!"

ఆనంద్ పేరు వినగానే జితేంద్ర గతుక్కుమన్నాడు. గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. శరీరం ఆపాదమస్తకం వణికింది.

"మొన్ననేగా మూడొందలు పట్టుకెళ్ళాడు! అప్పుడే తయారయ్యాడేమిటి? స్కౌండ్రల్! వీడిపీడ విరగడయ్యేలా లేదు. ఏ జన్మలో బాకీయో వీడికి. నిలబెట్టి వసూలు చేస్తున్నాడు" వెంటనే కోపం కూడా ముంచుకొచ్చింది.

"ఏమిటి బ్రదర్ విశేషం? అర్జంటుగా డబ్బు కావాలా??" వ్యంగ్యంగా ప్రశ్నించాడు. ఆ ప్రశ్నలో కోపం కూడా ధ్వనించింది.

"ఛ-ఛ! మరీ నన్నంత కర్కోటకుడిగా లెక్కెట్టకు గురూ! మొన్ననేగా పట్టుకెళ్ళింది-డబ్బుకాదు గురూ మీ ఫేవర్ కావాలి! మీ నవల 'బ్లూ బ్లాక్' పిక్చర్ తియ్యబోతున్నారటగా? ఆ పిక్చర్‌కి మాటలు కూడా తమరే రాస్తున్నారని విన్నాను."

"అవును, అయితే?!"

"అ నవల నేను చదివాను గురూ! అందులో ఆ బ్లాక్ మెయిలర్ పాత్రుంది చూశావూ-మార్వలెస్! పోర్షన్ చిన్నదయినా పాత్ర మెరికలాంటిది! మెరుపులా మెరిసి యిట్టే మాయమైపోతుంటాడు. నాకా వేషం వెయ్యాలని వుంది గుఘూ! తమరు రెకమండ్ చేస్తే నాకా పాత్ర తప్పకుండా

లభిస్తుంది. కాస్త పుణ్యంకట్టుకో గురూ! నీ మేలు జన్మలో మరువను-ప్లీజ్!"

స్కౌండ్రల్! అందితే జుట్టు! అందకపోతే కాళ్ళు! పాముకి పాలుపోసి పెంచినా, సమయం చూసి కాటెయ్యక మానదు. వీడికి చేసే సాయం మరో అనాథకుడికి చేస్తే పేరయినా చెప్పుకుంటాడు.

"నిజమే మిస్టర్ ఆనంద్! నీ వా పాత్రకి అన్నివిధాలా సరిపోతావు. నువ్వా పాత్రకు న్యాయం చేకూర్చగలవన్న నమ్మకం నాకు లేకపోలేదు. నిజం చెప్పాలిస్తే నువ్వా పాత్రలో జీవించగలవు. కానీ, పిక్చర్ తీస్తున్నది 'ది గ్రేట్ పాపారావ్'. పాపారావు గురించి నువ్వు వినే వుంటావ్. సినీఫీల్డులో ఆయన కెదురునిల్చే ధీరుడు లేడు. ఒక్క సినీఫీల్డులోనే కాదు, ఏ బిజినెస్ ఫీల్డులోనయినా ఆయనకు ఆయనే సాటి. ఆయన మాట కెదురులేదు. అలాంటి వ్యక్తికి సలహా యిచ్చేపాటి స్థోమత ఉందంటావా నాకు?"

"ఓ మైగాడ్! మిస్టర్ పాపారావుగారా మీ ప్రొడ్యూసరు? చచ్చాం ఫో! ఆయనగారి పలుకుబడి ఇటు రాష్ట్ర ప్రభుత్వంలోనే గాక, అటు కేంద్ర ప్రభుత్వందాకా వ్యాపించిందని విన్నాను. ఆయనగారు కనుక కాకితో కబురంపితే యిటు ముఖ్యమంత్రి నుండి, అటు కేంద్ర మంత్రులదాకా రెక్కలు కట్టుక వాలుతారట. అంత పలుకుబడీ, పరపతీ వున్న వ్యక్తి ముందు మనం ఏపాటి గురూ! ....కానీ....నువ్వా యూనిట్‌లో పని చేస్తున్నావు గనక, రచయితగా నీ కాయనతో బాగా పరిచయముంటుంది కనక. రెకమండేషన్‌లా కాకుండా, సమయం చూచి ఓ రిక్వెస్టు పడెయ్యొచ్చు. ఏమంటావు గురూ?"

"ఏమో! నాకు ధైర్యం చాలడం లేదు."

ఆనంద్ పకపక నవ్వాడు.

"నాకు తెలుసు గురూ! నువ్వెంత గొప్ప రచయిత వైనా లౌక్యం తెలీదు నీకు. గొప్పవాడితో పరిచయ మవ్వాలే గానీ, ఛాన్సు వదులుకుంటామా? అదను చూచి అమాంతం ముందుకి చొచ్చుకుపోవాలి! ఇలాంటివాళ్ళు తలుచుకుంటే ఏమైనా చెయ్యగలరు! నిక్షేపమైన వ్యక్తిని నిలువునా రూపుమాపాలన్నా, అనామకుడైనవాడ్ని అమాంతం అందలమెక్కించాలన్నా వీళ్ళకో లెక్క కాదు! అయినా ఇదంతా ఫోన్‌లో యెందుగ్గానీ....నువ్వు యింట్లోనే వుంటావుగా? యిప్పుడే బయలుదేరుతున్నా! నీతో ముఖా ముఖి మాట్లాడాలి. ఎక్కడికి చెక్కెయ్యకేం?" అంటూ రిసీవర్ని ఫోన్‌మీద పెట్టేశాడు.

అవతలివేపు ఫోన్ డిస్కనెక్టు కాగానే జితేంద్ర తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. రిసీవర్ని ఫోన్‌మీద పెట్టేసి సిగరెట్టు వెలిగించుకున్నాడు. గట్టిగా దమ్ము పీల్చి ఆలోచనల్లో పడ్డాడు. 'ఇలాంటి వాళ్ళు తలుచుకుంటే ఏమైనా చెయ్యగలరు' ఇంతక్రితం ఆనంద్ ఫోన్లో చెప్పిన మాటలు చెవుల్లో ధ్వనిస్తున్నాయి.

అతని బుర్రలో మెరుపులా మెరిసిందో ఆలోచన. అతని ముఖం సంతోషంలో విప్పారింది. తక్షణం డ్రాయరు తెరచి సరికొత్త లెటర్‌పాడ్ తీసి వ్రాయడాని కుపక్ర మించాడు.

2

తెలుగు సినీ ఫీల్డులో చిల్లర వేషగాడుగా స్థిరపడ్డాడు ఆనంద్. వేషాలద్వారా అతనికి లభించే డబ్బు అతని సరదాలకే చాలదు. అయినా అతడెప్పుడూ డబ్బుకి ఇబ్బంది

పడలేదు. అతని జల్సాలు చూచి వెనక అతనికేదో ఆస్తి వుందని భ్రమపడ్డ వాళ్ళు చాలామంది వున్నారు. అయినా అది నిజం కాదని చాలా కొద్ది మందికే తెలుసు.

ఆనంద్‌ది డైనమిక్ పర్సనాలిటీ! మాటల్లో ఎంతటి వాడ్నయినా బోల్తా కొట్టించగల చాకచక్యముంది. ఫీల్డులో పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్న వ్యక్తులందరితోనూ అతనికి పరిచయముంది. కొందరికి అత్యంత ఆప్తుడుగా కూడ మసలుకునేవాడు.

స్వతహాగా తెలివితేటలున్నవాడు కావడం మూలాన వారి వ్యక్తిగత జీవితంతో కూడా ప్రమేయం కల్పించుకుని, వారి రహస్యాలను తన గుప్పిట్లో దాచుకొని, అవి జాగ్రత్తగా కాపాడుతున్నందుకు వారి దగ్గర ఫీజుకూడా పుచ్చుకునేవాడు.

ఫీజు పుచ్చుకునే విషయంలో అతనికి చిన్నాపెద్దా తారతమ్యం లేదు. ఒకొక్కప్పుడు కఠినంగా ప్రవర్తించవలసి వచ్చినా వెనుకంజ వేసేవాడు కాదు. అంత నిక్కచ్చిగా వుండకపోతే తన వ్యాపారం సవ్యంగా సాగదని అతనికి బాగా తెలుసు.

వ్యాపార నిబంధనల్ని తూ. చ. తప్పకుండా పాటించ గలుగుతున్నాడు—కనుకనే డబ్బుకి ఇబ్బంది పడకుండా 'పూలపడవ'లా లాక్కుపోగలుగుతున్నాడు.

ఆనంద్ ప్రవర్తన బాగా వున్నవాడికి అంత కష్టంగా కనిపించకపోయినా వుండీ, లేకా ఓ మోస్తరు జీవితాన్ని గడిపే వ్యక్తులకి మాత్రం కంటకప్రాయంగానే వుండేది. ఆనంద్ పేరు వింటనే గుండెల్లో దడ పుట్టుకొచ్చేది. జితేంద్ర ఈ రెండవరకం వ్యక్తుల జాబితాలోకి వస్తాడు.

"మానవుడన్నవాడు ఎప్పుడో ఒకప్పుడు, తెలిసో తెలీకో

పొరబాట్లు చేస్తాడు. ఎప్పుడో చేసిన చిన్న పొరబాటుకి జీవితాంతం బాధపడాలా? ఈ శని విరగడయ్యే మార్గం లేదా?"—అని ఆలోచించేవాడు డిటెక్టివ్ రచయిత జితేంద్ర.

3

"లాభంలేదు మిస్టర్ ఆనంద్! నేనీ విషయంలో నీ కెలాంటి సాయమూ చెయ్యలేను. పాపాలావుగారి వ్యాపార దక్షతని గురించి నీకు తెలీకపోయినా వినే వుంటావు. ఇలాంటి విషయాల్లో ఆయన ఎవరి సలహాలు పాటించడు. అంతేకాదు రికమెండేషన్లు, రిక్వెస్టులు పనిచెయ్యవు!" అన్నాడు జితేంద్ర.

"అయితే నా ఆశ ఫలించే మార్గమే లేదంటావా?" ప్రశ్నించాడు నీరు గారిపోతూ.

జితేంద్ర అతని ప్రశ్నకి జవాబు చెప్పలేదు. రెండు సెకండ్లపాటు ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు.

"మార్గం లేదని నేననడంలేదు. నువ్వా పాత్రకి న్యాయం చేకూర్చగలవన్న నమ్మకం కలిగితే, ఒకరి ప్రమేయం లేకుండా ఆతడే నీకా వేషం యివ్వగలడు— అందుకు సందేహం లేదు."

"అదెలా సాధ్యం గురూ! నేనేమన్నా కేరెక్టర్ యాక్టర్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నవాడ్నా? అడపా దడపా 'టుమ్రీ' వేషాలు వేసేవాడ్ని. నేనా పాత్రకి న్యాయం చేకూర్చగలనో, లేదో ఆయన కెలా తెలుస్తుంది? ఆయనకా నమ్మకం కలిగించడమెలా?"

"మార్గం లేకపోలేదు మిస్టర్ ఆనంద్! నువ్వు నాకు ఫోన్ చేసినప్పటి నుండీ యిదే ఆలోచిస్తూ కూర్చున్నాను. నాకో ఆలోచన తట్టింది. అంతకంటే మార్గంలేదు."

"ఏమిటా ఆలోచన? చెప్పు గురూ! నువ్వేం చెబితే అది చేస్తాను. చివరికి బంగాళాఖాతంలో దూకమన్నా దూకుతాను" అన్నాడు ఆనంద్ ఉషారుగా.

"ప్రపథమంగా బ్లాక్ మెయిలర్, ఘరానా వ్యక్తిని కలుసుకున్నపుడు ఆ యిద్దరి మధ్య జరిగే సంభాషణను మొన్ననే రాశాను. ఆ సంభాషణల్ని ప్రొడ్యూసర్ పాపారావుగారికి వినిపించి, నిన్ననే ఓకే చేయించుకున్నానుకూడా. నువ్వా సంభాషణల్ని రాసుకుని 'మగప్' చెయ్యి. మాంచి మాడ్యులేషన్‌లో నీ నటనా చాతుర్యాన్ని జోడించి పాపారావు ముందు ప్రదర్శించు—నువ్వాయన్ని మెప్పించగలిగితే నీ పంట పండిందన్న మాటే."

"ఓకే గురూ! అలాగే!!" ఎగిరి గంతేశాడు అనంద్.

"మరో ముఖ్య విషయం—"

"చెప్పు గురూ!"

"నువ్వు వేషంకోసం వచ్చావన్న విషయం కనుక తెలిస్తే ఆయన నిన్ను గదిలోకికూడా రానివ్వడు. 'పర్సనల్' అని చెప్పి ప్రవేశం సంపాదించు! అదను చూచి నీ ప్రతిభను ప్రదర్శించు!! ఈ డైలాగులు ఒకసారి విన్నవి గనుక మొదట ఫలానా అని గుర్తించకపోయినా, తర్వాత తప్పకుండా గుర్తిస్తాడు. మూడ్‌లో పడితే నీ డైలాగులకి రెస్పాన్స్‌కూడా రావచ్చు ఆయన్నుండి, కంగారుపడకు! ప్రతిభ చూపి పబ్బంగడుపుకో."

"అలాగే గురూ! అలాగే!"

"నువ్విప్పుడు కలుసుకోబోతున్నది మామూలు ప్రొడ్యూసర్ను కాదు. పేరుకంటె భయంకరుడు పాపారావు. ఆయన చుట్టూ యమకింకరుల్లా పహిల్వానులు తిరుగుతుంటారు. నువ్వు జాగ్రత్తగా వ్యవహరించవలసి

వుంటుంది. పిట్ట పెద్దది గదా, వుచ్చులో పడితే హెచ్చుగా వసూలు చెయ్యొచ్చని, వెర్రిమొర్రి వేషాలు వేసేవు. జాగ్రత్త!''

పకపకా నవ్వాడు ఆనంద్.

''అదేమిటి గురూ, అనువుగానిచోట అధికుల మనరాదు! నాకా మాత్రం తెలీదా ఏమిటి?''

''దట్సాల్ రైట్! ఇక నువ్వీ సంభాషణల్ని నీ డైరీలో కాపీ చేసుకోవచ్చు. రేపు ఆదివారం కదూ సాయంత్రం ఆరు తర్వాత ఆఫీసులోనే వుంటాడు ఒంటరిగా. విజిటింగ్ కార్డు లోపలికి పంపి పర్మిషన్ వచ్చిన తర్వాత లోపలికి వెళ్ళు! విష్ యూ గుడ్ లక్!''

''థాంక్ యూ గురూ! థాంక్ యూ, నీ మేలు జన్మ జన్మకీ మరచిపోలేను గురూ!'' 'ఆనంద్ తన కృతజ్ఞతని తెలియపరచుకున్నాడు జితేంద్రకి.

డైలాగ్స్ కాపీ చేసుకుని, జితేంద్రవద్ద సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయాడు.

4

సాయంత్రం ఆరయింది.

కాంపౌండ్ గేటుదాటి, పూలమొక్కల మధ్యగా వెళుతోన్న తారురోడ్డుమీద పదినిమిషాలు ప్రయాణంచేసి, ఆవరణ మధ్య అందమైన భవనం ముందు పోర్టికోలో ఆగింది లాంబ్రెట్టా-లాంబ్రెట్టా మీంచి క్రిందికి దిగి, మెట్లెక్కి కారిడార్‌లోకి చేరుకున్నాడు ఆనంద్.

ఎదురొచ్చిన దర్వాన్ ఎటెన్షన్‌లో నిల్చుని సెల్యూట్ జేసి రిసెప్షనిస్ట్ గదికేసి చెయ్యి చూపాడు.

ఆనంద్ గది గుమ్మందాటి ఫ్లోర్‌మీద పరిచిన కార్పెట్ మీద కాలుపెట్టాడు. ఎదురుగా డెకోలమ్ టేబుల్ ప్రక్కన

ఆసిలేటింగ్ ఛైర్‌లో బైటాయించి ఏదో రాసుకుంటున్న అందాల దొరసాని తలెత్తి చూసి చిన్నగా నవ్వి, "ఎస్ ప్లీజ్" అంది కిన్నెర మీటినట్టు.

"ఐ వాంట్ టు మీట్ మిష్టర్ పాపారావ్" అన్నాడు ఆనంద్.

"ఈజిట్ అఫిషియల్."

"నో ప్రైవేట్."

అందాల దొరసాని గిరుక్కున టేబుల్‌కేసి తిరిగి, డ్రాయర్‌లోంచి ఓ స్లిప్ తీసి, పెన్సిల్ చేతికి తీసుకుంది.

"మే ఐ నో యువర్ నేమ్ ప్లీజ్!"

"ఆనంద్ బి.పి.!"

స్లిప్‌లో అతని పేరురాసి, దర్వాను చేతికిచ్చి, "ప్లీజ్ బీ సీటెడ్ యిన్ విజిటర్స్ రూమ్ టిల్ యూ గెట్ ఎ కాల్ ఫ్రం అవర్ బాస్" అంది అందాల దొరసాని ఎదురుగా వున్న విజిటర్స్ రూమ్‌కేసి చూపుతూ.

ఆనంద్ విజిటర్స్ గదికేసి నడిచాడు. సోఫాలో కూలబడ్డాడు. అందమైన ఆ గదినీ, క్రింద పరిచిన మఖుమల్ తివాసీని, విలువైన సోఫాలని, రౌంట్ టేబుల్ మీది ఫ్లవర్ వాజ్‌నీ, గోడలకి వ్రేలాడుతున్న విలువైన తైలవర్ణ చిత్రాలనీ చూస్తూ ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిపాడు.

"ఎస్, సార్, ఇక మీరు వెళ్లొచ్చు! మేడమీదికి లిఫ్ట్‌లో వెళ్ళండి!" అన్నాడు ఇంతక్రితం స్లిప్ తీసుకెళ్ళిన దర్వాను తిరిగివచ్చి.

ఆనంద్ సోఫాలోంచి లేచి దర్వాను చూపిన లిఫ్ట్‌కేసి నడవసాగాడు. అతడు లోపలికి చేరగానే లిఫ్ట్‌మాన్ బటన్ నొక్కాడు. లిఫ్ట్ తలుపులు మూసుకున్నాయ్. మూసుకున్న పదిసెకండ్లకి మళ్ళీ తెరుచుకున్నాయ్.

"ఎదురుగా కనిపిస్తున్నదే ఆఫీసురూమ్. అక్కడికి వెళ్ళండి" అన్నాడు లిఫ్టమాన్.

ఆనంద్ ఆఫీసురూములో అడుగుపెట్టాడు! ఎదురుగా కనిపించిన ఆబోతుల్లాంటి ఆసాముల్ని చూడగానే అతగాడి గుండెలు ఆగిపోయినయ్. ఆబోతుల్లాంటి ఆ ఇద్దరూ నోళ్లు కదపలేదు. లోపలి గదిముందు స్ప్రింగ్ డోర్స్‌కి అటూ ఇటూ బొమ్మల్లా తెరుచుకుని వున్నారు-కళ్ళార్పకుండా అతనికేసే చూస్తూ.

గదిమధ్య టేబుల్‌మందు కూచునివున్న సుందరాంగి "కమిన్ మిష్టర్ ఆనంద్! మీరు బాస్‌ని చూడవచ్చు-టాప్ ది డోర్ బిఫోర్ యూ ఎంటర్!" అంది చిర్నవ్వు చిందిస్తూ.

ఆనంద్ స్ప్రింగ్‌డోర్‌కేసి బయలుదేరాడు. గదిలో నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. అతని గుండె గుబగుబలాడుతోంది. అడుగులు తడబడుతున్నాయ్. ఎలాగో ద్వారం వద్దకి చేరుకున్నాడు. ద్వారాని కిరువేపులా నిల్చునివున్న భయంకరాకారాల కేసి చూడకుండా ద్వారంవద్ద నిల్చుని డోర్‌మీద మెల్లగా తట్టాడు ఊపిరి బిగబట్టి.

"ఎస్, కమిన్" లోపలి నుంచి వినిపించిందో గంభీరమైన కంఠం.

వెన్నెముకలోంచి పుట్టుకొచ్చింది చలి. ఎలాగో తమాయించుకున్నాడు. లోపలికి అడుగుపెట్టాడు.

ఎదురుగా టేబుల్‌ముందు, ఆరడుగుల నిండు విగ్రహం కూచుని వుంది. నల్లకోటూ, నల్లసూటూ తొడుక్కున్నాడు. తెల్లని చొక్కామీద ఎర్రని నెక్‌టై. గంభీరమైన కోల ముఖం, గుబురుగా పెరిగిన కనుబొమలు, మెలితిప్పిన మీసాలు. తల వొంచుకుని ఏవో కాగితాలు తిరిగేస్తున్నాడు.

విశాలమైన గదినీ, విలువైన ఫర్నిచర్ని చూస్తూ జారే

గుండెల్ని ఎగదోసుకుంటూ నిశ్చలంగా నిల్చుండిపోయాడు ఆనంద్.

"ప్లీజ్ సిడౌన్!" నిశ్శబ్దాన్ని బద్దలుచేస్తూ పలికిందా గంభీరస్వరం వొంచిన తల ఎత్తకుండానే.

ఆనంద్ కుర్చీలో కూలబడ్డాడు.

"ఎస్ మిష్టర్ ఆనంద్! ఎవరు మీరు? ఏం పనిమీద వచ్చారు?" తిరగేస్తున్న కాగితాల్లోంచి తలెత్తకుండానే ప్రశ్నించాడు పాపారావ్.

ఆనంద్ ధైర్యాన్ని కూడదీసుకున్నాడు. గొంతు సవరించుకున్నాడు. కుర్చీలోంచి లేచాడు.

"మిష్టర్ రావ్! నేనెవరో, ఏం పనిమీద ఇక్కడికి వచ్చానో చెప్పేముందు, కొంత ఉపోద్ఘాతం కూడా అవసరం, సావధానంగా వినండి".

పాపారావ్ ఆశ్చర్యంగా తలెత్తి ఆనంద్‌ను చూశాడు.

ఆనంద్ మరోసారి గొంతు సవరించుకున్నాడు.

"మీరు సంఘంలో గొప్ప వ్యక్తులుగా చలామణీ అవుతున్న మనుషులు. మీ యశశ్చంద్రికలు దశదిశలా వ్యాపించాయి, మీ గౌరవ ప్రతిష్టలు దేశమంతటా ప్రాకాయి! వ్యాపార సంస్థల్లోను, పాలక వర్గంలోను మీకున్న పలుకుబడి, పరపతి మరో ప్రాణికి లేదంటే అతిశయోక్తి కాదు. మీరు పట్టిందల్లా బంగారం, మీరు చెప్పింది వేదం, మీరు ఆడింది ఆట, మీరు ఎంతైనా సమర్థులు!

కాని ఈనాడు మీరు పొందుతున్న ఈ గౌరవ ప్రతిష్ఠలకి, పలుకుబడికీ, పరపతికీ వెనక—ఎన్ని అమానుషాలు, ఎన్ని అఘాయిత్యాలు దాగి వున్నాయో ఎవరికీ తెలీదు. మీ స్వార్థానికి ఎందరు బలి అయ్యారో మీ విలాసాలకి ఎందరు అబలలు ఆహుతయారో లోకానికి తెలీదు!"

"వాట్?!" పాపారావుకు దెబ్బతిన్న బెబ్బులిలా కళ్ళు ఎరుపెక్కాయి.

ఆనంద్‌లో హుషారు హెచ్చింది. 'తన డైలాగ్ డెలివరీ పాపారావులో చలనం కలిగించింది. గురుడు మూడ్‌లోకి వచ్చినట్టున్నాడు. టెంపో చెడకుండా లాక్కురావాలి' అనుకున్నాడు.

"ఎస్ మిస్టర్ రావు! ప్రతి గొప్పవాడి జీవితంలోను ఇలాంటి రహస్యాలు కోకొల్లలు! రహస్యాలు రహస్యంగా వున్నంత కాలం ఫరవాలేదు! రహస్యం బట్టబయిలయిందా అతగాడి పతనం ప్రారంభించిందన్నమాటే! అందుకనే ఎవరి రహస్యాలను వాళ్ళు జాగ్రత్తగా కాపాడుకోవాలి. నాకు మీ రహస్యాలు చాలా తెలుసు. మచ్చుకి ఒకటి వినిపించమంటారా?" జవాబుకోసం ఆగాడు ఆనంద్. అతని కళ్ళలోకి చూస్తూ.

"ఊఁ(....." మూలిగాడు పాపారావ్, కంటిమీద రెప్ప వాల్చకుండా అతనివేపే చూస్తూ.

ఆనంద్ కోటుజేబులోంచి సిగరెట్టుకేసు తీసి లైటర్‌తో సిగరెట్ వెలిగించుకున్నాడు. స్టైయిల్‌గా ఓ దమ్ము లాగి గాల్లోకి వదిలాడు. పక్కకి తిరిగి ఓ అడుగు ముందు కేశాడు. కుడికాలు టీపాయ్ మీద పెట్టి "చెబుతున్నా వినండి" అన్నాడు.

పాపారావ్ నిశ్చలంగా ఆనంద్‌వేపే చూస్తున్నాడు.

"ఇప్పటికి సరిగ్గా ఐదేళ్ళనాడు జరిగిన సంఘటన. ఆ రోజు మీ ఆఫీసు గదిలో కూచుని యేవో కాగితాలు తిరగేస్తుండగా, ఓ అందాల సుందరి మిమ్మల్ని కలుసుకోడానికొచ్చింది. ఆమె పేరు మాలతి.

మాలతికి పాతికేళ్ళుకూడా వుండవు. మహాశిల్పి చెక్కిన

దంతపు బొమ్మలా వుంటుంది. ఉద్యోగంకోసం మిమ్మల్ని ఆశ్రయించింది. ఆమె అందం చూచి మీరు ముగ్ధులై పోయారు. ఆమె అవివాహిత అనీ, అనాథశరణాలయంలో పెరిగిందనీ తెలీగానే ఆమెమీద కాంక్ష పెరిగింది. ఎలా గయినా ఆమెను అనుభవించాలన్న కోరిక విజృం భించింది.

తప్పకుండా సహాయం చేస్తానని మరుసటి ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు బంగళాలో కలుసుకోవలసిం దనీ చెప్పారు. పాపం ఆ అభాగ్యురాలు తన అదృష్టానికి మురిసిపోతూ థాంక్స్ చెప్పి వెళ్ళిపోయింది—మరుసటి ఆదివారం సరిగ్గా ఆరుగంటలకు చక్కగా అలంకరించు కొని తయారయింది మాలతి.

మీ రామెను ఆహ్వానించి ఆదరించారు. టీకి పిలిచి కబుర్లు చెబుతూ మీ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కాని ఆమె అందుకు ఒప్పుకోలేదు. 'మీరు నా తండ్రిలాంటి వారు ఇలాంటి కోరికను కోరడం భావ్యం కాదు' అని బ్రతిమి లాడింది. కాని మీరు ఒప్పుకోలేదు. ఆమెను బలవంతం చెయ్యబోయారు. ఆమె మీ ముంజేతిని కొరికి తప్పించుకు పారిపోవడానికి ప్రయత్నించింది.

వెంటనే మీరు మీ ప్లేటు ఫిరాయించారు. లేని నవ్వు తెచ్చుకున్నారు—'నీ శీలాన్ని పరీక్షించేందుకు యిలా చేశాను. నిజానికి నువ్వంటే నా కలాంటి అభిప్రాయం లేదు—భయపడకు!' అని ఓదార్చారు.

"రేపు ఉదయం పదింటికల్లా నన్ను ఆఫీసులో కలు సుకో, నీ పని చేసిపెడతా' నని వాగ్దానం చేశారు.

ఆ రాత్రే ఆమె అపహరింపబడింది, మీ విశ్రాంతి భవనంలో హాజరు చెయ్యబడింది. మీ రామెను నగ్నంగా

అనుభవించారు—ఆమె అవయవాలతో ఆడుకున్నారు. రహస్యం బయటపడుతుందేమో నన్న భయంతో ఆమె నోటిని శాశ్వతంగా నొక్కేశారు.

అంతే—ఆమె జాడలేదు. వారం రోజుల తర్వాత సముద్రపు ఒడ్డున చిరిగిన ఆమె జాకెట్టూ, రక్తపు మరకలతో నిండిన లంగా మాత్రం పోలీసుల చేజిక్కింది. కాని ప్రయోజనం? ఆమెకోసం పోలీసులు ఇంకా గాలిస్తూనే వున్నారు. మీ మంజేతిమీద ఆమె మిగిల్చిపోయిన పళ్ళ గాట్లు మాత్రం పోలేదు."

"యూ స్కౌండ్రల్!" కోటు జేబులోంచి రివాల్వర్ పైకి తీశాడు. పళ్ళు పటపట లాడించాడు. కళ్ళలోంచి నిప్పుకణాలు కురిపించాడు పాపారావ్. వెంటనే ఆనంద్ బిగ్గరగా వికటాట్టహాసం చేశాడు.

"మిస్టర్ రావ్! మీరు నన్నేమీ చెయ్యలేరు! మీ బెదిరింపులకి నేను లొంగను—కాని, ఒక విషయం వినండి, నేను మీ రహస్యాన్ని బైటపెట్టి మిమ్మల్ని పోలీసులకి అప్పగించడానికి రాలేదు. మీ యీ రహస్యాన్ని భద్రంగా నా గుప్పిట్లో దాచివుంచినందుకు, బహుమానం పుచ్చుకునేందుకు నేనిక్కడికి వచ్చాను. నా బహుమానం నాకిచ్చి పంపుతారో, అనవసరంగా పోలీసుల చేజిక్కుతారో తేల్చుకోండి" అన్నాడు.

"ముందు మీ బహుమానం పుచ్చుకోండి మిస్టర్ ఆనంద్ పోలీసుల సంగతి తర్వాత ఆలోచిద్దాం" అంటూ పాపారావ్ తన రివాల్వర్ని ఆనంద్ గుండెలకి గురిపెట్టాడు.

బొటనవ్రేలు ట్రిగ్గర్‌ని గట్టిగా నొక్కింది.

ఆనంద్ గజగజలాడిపోయాడు. ఏదో చెప్పబోయేంత లోనే సైలెన్సర్ ఫిక్స్‌చేసిన రివాల్వర్‌లోంచి బైటకొచ్చిన బుల్లెట్ ఆనంద్ గుండెల్లోంచి సర్రున దూసుకుపోయింది. ఆనంద్ నేలకూలాడు.

అతని కళ్ళల్లోంచి తొంగిచూసిన ఆశ్చర్యం అనంతంగా వుండిపోయింది.

5

అనంద్ ఫోన్ చేస్తాడేమోనని ఆ రాత్రంతా ఎదురు చూశాడు జితేంద్ర. కాని అతన్నుండి ఫోన్‌కాల్ రాలేదు. మరుసటి రోజంతా గదిలోంచి ఎక్కడికి పోకుండా ఫోన్ కాల్‌కోసం ఎదురు చూస్తూ గడిపాడు. కానీ ప్రయోజనం కనపించలేదు.

ఆనంద్‌కి వేషమే కనుక లభించివుంటే తనకు తప్ప కుండా ఫోన్‌చేశేవాడు. కనీసం అతడు పాపారావు గది లోంచి ప్రాణాలతో బయటపడివుంటే తనను తప్పకుండా కలుసుకునే వాడు.

అతడు తనకు ఫోన్ చెయ్యలేదు. కనీసం స్వయంగా నయినా కలుసుకోలేదు. అంటే అర్థం ఏమిటి? అతడు పాపారావు గదిలోంచి ప్రాణాలతో బయటపడలేదన్న మాట—తాను విసిరిన పాచిక పని చేసినందుకు సంతోషిం చాడు. ఈ పీడ ఇంతటితో నయినా విరుగుడైనందుకు తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

"స్కౌండ్రల్! నిప్పుతో చెలగాట మాడుతాడా?" తృప్తిగా నవ్వుకున్నాడు డిటెక్టివ్ రచయిత జితేంద్ర. □

హంతకుడొస్తాడు జాగ్రత్త!

ఎమ్.వి.వి. సత్యనారాయణ

"లాభం లేదు. ప్రారంభోత్సవం జరగాల్సిందే!"

అన్నాడు పురపాలకశాఖ మంత్రి. ఆయన గొంతులో పట్టుదల కనిపిస్తోంది.

ముఖ్య కార్యదర్శి ఆయనవైపు గాభరాగా చూశాడు.

"అవునోయ్ కాంతారావూ! వాడు ఎవడో కరపత్రం

వేసినంత మాత్రాన మనం....మనం....” పళ్ళు గిట్ట కరి చాడు మంత్రి భుజంగం.

“నా వుద్దేశ్యంలో ప్రారంభోత్సవం ఆగదు సార్! వాయిదావేసి....” ఆగాడు ముఖ్య కార్యదర్శి కాంతారావు.

“వాయిదా వేస్తామా? లక్షలు ఖర్చుపెట్టి భవంతి కట్టించాం. ఇప్పుడు మనంకూడా బోలేడు ఖర్చుపెట్టి రాజ ధాని నుండి వచ్చాం. ప్రజల సొమ్ము ఎంత వృధా? ఈ ఖర్చు అంతా ఒక బోడివెధవ వేసిన బోడి కరపత్రానికి...” వణుకుతున్నాడు మంత్రి.

“సార్....మీకు అసలే బ్లడ్ ప్రెషర్....”

మంత్రి నిభాయించుకున్నాడు. టీపాయ్‌మీద వున్న పాకెట్లోంచి ఒక మాత్ర తీసి నోట్లో వేసుకున్నాడు.

బంట్రోతు చటుక్కున పరుగెత్తుకు వచ్చాడు. మంత్రికి మంచినీళ్ళు అందించాడు.

ముఖ్య కార్యదర్శి కాంతారావు పదహారోసారి కరపత్రం లోకి చూశాడు.

“పైకి చదవ్వోయ్ కాంతారావ్!” అన్నాడు మంత్రి భుజంగం.

కాంతారావు చదవసాగాడు.

“ఒరేమ్ భుజంగం!

నువు పదవిలోకి వచ్చాక చేసిన దురంతాలు అన్నీ యిన్నీ కావు. నువు పురపాలక సంఘభవనానికి ప్రారం భోత్సవం చేయడానికి రాష్ట్ర రాజధానినుండి పరుగెత్తు కొచ్చావు. భవన నిర్మాణంలో నువు లక్షలు మ్రింగావు.

నువు అయిదేళ్ళ క్రితం మామూలు సర్పంచ్‌వి. ఈ నాడు పోర్ట్‌ఫోలియో వున్న మంత్రిగా ఎదిగావు. నువు పుట్టి పెరిగిన నగరాలకే వచ్చావు. నువు ఎంతమంది

శవాలను మెట్లుగా వాడావో నాకు తెలుసు.

నిన్ను రేపు చంపుతాను.

నీకు వేట అంటే యిష్టం కదూ! మనుషుల వేట!

—నీ గుండెల్లో బల్లెం"

భుజంగం మొహం ఎఱ్ఱబడింది.

"ఈ వేళే ప్రారంభోత్సవం. అంటే కరపత్రాలు నిన్ననే పంచిపెట్టాడన్నమాట!" అన్నాడు.

కాంతారావు తలూపాడు.

"వేట అంటాడు కరపత్రంలో. సార్! తుపాకీని వాడతాడంటారా?" అన్నాడు కాంతారావు.

భుజంగం జవాబు చెప్పబోయాడు.

గది తలుపు తెరచుకుని విశ్వాసరావు వచ్చాడు.

వస్తోనే, "బావా....రక్షణ ఏర్పాట్లు చురుకుగా జరుగుతోన్నాయి. నువు ప్రారంభోత్సవం చేయబోయే భవనానికి చుట్టూ ఆమడ దూరంలో పోలీస్ బందోబస్తు చేశారు. సి.ఆర్.పి. దళాలూ, పోలీసులూ నేలయీనినట్టు వున్నారనుకో...." అన్నాడు విశ్వాసరావు.

భుజంగం మొహం తేరుకున్నది. అయినా పైకి భావ ప్రకటన చేయకుండా జాగ్రత్తపడ్డాడు.

సహకార్యదర్శి సారంగధరం మంత్రిని సమీపించాడు. ఫైలు విప్పి అతడిముందు బెట్టాడు.

"ఏమిటివి?" అడిగాడు భుజంగం.

"భూములు కావాలని పేదలు పెట్టుకున్న అర్జీలు సార్!" అన్నాడు సారంగధరం.

భుజంగం తన చేతిని గాల్లో ఆడించి, "తర్వాత పెట్టు" అన్నాడు.

సారంగధరం వెళ్ళిపోయాడు.

అటు తర్వాత పోలీస్ అధికారులు ఒక్కొరొక్కరే రాసాగారు.

"మీరు టాప్‌లెస్ కారులో ప్రయాణించవద్దు సార్!" అన్నాడు డి.ఐ.జి.

"నా ప్రజలను చూచుకోవద్దా?" అడిగాడు భుజంగం.

పోలీసు అధికారులు మొహాలు చూసుకున్నారు.

చివరకు టాపులేని కారులో భుజంగం బయలుదేర డానికి ఏర్పాటయింది.

"ఆల్‌రైట్! నా ప్రజలు ఏమయిపోతారు? నేనంటూ వుండాలికదా?" అన్నాడు భుజంగం.

అప్పుడు అతడితోబాటు విశ్వాసరావు ఒక్కడే వున్నాడు.

"బావా ప్రతిపక్షం నాయకుడు వేశాడేమో కర పత్రం?" అన్నాడు విశ్వాసరావు.

"నా అనుమానం కూడా అదే!" అన్నాడు భుజంగం.

"కాని వాడు ప్రస్తుతం రాష్ట్రింలో లేడు."

"లేకపోతే ఏం? ఇదే అదనుగా ఎవడినో నియోగించి వుంటాడు."

"వాడు ఎవడినీ నమ్మడు బావా!"

భుజంగం చిరాకుగా చూసాడు. "అన్ని మాటలూ నువ్వే చెబుతావ్."

విశ్వాసరావు మొహం మాడ్చుకున్నాడు.

ఐ.జి. ఆఫ్ పోలీస్ గదిలోకి వచ్చాడు.

"ప్రయాణానికి సిద్ధం సార్!" అన్నాడు ఐ.జి.

భుజంగం లేచాడు. బట్టలు సర్దుకున్నాడు. కండువా సర్దుకున్నాడు. బయటికి కదిలాడు.

బయట రోడ్డుమీద నేల యీనినట్టు పోలీసులు! జనం కంటె పోలీసులే ఎక్కువ.

భుజంగం తృప్తిగా కారు ఎక్కాడు.

కారు చుట్టూ స్టీల్ షట్టర్స్. కారు కదిలింది. దానికి ముందూ వెనకా కార్లూ, పోలీసు జీపులూ వూరేగింపులాగా బయలుదేరాయి.

కొత్తగా కట్టిన పురపాలక సంఘ భవనం ముందు కార్లు ఆగాయి.

భుజంగం కారు దిగాడు. భుజంగంచుట్టూ అతడి మంత్రివర్గం ఆఫీసులోని వున్నతాధికారులు చుట్టుముట్టారు.

పురపాలకసంఘ భవనం సున్నం రంగులు వేసి వుంది. తాళ్ళుకట్టి కాగితం జెండాలు అంటించారు.

సింహద్వారానికి పూలదండ కట్టారు. దాని కిందుగా ఎర్రటి రిబ్బన్ కట్టారు.

భుజంగం మందీ మార్బలంతోపాటు మెట్లు ఎక్కాడు.

అతడి వెనుకగా ముఖ్యకార్యదర్శి కాంతారావు అతడి ప్రక్కగా పోలీసు వున్నతాధికారులూ, నగరప్రముఖులూ మెట్లు ఎక్కుతోన్నారు.

"సారంగధరం అర్జీలు తెస్తున్నాడా?" అడిగాడు భుజంగం.

ఫ్లాష్‌లైట్లు వెలుగుతున్నాయి.

కాంతారావు తలూపాడు. ఫోటోలలో ముఖభంగిమల కోసం మంత్రి అడుగుతున్నాడు. ఆ విషయం తనకి తెలుసు.

సారంగధరం రాక ఏం చేస్తాడు? అర్జీలు తీసుకురాక ఏమైపోతాడు?

భుజంగం మెట్లు ఎక్కుతోనే పోలీసు అధికారులతో ముచ్చటిస్తున్నాడు. రేపు పత్రికలలో రకరకాల పోజులు! అన్నీ తనవే!

ఎక్కడో ఢాం మన్నది.

పోలీసులు కళవెళపడిపోయారు.

మంత్రి నడుస్తోన్న మెట్లమీద ఎవరో దభ్భున పడిపోయారు.

కాంతారావు మెట్లమీద గిలగిల కొట్టుకుంటున్నాడు. గుండెప్రాంతంలో తూటుపడింది. రక్తం విరజిమ్ముతోంది.

మెట్లమీద రక్తం ప్రవహిస్తోంది.

పోలీసులు నాలుగు ప్రక్కలకూ పరుగెత్తారు.

ఐ. జి. అరిచాడు.

"ఈ చుట్టుప్రక్కల భవనాలు వెతకండి. ఎవడో టెలిస్కోపిక్ రైఫిల్‌తో.... వెతకిండి. పరుగులు పెట్టండి!"

భుజంగం కళ్ళు తిరిగాయి. మెట్లమీదకు వాలిపోయాడు.

ఎవరో పట్టుకున్నారు.

చుట్టుప్రక్కల భవనాలు వెతుకుతోన్నారు పోలీసులు.

2

"ఈ భవనంలో ఎవడూ లేడు" సారంగధరం అరుస్తూ బయటికి వచ్చాడు. ఆ భవనం వెతికారు పోలీసులు.

భవనంలో చాల గదులున్నాయి. ఆ గదులన్నీ ఖాళీగానే వున్నాయి. పైగది కిటికీవద్ద నిలబడ్డారు పోలీసులు. అక్కడనుండి కాంతారావ్ స్పష్టంగా కనిపిస్తున్నాడు.

మెట్లవద్ద అంబులెన్స్ ఆగింది.

క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ ఆ భవనం కిటికీ నుండి చుట్టూ చూసాడు.

"ఈ భవనంలోంచి కాల్చి వుండాలి. కాంతారావుకు కుడివైపు ఛాతీలో దిగబడింది తూటా" అన్నాడు కుమార్.

"అవునుసార్! ఈ భవనంకంటె వీలున్న భవనం

ఏటు లేదు" అన్నాడు సార్జెంట్.

కుమార్ చుట్టుప్రక్కల చూశాడు.

ఐ. జి. ఆఫ్ పోలీస్ ఆ భవనంలోకే వస్తున్నాడు. పోలీసులు యితరులను ఆ భవనంలోకి రాకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఐ. జి. కిటికీవద్దకు వచ్చాడు.

"హంతకుడు ఈ యింట్లోనే వేచివున్నాడు. గ్యారంటీ! వెతకండి!" అరిచాడు ఐ.జి.

భవనంలో ఎవరూ కనిపించలేదు.

భవనంచుట్టూ ఆవరణ. భవనం వెనుకప్రక్క నూయి. నూతిలో నీరు ప్రశాంతంగా వున్నాయి. నూతి పళ్ళెంమీద బకెట్టు వుంది.

3

టెలిఫోన్ గణగణలాడింది.

క్రైంబ్రాంచ్ యిన్స్పెక్టర్ కుమార్ రిసీవర్ ఎత్తాడు.

పురపాలకసంఘం కొత్తభవనం కట్టిన వెనక వీథిలో ఒక శవం కనిపించిందట. డ్రయినేజికి అడ్డం పడిందట.

కుమార్ తన సిబ్బందితో బయలుదేరాడు.

డ్రయినేజిలో దొరికిన శవం ముసలతడిది. ఎవరో పీక పిసికి చంపారు. శవం బాగా శిథిలమైన స్థితిలో వుంది.

శవం తాలూకు ఫోటోలు పోలీస్ స్టేషన్‌లో ప్రదర్శించారు. ఎవరూ ముందుకు రాలేదు.

శవం గుర్తు తెలియకుండా పోయింది.

4

"మీరు నా ప్రాణం కాపాడాలి." అన్నాడు భుజంగం.

డిటెక్టివ్ శిరీష్ పురపాలకశాఖామంత్రివైపు చూశాడు. మంత్రిలాంటి ముఖ్యుడికే ఈ దేశంలో భద్రత లేదు.

సామాన్యుడి గతి ఏం కావాలి?

"పూర్తిగా చెప్పండి!" అన్నాడు శిరీష్.

భుజంగం తనకి కరపత్రం అందించింది లగాయితూ కాంతారావు తుపాకీ తూటాకి బలయిపోయిన వరకూ చెప్పాడు.

"అంటే ఆ తూటా మీకు తగలవలసిందేనన్నమాట!"

"అవును."

"పత్రికలలో టెలిస్కోపిక్ గన్ వుపయోగించినట్లు వార్తలు వచ్చాయి."

"అవును. గురి తప్పకూడదని టెలిస్కోప్ ఏర్పాటు చేసుకుని వుంటాడు."

"కాని టెలిస్కోప్ ఏర్పాటు వున్న తుపాకీ గురి తప్పే వీలులేదు."

"అంటే?"

"నిజంగా ఆ తూటా కాంతారావుకు గురి పెట్టిందేమో...."

భుజంగం చిరాకుగా చూశాడు.

చనిపోయిన కాంతారావు గురించి చర్చ యెందుకు? తన ప్రాణాలకు ముప్పు ముంచుకు రానున్నట్టు ఈ డిటెక్టివ్ ఒప్పుకోడేం?

"ఆల్‌రైట్! అలాగే అనుకుందాం! నామీద కరపత్రం వేశారు!"

"కేసును అన్ని కోణాల్లోంచీ ఆలోచించాలని అలా అన్నాను."

"నామీద ఎవరికి కక్ష వున్నదో మీరు పరిశోధించాలి!"

"ఆ విషయం నా కంటె మీకే యెక్కువ తెలి

యాలి....''

''నాకు తెలిసి శత్రువులు లేరు.''

''రాజకీయ వ్యక్తులకు శత్రువులు లేకపోవడం విచిత్రం!''

''నిజం! నమ్మండి! సొంతడబ్బా కాదు! నేను అజాత శత్రువును. ప్రతిపక్షాలవాళ్ళు కూడా నన్ను గౌరవంగా చూస్తారు.''

కళ్ళ కొసలనుండి శిరీష్ ఆయనను పరిశీలించాడు.

ప్రాణాలమీదకు వచ్చినప్పటికీ రాజకీయాల వాళ్ళు గోతాలు మానరు!

''మీ శాఖ మీదకు తరచుగా దాడి చేసే రామ చంద్రం....''

''ఆయనా! ప్రతిపక్షంలో వున్నాడు కాబట్టి అలాగే అంటూంటాడు. నా ప్రాణాలు తీసే కసి ఆయనకి లేదు!''

''మీమీద అచ్చువేసిన కరపత్రం వుందా?''

భుజంగం జేబులోంచి పదిలంగా దాచుకున్న కరపత్రం తీసి యిచ్చాడు.

శిరీష్ చదువుకున్నాడు.

''భవన నిర్మాణంలో లక్షలు మింగినట్టు అభియోగం వుంది....'' అర్థోక్తిగా ఆగాడు శిరీష్.

భుజంగం దీనంగా నవ్వాడు.

''అయిదులక్షలు ఎస్టిమేట్.ఆ భవనంలో నాకేం మిగులు తుంది?''

శిరీష్ భారంగా కదిలాడు.

''పురపాలక సంఘభవనానికి ఎడంప్రక్కగా వున్న భవనంలోంచే తుపాకీ పేలింది. ఆ విషయం పోలీస్ అధి రులు ధృవపరిచారు. ఆ సమయంలో ఆ భవనంలో యెవ

రున్నారో, ఆ భవనం ఎవరిదో ఆరా తీయండి! హంతకుడు దొరుకుతాడు."

"అలా దొరికేటట్టుంటే హంతకుడు ఈపాటికే పోలీసుల అతిథిగా వుండేవాడు!"

"ఆల్ రైట్! మీ ఇష్టం! నా ప్రాణాలు కాపాడండి! చాలు!"

"వివరాలడుగుతాను. కోపం తెచ్చుకోవద్దు!" శిరీష్ ముందుకు వాలాడు.

"మీది మొదటినుండీ ఈ ఊరేకదా?"

"అవును!"

"ఈ వూళ్ళో సొంతయిల్లు వుందా?"

"లేదు. అమ్మేశాను!"

"అడ్రసు చెప్పండి!"

భుజంగం అడ్రసు చెప్పాడు. శిరీష్ నోట్ చేసుకున్నాడు.

"ఇంకేమైనా వివరాలు కావాలా?" అడిగాడు భుజంగం.

"అవసరం వచ్చినపుడు అడుగుతాను!"

"మీ ఫీజు?" భుజంగం చెక్కు బుక్ తీశాడు.

౯

"ముసలతడి శవం గుర్తు దొరికిందా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"అతడి మరణంలో నీకు యింటరెస్ట్ ఏమిటి?" అడిగాడు క్రైంబ్రాంచ్ ఇనస్పెక్టర్ కుమార్.

భుజంగం తనవద్దకు వచ్చిన విషయం చెప్పుకువచ్చాడు శిరీష్.

కుమార్ తలూపి, "ముసలతడి శవం గుర్తుపట్టడానికి ఒక్కడూ రాలేదు!" అన్నాడు.

"తుపాకీ పేలిన భవనం ఎవరిది?"

"ఆశ్చర్యం! ఆ ఇంటి యజమాని శంకరయ్య. అతడు ఏమయాడో ఎవరికీ తెలియదట!"

"ఎంత కాలం క్రితం శంకరయ్యను చూశారట?"

"ఇరుగుపొరుగు వాళ్ళకు అతడు కనిపించి వారం అయిందట!"

"మనకు దొరికిన శవం శంకరయ్యదేమో!"

కుమార్ కళ్ళెగరేశాడు "ఆ విషయం నాకు తోచనే లేదు!"

"శవం ఫోటో తీయించు. దానితోపాటు మనం చుట్టు ప్రక్కల యిళ్ళలో దర్యాప్తు చేద్దాం."

"మా పోలీసులకు వాళ్ళు అసలు సహకరించడంలేదు."

"మీరు కోర్టులవెంట త్రిప్పుతారు. అదీ భయం!"

కుమార్ నవ్వి లేచాడు.

ఇద్దరూ జీపులో తయలుదేరారు.

ఖాళీగావున్న భవనంలో ప్రవేశించారు. ఇల్లు బోసిగా వుంది.

ఇద్దరూ భవనంలోంచి బయటపడ్డారు. ఆ యింటి చుట్టు ప్రక్కల చనిపోయిన ముసలతడి ఫోటోతో దర్యాప్తు చేశారు.

ఆ శవం శంకరయ్యదే!

అయితే సాక్ష్యం యిచ్చిన వాళ్ళు తమపేరు బయటికి రానివ్వవద్దని కోరారు.

"శంకరయ్య తన ఇంటిని ఎవరికయినా అద్దెకు ఇచ్చాడా?" అన్నాడు శిరీష్.

జవాబు దొరకలేదు.

తిరిగి భవంతిలోకి రాబోయారు.

గుమ్మంలోనే పోలీసులు ఎదురయ్యారు. సి.ఆర్.పి.

దళం సారంగధరం ఆధ్వర్యంలో భవనం సీలువేస్తున్నారు.

"ఏమిటిది?" అడిగాడు కుమార్.

"మంత్రి భుజంగంగారి ఆజ్ఞ" అన్నాడు సారంగధరం.

"ఎందుకు?"

"పురపాలక సంఘభవనంలో యింకా వారి కార్య క్రమం పూర్తి కాలేదట!"

"అయితే?"

"మరల ఎవడయినా కాల్పులు జరిపితేనో....?"

శిరీష్ తల పంకించాడు.

6

"నువ్వు చెప్పినట్టే ఆ భవంతి వెనుక వున్న నూతిని వెతికించాను రహస్యంగా నా వృత్తిధర్మానికి విరుద్ధంగా. టెలిస్కోపిక్ గన్ దొరికింది. త్రాడుకట్టి నూతిలోపల గోడనుండి నీటిలో మునిగివుంది."

"వెరీగుడ్. నెంబర్ నోట్ చేసుకున్నావా?"

"ఆఁ! టెలెక్స్‌లో వార్త పంపించాను. ఆయుధాల శాఖ నుండి మనకి టెలిగ్రాం వస్తుంది!"

"టెలిస్కోపిక్ గన్‌ని ఏం చేశావు?"

"నువ్వు చెప్పినట్టే నూతిలోకి జారవిడిచాను. ఇద్దరు కానిస్టేబుల్సును పది అడుగుల దూరంలో ఆ ఇంటి మీద నిఘాగా పెట్టాను."

"గుడ్ ..."

"కాంతారావు గురించి సి.ఐ.డి. రిపోర్ట్ వచ్చిందా?"

"వచ్చింది" కుమార్ ఫైలు తీసి అందించాడు.

కాంతారావు జూనియర్ ఐ.ఏ.ఎస్. అయినప్పటికీ అతడు ముఖ్య కార్యదర్శి! ఐదేళ్ళ క్రితం భుజంగం ఇంటి ప్రక్క ఇంట్లో అద్దెకు వుండేవాడు. అప్పుడు భుజంగం

భార్యతో అతనికి సంబంధం వుండేదని వినికిడి.

శిరీష్ నుదురు చిట్లించాడు.

కుమార్‌కి సూచనలివ్వసాగాడు.

"టెలిగ్రాం సార్!" అన్నాడు మెసెంజర్.

కుమార్ టెలిగ్రాం అందుకున్నాడు.

"టెలిస్కోపిక్ గన్ కాంతారావు పేరన తీసుకో బడింది!"

"ఊహించాను!"

"ఎలా?"

"చెబుతాను. కాంతారావు జూనియర్ ఐ.ఏ.ఎస్.ఆఫీసర్ అయినప్పటికీ ముఖ్యకార్యదర్శి అయ్యాడు. అతడికంటె సీనియర్ ఐ ఏ.ఎస్. ఆఫీసర్లు ఆఫీసులో వున్నారు...."

"కాని....?"

"నీ అనుమానం నాకు తెలుసు. కాంతారావును భుజంగం ముఖ్యకార్యదర్శిగా ఎలా చేశాడనే కదా?"

"అవును. సీనియర్స్ వుండగా...."

"భుజంగం మంత్రిగాకముందు అతడి ఇంటి ప్రక్కగా కాంతారావు ఉండేవాడు. కాంతారావుకు భుజంగం భార్యతో అక్రమ సంబంధం వుండేది. కాంతారావు తన లోపాన్ని ఒక ఆయుధంగా మలుచుకున్నాడు. రహస్యం బయట పడ కుండా చేయాలంటే తనను ముఖ్య కార్యదర్శిని చేయమని వుంటాడు."

"హత్య చేసింది ఎవరంటావ్?"

"ప్రీప్లాన్డ్ మర్డర్! నువ్వు నీ బలగంతో శంకరయ్య భవనంవద్ద కాచుకో! హంతకుడు రావచ్చును."

కుమార్ అర్థంకానట్టు చూశాడు.

"భుజంగం ఈ రోజు సాయంకాలం ఫ్లైట్‌లో రాష్ట్ర

రాజధాని వెళ్తాడు."

"అయితే....!"

"అతడి బృందంలో వున్నవాడే హత్య చేశాడు! పెలిస్కోపిక్ గన్‌కోసం హంతకుడు ఆ యింటికి వస్తాడు. జాగ్రత్త!"

కుమార్ తలూపాడు.

"నేను ఐ.జి.గారిని కలిసివస్తాను! ఆయన హత్య జరిగిన వెంటనే ఒక విషయం గమనించారట!" లేచాడు శిరీష్.

7

శంకరయ్య భవనం నుండి అతడు పెరట్లోకి నడిచాడు. నూతివద్ద ఆగాడు. చకచక త్రాడూ గాలం తీశాడు. నూతిలోకి గాలం వేశాడు.

నీరు కలకబారివున్నాయి.

అతడు నుదురు చిట్లించాడు. గాభరాగా కదిలాడు.

ఫ్లాష్ తళుక్కుమన్నది.

అతడు తలెత్తి చూశాడు.

నూతికి అవతల ప్రక్కగా డిటెక్టివ్ శిరీష్. అతని చేతిలో కెమేరా!

"మిష్టర్ సారంగధరం! నువ్వు చాల తెలివిగా శంకరయ్యను చంపి, ఇంటిని స్వాధీనం చేసుకున్నావు. నీ ప్రమోషన్‌కోసం కాంతారావును చంపాలనుకున్నావ్. మంత్రిమీద రాజకీయ హత్యాప్రయత్నం జరుగుతోన్నట్టు దృశ్యం సృష్టించావు. అధికారం కోసం కాంతారావును చంపావు. కాంతారావు పొరపాటున మరణించినట్టు భావించాలని నీ వుద్దేశ్యం.

కాంతారావును కాల్చి భవనంలోంచి వెనక్కి పరుగెత్తి నీ చేతిలోని టెలిస్కోపిక్ గన్‌ని త్రాడుకట్టి నూతిలోకి జారవిడిచావు. గన్ బయటపడినా కాంతారావు పేరు బయటపడుతుంది. కాని ఆ భవనం నుండి హత్య జరిగిన వెంటనే బయటికి వచ్చింది నువ్వే!

నేనూ, కుమార్ ఈ యింటిని పరిశోధించేటప్పుడు ఇంటికి తాళం పెట్టావు. కాంతారావు స్థానంలో ముఖ్య కార్యదర్శిగా ప్రమోట్ అయినవాడివి కాబట్టి, భుజంగాన్ని ఆ విషయంలో ఒప్పించావు. అప్పుడే నీ మీద నాకు అనుమానం వచ్చింది! అంటే ఈ ఇంటి పరిసరాల్లో పరిశోధనకి పనికివచ్చే పరికరం వుందన్నమాట!

కాంతారావును కాల్చిన తుపాకీ దొరకలేదు. విషయం బయటపడింది!" అన్నాడు శిరీష్.

పోలీసులు సారంగధరాన్ని చుట్టుముట్టారు. □

"జడ్.ఏ."

"అమ్మా! నాన్న బోర్డుమీద B A. అని ఉంటుంది. ఎందుకు?"

"మీ నాన్న B.A చదివాడురా!"

"అయితే, నేను Z.A. అన్నమాట!"

"అదేంటిరా?"

"మరి నేను A నుండి Z వరకు చదివాను కదా!"

—డాక్టర్ కె. తిరుపతి రెడ్డి,
అనంతపురం.

సీరియల్



వాణిశ్రీ
కాంచన గ్రహం

(గత సంచిక తరువాయి)

"అయితే ఏమంటావు?"

"చెప్పానుగా! పాతిక లక్షలు ఇవ్వమని."

"ఇవ్వకపోతే ఏమంటావు?"

"తీసుకుంటాను. నీ బ్లాక్ డబ్బు ఎక్కడెక్కడవుందో నాకు తెలుసు."

"అసంభవం. వూరక దబాయించకు."

"సరే నీ ఇష్టం మావయ్యా! పంచితనానికి రోజులు కావు ఇవి" అన్నాడు కృష్ణ చైతన్య.

కమలకు ఏం మాట్లాడాలో తోచలేదు.

"అయితే నా ఇంట్లోనే దొంగతనం చేస్తావన్నమాట" కుపితుడై అన్నాడు విఠల్‌రావు.

చైతన్య మాట్లాడలేదు.

"వెళ్లొస్తాను. మావయ్యా! వస్తాను అత్తయ్యా! వుంటాను రాధా!" అని సెలవు తీసుకుని జీప్ స్టార్టుచేసి వెళ్ళిపోయాడు.

మేనల్లుడు వెళ్ళిపోయాక విఠల్‌రావు మాటలు మర్చిపోయినవాడిలా మౌనంగా సోఫాలో కూర్చుండిపోయాడు. తన బ్లాక్ సంపద ఎక్కడెక్కడ వుందో తెలుసని అతను అనడం కొంచెం కలవరపరిచింది. కాని తను ఎంతో తెలివితేటలు ప్రయోగించి భద్రపరిచాడు. ఆ రహస్యం కమలకు తనకూ తప్ప తన పిల్లలకు గూడా చెప్పలేదు. ఇక వీడికి ఎలా తెలుస్తుంది?

ఇన్కమ్‌టాక్సు అధికారులు గూడా దాడిచేసి ఏమీ దొరక్క వెళ్ళిపోయారు. ఇక వీడికి ఎలా తెలుస్తుంది?

విఠల్‌రావుకి మేనల్లుడిమీద కోపం పెరిగిపోతోంది. 'పాతిక లక్షలు డిమాండ్‌చేస్తున్నాడు వెధవ' పాతిక లక్షలంటే ఏమనుకుంటున్నాడో వీడు.

తన వున్నతికి వాడి తండ్రి ఇచ్చిన డబ్బు కారణం కావచ్చు. కాని అదంతా తన తెలివితేటలతోనే సాధ్యపడింది. తను ఎన్నో కష్టాలుపడి, ఎందరి నోళ్ళో కొట్టి, టాక్సులు ఎగ్గొట్టి కూడబెట్టింది వీడికి ధారా దత్తం చెయ్యడానికా!'

'పాముకు పాలుపోసి పెంచినట్లుంది గదా!' అనుకున్నాడు విఠల్‌రావు.

ఎంత ధైర్యం తెచ్చుకున్నా మనసులో ఏదో జంకుగా గుండెలో దడగా వుంది.

ఆ రోజంతా విఠల్‌రావు వర్రీతోనే గడిపాడు. అన్యమనస్కంగా తిరిగాడు. రాత్రి గడిచింది. మర్నాడు వుదయం పేపరు చదువుతూ కూర్చున్నాడు.

అతనికి కొంచెం ధైర్యం వచ్చింది. ఏమీ జరగనందుకు కపాల గూడా కొంచెం గాలి పీల్చుకుంది.

మధ్యాహ్నం అంతా లంచ్‌కి కూర్చున్నారు.

ఫోన్ మ్రోగింది.

పనిమనిషి ఫోన్ ఎత్తింది.

"అయ్యా! మీ మేనల్లుడుగారట. మాట్లాడతారంట" అని విఠల్‌రావుకి రిసీవర్ అందించింది.

"హల్లో! ఎవరూ?" అన్నాడు విఠల్‌రావు అదురుతున్న గుండెని చిక్కబట్టుకుంటూ.

"నమస్తే మావయ్యా! నేను కృష్ణచైతన్యని మాట్లాడుతున్నాను."

"నమస్తే!....నమస్తే!"

"మావయ్యా! నీ దగ్గర పనిచేస్తున్న రామశర్మ, నరసయ్య, వెంట్రావు, రంగారావుల పేర్లతో బ్యాంకు లాకర్సు ఓపెన్ చేయించావు. వాటిని నువ్వు స్వాధీనం చేసుకుని బ్లాక్ మనీ బంగారంగా మార్చి లాకర్సులో దాచావు. నీ బుర్ర అమోఘం మావయ్యా!"

"ఇదంతా నీకెలా తెలుసురా?"

"నేను తెలుసుకోలేని సంగతి ఏదీలేదు" నవ్వు వినిపించింది.

విఠల్‌రావు నోట మాటలు రావడంలేదు.

"ఆ లాకర్లు తెరిచి బంగారం నేను స్వాధీనం చేసుకున్నాను. సో....పాతికలక్షలు నాకు ముట్టినట్లే. థాంక్స్ మావయ్యా! ఈ సంగతి పోలీసులకు చెప్పవనుకుంటాను. నాకు తెలుసులే. పోనీ ఇంట్లోవాళ్ళకు చెప్పు....!"

ఫోన్ పెట్టేసిన శబ్దం వచ్చింది.

విఠల్‌రావు గుండె ఆగిపోయినట్లయింది. అక్కడ సోఫాలో కూలబడిపోయాడు.

ఇంటిల్లపాదీ కంగారుగా విఠల్‌రావు చుట్టూ మూగారు 'ఏం జరిగింది?' అంటూ.

18

పెళ్ళివారి ఇల్లులా కళకళలాడిపోతూ వుంది ఎయిర్ పోర్టు. దేశీయులు, విదేశీయులు, ప్రయాణీకులు వీడ్కోలు చెప్పి వెళ్ళడానికి వచ్చిన బంధువులు, స్నేహితులతో చాలా సందడిగా వుంది.

ఆరున్నరకు న్యూయార్కు బయల్దేరవలసిన విమానం ఇంకా సిద్ధంకాలేదు.

అంతా మాటిమాటికీ వాచీలు చూసుకుంటున్నారు. 'ట్రెయిన్లు లేటనుకుంటే ప్లెయిన్లు కూడా లేటేనా' అని విసుక్కుంది అరుణతార.

ఎనభై తొమ్మిది మంది ప్రయాణీకులతో ఆరుగురు విమాన సిబ్బందితో రాత్రి ఏడున్నరకి కారవెల్లీ బయల్దేరింది.

రన్‌వే మీద నుంచి లేచి ప్రళయశబ్దంచేస్తూ ఆకాశంలోకి యెగిరింది. విమానం లైట్లు కెంపుల్లా మెరుస్తున్నాయి.

గోవిందరాయుడు ఆకాశంలో దూసుకుపోతున్న

విమానం వంక తదేకంగా చూస్తూ నిల్చుండిపోయాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కళ్ళు తుడుచుకుని ఎయిర్ పోర్టు ఆవరణ దాటి టాక్సీలో అశోకా హోటల్‌కి వెళ్ళి పోయాడు.

అరుణతార కళ్ళు మూసుకుంది నిద్రపోవాలని. కాని నిద్రపోవడం లేదు. కళ్ళ ముందు కృష్ణచైతన్య నవ్వుతూ ప్రత్యక్షమయ్యాడు. ఆమె మనసు వికలమైంది.

కాలేజీలో చదివే రోజుల్లో తనకు ఎందరో యువకులు పరిచయమయ్యారు. కొందరు తనను ఆరాధించారు. ప్రేమిస్తున్నామని ప్రేమలేఖలు గుప్పించారు. కాని చిత్రం తను ఎవర్నీ ప్రేమించలేకపోయింది. ఎవరూ తనని ఆకర్షించలేకపోయారు. అప్పుడు చైతన్య గూడా తనకు పరిచయస్తుడే. కాని తను అప్పుడు అతన్ని చూసి స్పందించ లేదు.

తర్వాత అతను చాలా రోజుల అనంతరం కనిపించాడు. పరిచయస్తులు, స్నేహితులు లేనిచోట అతనే ముఖ్యుడయ్యాడు. విచిత్రంగా అతన్ని ప్రేమించింది. తల్చుకుంటే ఎంతో ఆశ్చర్యంగా వుంది తనకి.

యువతీ యువకుల మధ్య ప్రేమ, ఆకర్షణ కలగడానికి ఎన్నో కారణాలు వుండొచ్చు కాని అన్నిటికంటే ముఖ్యం అవకాశం అని తనకి అర్థమైంది. యువతి, యువకుడు సన్నిహితంగా మెలగడానికి అవకాశం కలిగితే చాలు వారి మధ్య ఆకర్షణ కలగడానికి, ప్రేమ వుద్భవించడానికి ఎక్కువ కాలం పట్టదు.

తనకూ చైతన్యకూ మధ్య ప్రేమ కలగడానికి, తను అతన్ని ఆరాధించడానికీ అవకాశమే తోడ్పడింది. కాని అతను తనకు అందుబాటులో లేడు. తన మనసు అతనిమీద

నుంచి మళ్ళడానికి అంగీకరించడంలేదు.

ప్రేమలో యింత బలం వుందా? అని తనకు ఆశ్చర్యం కలుగుతోంది అప్పుడప్పుడూ. లేకపోతే ముక్కూ-మొఖం తెలియని ఒక పరాయి యువకుడి కోసం తను సంవత్సరాల తరబడి ఎదురు చూడడం, తల్లిదండ్రుల మాట వినక పోవడం ఏమిటి మరి?

అరుణతార కళ్ళు చూస్తున్నాయి. కాని ఆమె ఆలోచనలు యెక్కడో పయనిస్తున్నాయి.

అంతలో ముగ్గురు యువకులు లేచి నిల్చున్నారు. వాళ్ళు ఎర్రగా ఎత్తుగా వున్నారు; ముగ్గురికీ గడ్డాలు పెరిగి వున్నాయి.

అందులో ఒకడు రివ్వున పైలెట్ దగ్గరికి వెళ్ళాడు. పిస్టల్ అతని కణతకు గురిపెట్టి "టేక్ ది ప్లెయిన్ బాక్ టూ ఢిల్లీ" అన్నాడు.

పైలట్ బిత్తరపోయి చూశాడు.

"నా మాట వినకపోతే నీకు చావు తప్పదు" పిస్టల్ అతని మెడకు గుచ్చి అన్నాడు.

మిగతా యిద్దరు ప్రయాణీకులకు పిస్టల్స్ గురిపెట్టి"డోన్ట్ మూవ్" అని అరిచారు.

ప్రయాణీకులు, ఎయిర్‌హోస్టెస్లు భయంతో వుండి పోయారు. ఎవరికి నోటా మాటలు రావడంలేదు.

పైలెట్ విమానం వెనక్కి త్రిప్పాడు.

పాలం విమానాశ్రయం దగ్గరపడింది. పైలెట్ విమానం దిగడానికి అనుమతి యివ్వమని కంట్రోల్ టవర్‌కు సంకేతం పంపాడు. అరగంటకు ముందే బయల్దేరి వెళ్ళిన విమానం మళ్ళీ వెనక్కి తిరిగి యెందుకు వచ్చిందో వాళ్ళకి అర్థంకాలేదు. ఏదైనా ట్రబుల్ వుందా ఇంజన్‌లో అని

అడిగారు. ఏమీ లేదన్నాడు పైలెట్.

"చెప్పు. నా పేరు హసన్. ప్లేయిన్ హైజాక్ చేశానని చెప్పు" అన్నాడు అతను.

"ఎందుకు? నీ కేం కావాలి?" పైలెట్ హసన్ని అడిగాడు.

"నేను ఇరాన్ వాడిని. ఇరాక్‌వాళ్ళు మా భూభాగాన్ని ఆక్రమించుకున్నారు. మా సైనికుల్ని ఖైదీ చేశారు. వెంటనే మా దేశంనుంచి వాళ్ళ సేనలు వెళ్ళిపోవాలి. మా వాళ్ళని విడిచిపెట్టాలి" అన్నాడు హసన్.

"లేకపోతే."

"ఈ విమానంలో వున్న ఇరాక్ వాళ్ళని కాల్చి చంపుతాను. అంతేకాదు కదలినవాళ్ళ ప్రాణం తీస్తాం "వికటంగా నవ్వాడు హసన్.

పైలెట్ హసన్ ముఠావాళ్ళు హైజాక్ చేసిన సంగతి, అతని కోర్కెలు కంట్రోల్‌టవర్‌కి చెప్పాడు.

విమానం దిగడానికి అనుమతి యిచ్చారు.

కారవెల్లి పాలెం విమానాశ్రయంలో దిగింది.

ప్రయాణీకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కూర్చున్నారు.

19

ఢిల్లీనుంచి న్యూయార్కు బయల్దేరిన ప్లెయిన్ హైజాకర్ల కష్టడీలో వుందనీ, వాళ్ళ షరతులు మర్నాడు ప్రపంచంలోని అన్ని దినపత్రికలూ ప్రముఖంగా ప్రచురించాయి.

అశోక్ హోటల్ రూమ్‌లో కూర్చొని వార్తలు వింటున్న గోవిందరాయుడు అదిరిపోయాడు. హడావుడిగా టాక్సీ వేసుకుని పాలెం విమానాశ్రయానికి బయల్దేరాడు.

ఎయిర్‌పోర్టు అంతా గందరగోళంగా వుంది. దూరంగా

హైజాక్ చేయబడిన కారవెల్లీ ఆగి వుంది. లోపల యేం జరుగుతుందో యెవరికీ తెలియడంలేదు. ఎయిర్‌పోర్టు ఆవరణలో రిజర్వు పోలీసులు తుపాకులు పట్టుకుని సిద్ధంగా వున్నారు.

ఇండియా ప్రభుత్వం ఇరాక్ ప్రభుత్వానికి హైజాకర్ల షరతులు తెలియచేసింది. కొన్ని దేశాలు యుద్ధం ఆపి యుద్ధ ఖైదీలను విడిచిపెట్టి విమానంలోని ప్రయాణీకుల ప్రాణాలను కాపాడవలసిందిగా ఇరాక్ అధినేతలకు విజ్ఞప్తులు పంపాయి.

ఇరాన్ ప్రభుత్వం కుట్ర చేసిందని ఇరాక్ ప్రభుత్వం ఆరోపించింది. యుద్ధం జరుగుతూ వుండగా ఇలా జరగడం అనుచితమని ఇరాక్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.

హైజాకర్స్‌తో తమకు ఏ మాత్రం సంబంధం రాలేదని ఇరాన్ ప్రకటించింది.

ప్రయాణీకులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని క్షణమొక యుగంగా గడుపుతున్నారు.

ఇక వాళ్ళ బంధువులు దాదాపు పాలం విమానాశ్రయంలో నిండిపోయి యేడుపులు, మొత్తుకోళ్ళు సాగించారు. ఎయిర్ పోర్టు శరణార్థుల శిబిరంలా తయారయింది.

ఈ సమస్య ఎలా ఎదుర్కోవాలో అర్థంకాక ఇరాక్ అయోమయంలో పడిపోయింది.

కృష్ణచైతన్య అప్పుడు ఢిల్లీలోనే వున్నాడు. అతని క్లాస్‌మేట్ శశిభూషణ్ డాక్టరుగా మెహతా నర్సింగ్ హోమ్‌లో పని చేస్తున్నాడు. అక్కడే లేడీడాక్టర్‌గా పని చేస్తున్న బెంగాలీ అమ్మాయి సబితని పెళ్ళి చేసుకున్నాడు. వివాహానికి హాజరైనవారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఒక

దినపత్రికలో వారి ఫొటోలు గూడా వేయించారు. చైతన్య, శశిభూషణ్ అడ్రస్ తెలుసుకుని ఢిల్లీ వెళ్ళాడు.

శశిభూషణ్ అతన్ని కొన్ని రోజులవరకూ కదలనివ్వ లేదు. కన్నాట్ ప్లేస్‌లో వాళ్ళ ఫ్లాట్‌లోనే చైతన్య వుంటున్నాడు.

ఆ రోజు డాక్టర్ సవిత అర్జెంట్ డెలివరీకేసు అటెండ్ కావడానికి హాస్పటల్‌కి వెళ్ళింది. ఇంట్లో ఇద్దరే వున్నారు. ఏదైనా మూవీ చూద్దామని శశిభూషణ్ ప్రపోజ్ చేశాడు. డ్రెస్ చేసుకుంటూ వుండగా గురుమూర్తి వచ్చాడు.

గురుమూర్తి తెలుగువాడే. ఒక యం. పీ. గారి అబ్బాయి. శశిభూషణ్‌కి నర్సింగ్‌హోమ్‌లో పరిచయమయ్యాడు. తెలుగు డాక్టరని శశిభూషణ్ అంటే అతనికి అభిమానం.

"రావోయ్ గురుమూర్తీ!" అంటూ ఆహ్వానించాడు శశిభూషణ్.

గురుమూర్తి లోపలకు వచ్చి కృష్ణచైతన్య వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

శశిభూషణ్ గురుమూర్తికి చైతన్యను పరిచయం చేశాడు.

"ఎక్కడికో బయల్దేరుతున్నారే!" అన్నాడు గురుమూర్తి.

"పిక్చర్‌కి బయల్దేరాం" అన్నాడు శశిభూషణ్.

"పిక్చర్స్ మంచివేఁమున్నాయి యిప్పుడు?"

"ఏదో కాలక్షేపం" నవ్వాడు శశిభూషణ్.

"కాలక్షేపానికి సినిమాకే వెళ్ళాలా! నా వెంట రండి బ్రహ్మాండమైన కాలక్షేపం" అన్నాడు గురుమూర్తి.

"ఎక్కడికి తీసుకెళ్తావ్? క్యాబరేకా?" అన్నాడు శశి

భూషణ్.

"నో....నో....నాకు అటువంటివి పడవని నీకు తెలియదా! పదండి ముందు. తినబోతూ రుచి అడగనేల!" అన్నాడు గురుమూర్తి పకపక నవ్వుతూ.

"కృష్ణా! ఏమంటావ్?"

"నాదేముంది? అయామ్ రెడీ" అన్నాడు చైతన్య.

ముగ్గురూ బయల్దేరారు ఫ్లాట్ కి తాళం వేసి.

గురుమూర్తి టాక్సీ పిలిచాడు. టాక్సీ అరగంటసేపు ప్రయాణంచేసి ఒక పెద్ద భవనం ముందు ఆగింది.

"మొహన్‌లాల్ అని గొప్ప కోటీశ్వరుడి బిల్డింగ్ ఇది. ఆయనకి హోటల్స్, సినిమా థియేటర్స్, ఫ్యాక్టరీస్ వగైరా యెన్నో వున్నాయ్" అన్నాడు గురుమూర్తి టాక్సీ దిగుతూ.

అది విశాలమైన ఆవరణలో నిర్మించబడిన మూడంతస్థుల భవనం.

చైతన్య టాక్సీ దిగి ఆ భవనంవైపు యెగాదిగా చూశాడు.

"భక్తులకు సుస్వాగతం" అని పెద్ద బోర్డు డెకరేషన్ బల్బులతో అలంకరించారు. భవనం లాన్స్‌లో పెద్ద పెద్ద షామియానాలు, వాటిల్లో కుర్చీలు, ట్యూబ్‌లైటు వెలుగులో ఆడ మగా అంతా తన్మయత్వంతో భజనలు చేస్తూవుండడం గమనించి "ఇక్కడా మీ కాలక్షేపం?" అన్నాడు చైతన్య చిరునవ్వుతో.

"ఏం మీకు నచ్చవా?" అన్నాడు గురుమూర్తి ముఖం మాడ్చుకుని.

"ఐ డోంట్ లైక్" అన్నాడు కృష్ణచైతన్య సీరియస్‌గా.

"ఏదో వచ్చాం గదా! కాసేపు కూర్చుని పోదాం" అన్నాడు శశిభూషణ్.

ప్రవేశద్వారం దగ్గర ముగ్గురు అమ్మాయిలు అప్సరసల్లా అలంకరించుకొని నిల్చొని వచ్చే వాళ్ళని ఆహ్వానిస్తున్నారు.

తెల్లచీరలో వున్న అమ్మాయి పన్నీరు చల్లుతోంది. గులాబీరంగు చిన్నది గులాబీపువ్వు అందిస్తోంది. ఆకుపచ్చ చీరలో వున్న కన్య అఖండస్వామి ఆశ్రమం వివరాలు వున్న బ్రోచర్ పంచిపెడుతోంది.

ముగ్గురూ వెళ్ళి ఖాళీగా వున్న కుర్చీల్లో కూర్చున్నారు. అక్కడున్న ఆడ మగా అంతా ధనవంతులే. సామాన్యులెవరూ మచ్చుకు గూడా కనిపించడంలేదు. మైక్‌లో భక్తులు చేస్తున్న భజన చెవులు బ్రద్దలు కొడుతున్నాయి.

కాసేపటికి స్టేజీమీద అఖండస్వామి కాషాయ వస్త్రాలు ధరించి దర్శనం యిచ్చాడు. జడలు కట్టిన తల, ముఖాన ఎర్రటి కుంకుమ, మెడలో రుద్రాక్షలు ఎత్తుగా లావుగా వున్నాడాయన. ఇంగ్లీషులోను, తర్వాత హిందీలోను గీతా రహస్యాలు, ధర్మబోధ చేశాడు.

కానుకలు సమర్పించుకున్న భక్తులను అఖండస్వామి ఆశీర్వదిస్తున్నాడు. గడ్డంలో నుంచో జడల్లో నుంచో శివ లింగాలు, విభూది, తాయత్తులు, యిస్తూ తన మహిమ ప్రదర్శిస్తున్నాడు.

సాష్టాంగాపడి పాదాభివందనాలు చేసేవాళ్ళు ఎవరైనా గానీ వాళ్ళు దొంగలు కానీ, దోపిడీదార్లు కానీ, ఖూనీకోర్లు కానీ అఖండస్వామికి అభ్యంతరం లేదు. అందరి నుంచీ కానుకలు స్వీకరిస్తున్నాడు. అందర్నీ దీవిస్తున్నాడు.

కృష్ణచైతన్యకి సహనం చచ్చిపోతోంది. గురుమూర్తి

అఖండస్వామి దర్శనం చేసుకుని, నుదుట విభూది నామాలు పెట్టుకుని తన్మయుడై పోయాడు. అతను యిప్పట్లో కదిలే సూచనలు ఏవీ కనిపించడంలేదు.

"భూషణ్ మనం పోదామా?" అన్నాడు చైతన్య.

శశిభూషణ్ "వూఁ" అన్నాడు. అతనికీ విసుగ్గానే వుంది ఈ తతంగం.

"కొంచెంసేపు కూర్చుందాం" అన్నాడు గురుమూర్తి.

"నాకు బోర్‌గా వుంది. ఏ మాత్రం కూర్చోలేను" అన్నాడు చైతన్య లేచి నిల్చుని.

శశిభూషణ్ గూడా లేచి "సరే నువ్వు వుండిపో. మేం వెళ్ళిపోతాం...." అన్నాడు గురుమూర్తిని వుద్దేశించి.

"నేనూ వస్తాలే" అంటూ అయిష్టంగానే లేచాడు గురుమూర్తి.

మోహన్‌లాల్ భవనం నుంచి బైటపడి రోడ్డుమీదకు వచ్చారు. ఆటో, టాక్సీలాటివి యేవీ దొరకలేదు. కొంత దూరం నడిచారు. బాంబే రెస్టారెంట్ కనిపించింది.

"టీ తీసుకుందాం" అని శశిభూషణ్ రెస్టారెంటులోకి దారితీశాడు.

గురుమూర్తి అఖండస్వామి మహిమల గురించి పొగడ్డం ప్రారంభించాడు.

"గురుమూర్తిగారూ? మీరేమీ అనుకోకపోతే నేనొక మాట చెప్పనా?" అన్నాడు కృష్ణచైతన్య.

"చెప్పండి. దాందేముంది! ఎవరి అభిప్రాయాలు వారివి" అన్నాడు గురుమూర్తి. చైతన్య ప్రవర్తన మాటలుబట్టి అతను ఏం చెప్తాడో లీలగా గ్రహించాడు.

"అఖండస్వామి ఒక మోసగాడు. ఆయన చేసే ట్రిక్కులు ఎవరయినా చెయ్యొచ్చు. మనలో వున్న బల

హీనతలు ఆధారం చేసుకుని హాయిగా సంపాదిస్తూ సుఖ జీవితం గడుపుతున్నాడు. మనలాంటి చదువుకున్నవాళ్ళు గూడా వాళ్ళ మాయలో పడి కొట్టుకోవడం విచారకరం" అన్నాడు చైతన్య.

గురుమూర్తి ముఖం ఎర్రబడిపోయింది. అతనికి వుక్రోషం వచ్చినట్లు చూస్తుంటేనే తెలుస్తోంది.

"ఇఫ్ యూ డోంట్ మైండ్! మీరు చెయ్యగలరా ఆ ట్రిక్కులు!" సీరియస్‌గా అన్నాడు గురుమూర్తి.

వీళ్ళిద్దరూ ఎక్కడ పోట్లాడుకుంటారోనని శశిభూషణ్‌కి భయంవేసి "ప్లీజ్ లీవ్ ద పాయింట్" అన్నాడు మిత్రులిద్దర్నీ వుద్దేశించి.

ఇంతలో వెయిటర్ వచ్చి నిల్చున్నాడు. శశిభూషణ్ "మూడు టీ" అన్నాడు.

వెయిటర్ తలవూపి వెళ్ళిపోయాడు.

"అంతకంటే గొప్పవే చేయగలను" అన్నాడు చైతన్య నవ్వుతూ-

గురుమూర్తి తెల్లబోయాడు.

శశిభూషణ్ వింతగా చూశాడు.

"యస్ మిష్టర్ గురుమూర్తీ! శాంపిల్‌గా ఇప్పుడే చూపిస్తాను. ఇది మీ అఖండస్వామి చెయ్యలేడు గూడా. శశిభూషణ్ వెయిటర్‌కి మూడు టీ తీసుకురమ్మని ఆర్డర్ ఇచ్చాడు. అవునా?"

గురుమూర్తి తల వూపాడు.

"వెయిటర్ మూడు కాఫీ తీసుకొచ్చేటట్లు చేస్తాను చూడండి" అన్నాడు చైతన్య.

గురుమూర్తి బిత్తరపోయి చూశాడు.

శశభూషణ్‌కి ఏమీ అర్థం కావడంలేదు.

అపరాధ పరిశోధన పోటీ-163

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు **7-2-82** తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు మార్చి '82 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. సైనికపాలన ఏర్పడిన మరో దేశం ఇది:—
   (పోలెండ్, అఫ్ఘనిస్తాన్)
2. మానవ రక్తం పీల్చటం వీటికెంతో ఇష్టం?—
   (దోమలు, నల్లులు)
3. వీళ్ళకు జాలి, కరుణ వుండవు:—
   (హంతకులు, కసాయివాళ్ళు)
4. వీళ్ళు స్టంటు మాస్టర్లా?—
   (మంత్రులు, హీరోలు)
5. ఈ సంగీతంపై జనం మోజు పెంచుకుంటున్నారు?—
   (డిస్కో సంగీతం. శాస్త్రీయ సంగీతం)

"ఇది ఎలా సాధ్యం?" అని మనసులో అనుకున్నాడు.

కృష్ణచైతన్య ఏం చేస్తాడోనని ఇద్దరూ అతన్నే తదేకంగా చూడసాగారు. కాని అతను కూర్చున్న చోటనుంచి లేవలేదు. మూడు కప్పులు ట్రేలో పట్టుకుని వస్తున్న వెయిటర్ దూరం నుంచి చూశాడు. ఎందుకో ఆగిపోయాడు. వెనక్కి తిరిగి కిచెన్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. కొంచెంసేపటకి తిరిగి వచ్చాడు మూడు కప్పులున్న ట్రేతో.

ట్రే టేబుల్‌మీద పెట్టి మూడు కప్పులు, సాసర్లు ముగ్గురి ముందూ సర్దాడు వెయిటర్.

గురుమూర్తి ఆత్రుతగా కప్పు వాసన చూశాడు. అది కాఫీయే.

చైతన్య వంక ఆశ్చర్యంగా చూశాడు గురుమూర్తి.

కృష్ణచైతన్య చిరునవ్వు నవ్వాడు.

"నేను టీ చెప్పాను గదా! కాఫీ తెచ్చావెందుకు?" వెయిటర్‌ని ప్రశ్నించాడు శశిభూషణ్.

వెయిటర్ తెల్లబోయి చూశాడు.

"మీరు టీ చెప్పారా?" అని ప్రశ్నించాడు తడబడుతూ.

"అవును."

"ముందు టీ తెచ్చాను సార్! కాని కాఫీ చెప్పినట్లు అనిపించింది రిటన్ తీసికెళ్ళి కాఫీ తెచ్చాను సార్! సారీ సార్ మళ్ళీ ఇప్పుడు టీ తీసుకొస్తాను" అన్నాడు వెయిటర్.

"డోంట్ మైండ్" అని శశిభూషణ్ కప్పులోని కాఫీ సాసర్లో పోసుకున్నాడు.

గురుమూర్తికి అంతా అయోమయంగా వుంది. కలా? నిజమా? అనిపించింది.

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 41: రఘు, రవి అనే ఇద్దరు స్టూడెంట్స్ ఒక షాపుకు వెళ్ళారు. అక్కడ ఏదో విషయంలో గలాటా వచ్చి ఇద్దరూ కలిసి కొంత ఫర్నిచర్ నాశనం చేశారు.

షాపు యజమాని రవి, రఘు పైన దావా వేసిరు. 500/-లు నష్టపరిహారానికి జడ్జిమెంట్ పొందాడు. ఆ మొత్తాన్ని రవి చెల్లించివేశాడు.

తర్వాత ఆ మొత్తంలో సగం రఘుని ఇవ్వమని అడగ్గా ఇవ్వను పొమ్మన్నాడు. రవి మీ దగ్గరకొస్తే మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-2-'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు ఏప్రెల్' 82 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 39 (తీర్పు)

రత్నలాల్ డబ్బు ఇచ్చుకోవాలి.

ఉద్యోగ విధిలో నౌకరు చేసే నమ్మకద్రోహానికి యజమాని బాధ్యుడు. అందువలన శేట్ ఆ డబ్బును శాంతాదేవికి చెల్లించాలి.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీ గౌరి శంకరరావు, బి.కాం., c/o తొంటెపు సత్యనారాయణ మూర్తి, ఐరన్ అండ్ హార్డువేర్ మర్చంట్స్, రాజమండ్రి - 533 101.

"మరొక శాంపిల్ చూపిస్తాను చూడండి. ఇప్పుడు టైమ్ ఎంతయింది?" అన్నాడు చైతన్య.

"ఎనిమిదీ పది" గురుమూర్తి తన వాచీవంక చూసు కుంటూ అన్నాడు.

పది నిముషాలు పోయాక చైతన్య అన్నాడు "ఇప్పుడు టైమెంత మిష్టర్ గురుమూర్తీ?"

గురుమూర్తి తన వాచీవంక చూసుకుని తెల్లబోయాడు. అతని వాచీలో పన్నెండూ ఇరవై నిమిషాలు అయింది.

గురుమూర్తి ముఖం చెమటతో తడిసింది. చైతన్య ఒక మాంత్రికుడిలా కనిపించాడు.

"ఇటువంటివి మీ అఖండస్వామి చెయ్యగలడా!" అన్నాడు చైతన్య.

గురుమూర్తి మాట్లాడలేదు.

వెయిటర్ బిల్లు టేబుల్ మీద వుంచాడు. చైతన్య బిల్లు తీసుకుని "మరొక విచిత్రం చూపిస్తాను. కౌంటర్లో చూడండి" అన్నాడు.

బిల్లు మూడురూపాయలు. చైతన్య బిల్లుతోపాటు పది కాగితం కౌంటర్లో వ్యక్తికి అందించాడు.

అతను తిరిగి తొంభై ఏడురూపాయలు లెక్కపెట్టి చైతన్య చేతికి అందించాడు.

"నేను ఇచ్చిన కాగితం ఎంత?"

"వంద నోటు సార్!" కౌంటర్లో వ్యక్తి చైతన్యతో అన్నాడు.

"కాదు పదినోటు" అన్నాడు చైతన్య.

ఆ వ్యక్తి నాలిక కరచుకుని "ఐ యామ్ సారీ సర్!" అని ఏడు రూపాయలు తిరిగి ఇచ్చాడు. చైతన్య వంక కృతజ్ఞతాపూర్వకంగా చూసి "థాంక్యూ వెరీ మచ్. మీరు

అపరాధ పరిశోధన పోటీ-161

[ఫలితాలు]

డిసెంబరు'81 నెల "అపరాధ పరిశోధన పోటీ— 161"కి సరియైన సమాధానాలు:

1. ఖలిస్తాన్.
2. స్మగ్లర్లు.
3. వ్యభిచారం.
4. కలకత్తా.
5. హంతకుల మీద.

పై జవాబుల ప్రకారం ఇద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మార్చి '82 నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) కుమారి పి. మల్లీశ్వరి,
ఓ.సి. 'ఏ'/పి అండ్ జి.ఏ. డివిజన్,
ఇ.ఎమ్. అండ్ డబ్ల్యు సెక్షన్,
శ్రీహరికోట - 524 124.

(2) శ్రీ బి. వెంకటేశ్వర రెడ్డి,
మెసర్స్ యునైటెడ్ మొజాయిక్,
26-9-1, రామారావు స్ట్రీట్,
గాంధీనగర్,
విజయవాడ - 520 003,

మంచివారు కాబట్టి తిరిగి ఇచ్చారు. వేరే ఎవరయినా ఐతే గప్‌చిప్‌గా జేబులో వేసుకుని పోయేవారు'' అన్నాడు.

ముగ్గురూ రెస్టారెంటులో నుంచి రోడ్డుమీదకు వచ్చారు. చైతన్య నవ్వాడు.

“ఇలాంటివి యెన్నో చెయ్యొచ్చును'' అన్నాడు.

గురుమూర్తి ఏమీ మాట్లాడలేదు. ఒక ఆటో వచ్చింది. అందులో ఎక్కి వెళ్ళిపోయాడు గురుమూర్తి.

ఇంటికి వచ్చాక శశిభూషణ్ అడిగాడు “ఎలా చేశావు అవన్నీ.''

“సైకోట్రానికల్ పవర్'' అన్నాడు చైతన్య నవ్వుతూ.

“నీలో ఏదో ప్రత్యేకత వుందని నాకు అనుమానంగా వుంది. రేపు మా ఇనిస్టిట్యూట్‌లో నిన్ను మా వాళ్ళకి పరిచయం చేస్తాను'' అన్నాడు శశిభూషణ్.

“నో....నాకు అటువంటి పబ్లిసిటీ ఇష్టం లేదు'' తల అడ్డంగా వూపాడు చైతన్య.

“ఇందులో పబ్లిసిటీ ఏముంది?''

“ఎందుకు లేదూ? పత్రికలవాళ్ళు వస్తారు. గోరంతలు కొండంతలు చేసి రాస్తారు. అదొక న్యూసెన్సు'' అయిష్టంగా అన్నాడు చైతన్య.

“అటువంటిదేమీ లేకుండా చుస్తాను. మా సైన్సు ఇనిస్టిట్యూట్ మంత్లీ కాన్ఫరెన్సు వుంది రేపు. దానికి పత్రికల వాళ్ళు ఎవరూ రారు. సైన్సు, మెడికల్ రిసెర్చి వ్యాసాలు కొందరు చదువుతారు అంతే'' అన్నాడు భూషణ్.

“రేపటి సంగతిగదా చూద్దాంలే'' అన్నాడు చైతన్య.

20

మర్నాడు సాయంకాలం శశిభూషణ్, అతని భార్య సవిత, చైతన్యను బలవంతపెట్టి మెడికల్ అండ్ సైన్సు

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 50/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—2—'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హో౦.డె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు ఏప్రెల్ '82 నెల సంచికలో చూడండి.

డిసెంబరు '81 పోటీ ఫలితాలు

(1) డిసెంబరు '81 నెల "అపరాధపరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మంచు కొండల్లో శత్రువు!
గాజు గ్లాసులో మృత్యువు!!

పంపినవారు : శ్రీమతి టి. జె. విజయశాంతి, బి. కాం., బర్కత్‌పురా చమన్, హైద్రాబాదు - 500 027.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

చాటు మాటు నేస్తం!
రక్త సిక్త హస్తం!!

పంపినవారు : శ్రీ యన్. సత్యానంద్, మెయిన్‌రోడ్, బెల్లంపల్లి - 504 251, ఆదిలాబాదు జిల్లా.

పై విజేతలు ఇరువురికీ చెరొక రు. 25/-లు బహుమతి పంపబడుతుంది.

ఇనిస్టిట్యూట్ మంత్లీ కాన్ఫరెన్సుకి తీసుకెళ్ళారు.

సమావేశం పూర్తయ్యాక డిన్నర్ జరిగింది. అంతా లాన్‌లో కూర్చున్నారు. ఇనిస్టిట్యూట్ ప్రెసిడెంట్ డాక్టర్ భార్గవ, సెక్రటరీ డాక్టర్ కపూర్లు పిచ్చాపాటీ ముచ్చటించు కుంటూవుండగా శశిభూషణ్ చైతన్యని వారికి పరిచయం చేశాడు.

"చైతన్య సామాన్యమైన వ్యక్తి కాదు. ఇతనిలో సైకో ట్రానిక్ పవర్ వుంది" అంటూ రాత్రి తను అతను చేసిన అద్భుతాలు వివరించాడు.

డాక్టర్ భార్గవ అమాంతం లేచి కరచాలనం చేసి "ఐ యామ్ వెరీ హేపీ టూ మీట్ యూ!" అంటూ సంతోషం వ్యక్తంచేశాడు.

"ఈ విచిత్రమైన శక్తి సాధించిన వ్యక్తిని మనవాళ్ళం దరికీ పరిచయం చెయ్యాల్సిందే" అంటూ డాక్టర్ కపూర్ అటెండర్ ద్వారా అందరికీ కబురుచేశాడు కాన్ఫరెన్సు హాల్లోకి చేరమని.

చైతన్యకి అదంతా ఇష్టం లేకుండా వుంది. మొగమాట పడుతూ వాళ్ళని అనుసరించాడు.

డాక్టర్ కపూర్ సైకోట్రానిక్ పవర్ వున్నమాట నిజమేనసీ, ఇటువంటి వ్యక్తులు అరుదుగా వుంటారనీ సోదాహరణంగా వివరించాడు.

హాల్లో కూర్చున్న డాక్టర్ చినాయ్ అడ్డు తగిలి "ఆయన్ని మనం క్షుణ్ణంగా పరీక్షించి పరిశోధనా వ్యాసం తయారుచేస్తే మంచిది. ఇది సైన్సుకి ఎంతో వుపయోగ పడుతుంది" అని సూచించాడు.

చాలామంది డాక్టర్లు చినాయ్ ప్రతిపాదన బాగుందని కేకలు పెట్టారు.